ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విశాఖపట్నం : fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-3-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 33 పేజీలు: 16 వెల: 6.50

అమెరికా ఆయుధ సంపద ఆవిరి!
పాక్, అఫ్ఘాన్ మధ్య వార్ ఉధృతం
5లో

వార్-5



## ఇరానీ నౌకను ముంచేసిన అమెరికా

శ్రీలంక తీరంలో ఘటన: 80మంది గల్లంతు

ఇరాన్ అణుస్థావరం ధ్వంసం

విజృంభించిన అమెరికా, ఇజ్రాయెల్ దళాలు

ఖమేనీ జన్మస్థలంలోనే అంత్యక్రియలకు ఏర్పాట్లు

ఇరాన్ కొత్త సుప్రీంనేతగా ముజ్తబా ఖమేనీ

**టెహ్రాన్,మార్చి 4:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాల మూకుమ్మడిదాడి మరింత ఉధృతం అవుతోంది. ఇరాన్ నగరాలే లక్ష్యంగా అమెరికా నిఘా సమాచారంతో ఇజ్రాయెల్ దాడులు కురిపిస్తోంది. ముందురోజు ఇరాన్ అధ్యక్ష కార్యాలయం పేల్చేసామని చెప్పి ఇజ్రాయెల్ బుధవారం ఇరాన్ అణు రహస్య స్థావరాన్ని ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. ఇదిలా ఉంటే భారత్ మిలన్ నేవీ కసరత్తుల్లో పాల్గొన్న ఇరాన్ నౌకను శ్రీలక సముద్రజలాల్లో అమెరికా జలాంతర్గామి పేల్చివేసింది. దీనితో నౌకలో ఉన్న 80మంది చనిపోయారు. క్రూసిబ్బంది 33 మందిని శ్రీలంక నేవీ అధికారులు రక్షించారు. మరో 146మంది నావికుల ఆచూకీ గల్లంతయింది. ఈ నౌకను తామే కూల్చివేసామని అమె రికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ సైతం ప్రకటించడం గమనార్హం. ఇదిలా ఉంటే ఇరాన్ గల్ఫ్‌దేశాలపై చేస్తున్న దాడులు మరింత పెరిగాయి. తాజాగా సౌదీలోని అతిపెద్ద చమురు కంపెనీ ఆరామ్‌కోపై దాడిచేయడంతో ఆసంస్థ ఎగుమతులు, చమురుశుద్ధి, సరఫరాలను మొత్తం నిలిపివేసింది. అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ తీవ్రదాడులుచేసింది. అమెరికా కమ్యూ నికేషన్, రాడార్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఖతార్‌లో ఉన్నకీలక స్టేషన్‌పై ఇరాన్ >>2

# ఆరు లక్షలుపైగా ఉద్యోగాలు

20 నెలల్లో ఇచ్చామన్న సిఎం చంద్రబాబు

పేరున్న ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి..

గత పాలనలో భారీ ఎక్సైజ్ కుంభకోణం

పిపిపి విధానమంటే ప్రైవేటుకాదు: అసెంబ్లీలో సిఎం



**విజయవాడ, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 20నెలల్లో 6.28లక్షల మందికి ఉద్యోగాల కల్పించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ మేరకు ఎంఎస్ఎంఈలో 2.48 లక్షలు, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 1.46 లక్షలు, పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. మెగా డీఎస్సీ, పోలీసుకానిస్టేబుళ్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు 30,500 కల్పించామని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చామని..అంతకంటే ఎక్కువ ఉద్యోగాలే కల్పించి హామిని నిలబెట్టుకుంటామని ఉద్ఘాటించారు. ఇందుకోసం ఓ కమిటీని కూడా నియమించామని అన్నారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ, ఉద్యోగాల కల్పన, వైద్య, విద్య తదితర రంగాలపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. అసెంబ్లీలో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ "2019-24 మధ్య ఎపి బ్రాండ్ పూర్తిగా దెబ్బతిన్నది. జాకీ, అమర్ రాజా, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ లాంటి కంపెనీలు రాష్ట్రాన్ని వదిలిపెట్టి పోయాయి. వైసీపీ ఉన్నంత వరకూ ఏపీకి తిరిగిరామని చెప్పి మరీ ఆ కంపెనీలు వెళ్లిపోయాయి. పూర్తిగా నెగెటివ్ ఇమేజ్‌ని సృష్టించి గత పాలకులు వెళ్లారు. 2019-20 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 913 కంపెనీలు మూతపడినట్టు ఆర్బీఐ నివేదికలో పేర్కొంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే చిరునామా ఏపీ ఉండేది. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ ఉంది. 26 పాలసీలతో వేగంగా పెట్టుబడులకు అనుమతులు ఇస్తున్నాం. పర్యాటకానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. అలాగే పారిశ్రామిక ప్రోత్సాహకాలను కూడా రూ.210 కోట్ల మేర విడుదల చేశాం. ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో రూ.13.25లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వాటిద్వారా 16 లక్షలమందికి ఉద్యోగాలు వస్తాయి. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లు అభివృద్ధి చేస్తున్నాం. 2047కు 2.4ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ తయారవుతుంది. విశాఖ ఐటీ, జీసీసీల కేంద్రంగా తయారవుతుంది. ఎవరూ ఊహించనన్ని పెట్టుబడులు విశాఖకు వచ్చాయి అని ముఖ్యమంత్రి అన్నారు.

"అమరావతికి క్వాంటం లాంటి ఎకోసిస్టం వస్తోంది. తిరుపతిని కూడా స్పేస్, ఎలక్ట్రానిక్స్, డిఫెన్సు పరిశ్రమలతో అభివృద్ధి చేస్తాం. గూగుల్, టాటా, టీసీఎస్ లాంటి పెద్ద కంపెనీలు విశాఖకు వచ్చాయి. ఆర్సెలార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమ వస్తోంది. 20 నెలల్లోనే ప్రపంచంలోనే పేరున్న పరిశ్రమలు కంపెనీలు ఏపీకి వచ్చాయి. ఈ నెలలో ఆర్సెలార్ మిట్టల్, వచ్చే నెలలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. ఏఎం గ్రీన్ ద్వారా గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి కూడా శ్రీకారం చుట్టాం. ఎన్టీపీసీ ద్వారా 1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ తయారీ కోసం కూడా ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. టాటా సంస్థ కూడా రూ.6 వేల కోట్ల పెట్టుబడులతో యూనిట్ ఏర్పాటు చేయబోతోంది. ఇలా ప్రముఖ సంస్థలన్నీ రాష్ట్రానికి పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. భవిష్యత్తులో ఈ పెట్టుబడులను సుస్థిరం చేయడానికి పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతాను ఏర్పాటు >>2



# లొంగిపోయిన గణపతి?

మావోయిస్టు పార్టీ అగ్రనేత ఢిల్లీలో లొంగిపోయినట్లు సమాచారం

**హైదరాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీకి వెన్నుదన్నుగా వున్న ఆ పార్టీ అగ్రనేత గణపతి ఢిల్లీలో లొంగిపోయిన ట్లుగా వార్తలు వస్తున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో గురువారం నాడు ఢిల్లీలో గణపతి లొంగుబాటుపై మీ డియా సమావేశం నిర్వహించే వీలుందని తెలిసింది. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో పాటు డిజిపి శివధర్ రెడ్డి, ఎస్ఐబి ఐజి సుమతి సహా కొందరు ఉన్నతాధికారులు ప్రస్తుతం ఢిల్లీలోనే వుండడంతో గణపతి లొంగుబాటుపై వార్తలకు బలం చేకూరింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను సిఎం రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం ఢిల్లీలో కలవడం ఈ అంశానికి మరింత ప్రాధాన్యత >>2

## అందరికి 'ఫ్యామిలీ కార్డు'లు

సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కారు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దీనికి అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్(ఎఫ్‌బీఎంఎస్)పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలోని తన చాంబర్‌లో సమీక్ష జరిపారు. ఫ్యామిలీ ఐడీ, ఆధార్ నెంబర్, రైస్ కార్డ్ ఐడీ, విద్యార్హతలు, వృత్తి, మొబైల్ నెంబర్, చిరునామా, వ్యవసాయ భూమి, అర్బన్ రూరల్ ప్రాపర్టీ వంటి మొత్తం 26 ఆట్రిబ్యూట్స్‌తో ఫ్యామిలీ డేటాబేస్ రూపొందించాలని ఈ సందర్భంగా >>2



## ఫిలిం,టెలివిజన్ హబ్‌గా ఎపి :

మంత్రి కందుల దుర్గేష్

**సచివాలయం,మార్చి 4,ప్రభాతవార్త :** రాష్ట్రాన్ని సినీ,టెలివిజన్ రంగానికి ప్రధానకేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని తన చాంబర్‌లో టెలివిజన్ ఫ్రెటర్నిటి ఫోరం సభ్యులు ఎఫ్‌డిసి ఎండి విశ్వనాథన్‌తో కలసి మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుల్లితెర కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు,పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గత >>2

## 15 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు

భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు: మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ, మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వరి పంట సాగు విస్తీర్ణాన్ని సమతుల్యం చేస్తూ రైతులను లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల వైపు దారితీసే స్పష్టమైన విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసెంబ్లీలో తెలిపారు. క్రాప్ డైవర్షన్, మద్దతు ధరలు, సేంద్రీయ వ్యవసాయం, కౌలు రైతుల రుణాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ, 2025-26 క్రాప్ ఇయర్‌కు రాష్ట్రంలో వరి సాగు చేస్తున్న రైతులు మొత్తం 38.97 లక్షల మంది ఉన్నారని, అందులో ఖరీఫ్ 26.94 లక్షలు, రబీ 12.03 లక్షల మంది ఉన్నారని వెల్లడించారు. అధిక వరి సాగు ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల వంటి పంటలను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు, నాణ్యమైన విత్తనాల సరఫరా, సాంకేతిక మార్గదర్శకాలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2025-26 సంవత్సరానికి సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి ప్రణాళిక అమలు చేస్తున్నామని, ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా ఆధునిక విత్తనాలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, మార్కెట్ అవసరాలు, నీటి లభ్యత నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణ అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యాయని, సాగునీటి లభ్యత పెరిగినప్పటికీ వరిపై అధిక ఆధారపడటం రైతులకు గిట్టుబాటు కాదని తెలిపారు. వరిని పూర్తిగా మానేయాలని ప్రభుత్వంచెప్పడం లేదని, అయితే పాతవంగడాల బదులు నాణ్యమైన, ఎగుమతులకు అనుకూలమైన >>2

# 'ఆంధ్రా మోడల్' ఆదర్శం



విద్యారంగ సంస్కరణల్లో ఎపి ముందుకు

100% అక్షరాస్యత కోసం ప్రత్యేక ప్రాజెక్టు: మంత్రి లోకేష్

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రపంచానికి చూపిస్తామని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ బడ్జెట్ రూ.32,308 కోట్లు, ఉన్నత విద్యాశాఖ రూ.2,566 కోట్ల బడ్జెట్ డిమాండ్లపై మంత్రి అసెంబ్లీలో మాట్లాడుతూ ఏపీలో 100శాతం అక్షరాస్యత సాధించేలా ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. విద్యార్థులను యాక్టివ్ లెర్నర్లుగా మార్చేందుకు క్లిక్కర్ టెక్నాలజీ తెచ్చామని 300కు పైగా పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టును త్వరలో రాష్ట్రమంతా అమలు చేస్తామని చెప్పారు. లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పిల్లల్ని అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. స్కూల్ కిట్లు, చిక్కీలు, గుడ్ల సరఫరాలో అవినీతి నివారించి రూ.1000 కోట్లు ఆదా చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ చెప్పారు. జీతభత్యాలు, సౌకర్యాలు ఏమీ లేకుండా నైతిక విలువలు పెంచటం బాధ్యతగా తీసుకున్న చాగంటి కోటేశ్వరరావుని సభాముఖంగా అభినందించారు. మా సొంత పిల్లలకు ఏం చేస్తామో అందరు పిల్లలకు అలాంటి సౌకర్యాలు ఉండాలని భావిస్తున్నట్లు స్పష్టం చేశారు. 2019-24 మధ్య విద్యాశాఖలో తీవ్ర విధ్వంసం జరిగిందని, 10లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారని మండిపడ్డారు. అన్ని సబ్జెక్టుల్లోనూ విద్యార్థుల్లో ప్రమాణాలు దారుణంగా పడిపోయాయని, అక్షరాస్యత విషయంలో ఏపీని అట్టడుగు స్థానానికి చేర్చారని వ్యాఖ్యానించారు.

ఐబీ, సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్ పేరుతో ప్రకటనలు, ప్రచారం తప్ప ఒక్క పనీ సరిగా చేయలేదని మంత్రి లోకేశ్ అన్నారు. నాడు- నేడు పేరుతో ప్రచార అర్భాటం తప్ప పనులు జరగలేదని విమర్శించారు. ఈ ఏడాది బడ్జెట్లో రూ.1200 కోట్లు కేటాయించామని వెల్లడించారు. వైఎస్సార్సీపీ హయాంలో యూనివర్సిటీలను రాజకీయ కేంద్రాలుగా మార్చటం, తమ బంధువుల్ని వీసీలుగా రిజిస్ట్రార్లుగా నియమించటం ద్వారా ఉన్నత విద్యారంగాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. తన కుమారుడు దేవాన్ష్‌ను బ్రాహ్మణి ఫోన్‌కు దూరంగా ఉంచి పుస్తకాలు చదవటం అలవాటు చేసిందని అన్నారు. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు కోసం శోభా రియాల్టీ వారు రూ.100 కోట్లు సీఎస్సార్ నిధులు సెంట్రల్ లైబ్రరికి ఇచ్చారని >>2

# ఆ టెండర్లు పిలిచిందెవరు?





కల్తీనెయ్యిపై మొదలైన సమగ్ర దర్యాప్తు

అర్హతలేని డెయిరీలపై కమిషన్ ఆరా

నెయ్యి టాంకర్ల పరీక్షపై క్షుణ్ణంగా పరిశీలన

**తిరుమల,మార్చి 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూప్రసాదాల తయారీకి స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేయాల్సిన డెయిరీ సంస్థలు, ఏజెన్సీ కాంట్రాక్టర్లు నిబంధనలు ఉల్లంఘించినా ఎందుకు ఉపేక్షించారనే కోణంలో ఏకసభ్యకమిటీ విశ్రాంత ఐఎఎస్ దినేశ్‌కుమార్ నేతృత్వంలోని బృందం సమగ్ర దర్యాప్తు మొదలుపెట్టింది. కల్తీనెయ్యి వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టు నియమించిన సిబిఐ సిట్ అధికారులు చేపట్టిన దర్యాప్తు కోణంలో గాకుండా భిన్నంగా ఏకసభ్య కమిటీ రెండోరోజు బుధవారం విచారణకు సిద్ధమైంది. ఇప్పటికే కల్తీనెయ్యి సరఫరా బాగోతంలో డెయిరీలకు సంబంధించిన సమాచారం సేకరించిన సిట్ బృందం అందులో లోపాలు, రసాయనాలు కల్తీ తదితర అంశాలపై నలభైపేజీలకు పైగా నివేదికలు తయారుచేసింది. పాత్రధారులైన డెయిరీల సంస్థల కీలక వ్యక్తులను, సరఫరా దారులను, టిటిడి అధికారులు ఇద్దరినీ మాత్రమే అరెస్ట్ చేసిన సిట్ ఆ తరువాత ఈ తతంగం నడపడంలో కీలకంగా వ్యవహరించిన సూత్రధారుల ప్రమేయం,వారి పాత్ర ఏమేరకు ఉందనే జోలికి వెళ్ళలేదు. ప్రభుత్వానికి అందజేసిన నివేదికల్లో కూడా రసాయనాలతో నెయ్యికల్తీ జరిగిందనేది ఆధారాలతో రుజువు చేసింది. అయితే సూత్రధారులు,ఈ పాపంలో కీలక వ్యక్తులెవరనేది గుర్తించలేదు. పైగా ఏకంగా 2019-2020లో అప్పటి టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ పాత్ర కూడా ఉందని తేల్చిన సిట్ ఏకంగా ఆయనను రెండోసారి టిటిడి ఇఒ స్థానం నుండి బదలీ చేయించేలా నివేదికలు ఇచ్చింది. అదే సమయంలో టిటిడి అదనపు ఇఒగా ఉన్న అధికారి జోలికి గానీ, అప్పటి బోర్డు పెద్దల జోలికి వెళ్ళకపోవడం కొసమెరుపు. పూర్తిగా టిటిడిలో మార్కెటింగ్, కొనుగోళ్ళ కమిటీలో అధికారులు, సభ్యుల ప్రమేయం కూడా ఉందనేది సిట్ రాబట్టిన ఆధారాలు. ఆధారాలతో టిటిడి ఎఫ్ఎసిఎఒ బాలాజీపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సుచేసింది. అసలైన వారిని వదలి పాత్ర దారులను పట్టుకున్న సిట్‌కు ఇప్పుడు ఏకసభ్య కమిటీ విశ్రాంత సిఎస్ దినేశ్‌కుమార్ మరింత లోతుగా వివరాలు తెలుసుకుని తదుపరి >>2

## తిరుమల వెళ్తూ అనంతలోకాలకు..

## లారీ కిందకు దూసుకెళ్లిన కారు



ప్రమాద ఘటనలో మృతదేహాలను పరిశీలిస్తున్న సిఐలు

ఐదుగురు దుర్మరణం
గంగవరం ప్రాంతంలో దుర్ఘటన

**గంగవరం,మార్చి 4 ప్రభాతవార్త :** నిర్లక్ష్యం..నిద్ర మత్తు..మద్యం మత్తు.. అతివేగం.. కారణం ఏదైనా నిండు ప్రాణాలను నిశీధిలో కలిపేసింది. తిరుమలేశుని దర్శనం కోసం వెళ్తూ..విధి వక్రీకరించి, ఓ కుటుంబం విగతజీవులైన సంఘటన బుధవారం ఉదయం చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలో చోటు చేసుకుంది.మండలంలోని బెంగళూరు, చెన్నై జాతీయ రహదారిపై దండపల్లె కూడలి సమీపంలో రహదారి రక్తసిక్తంగా మారింది.పోలీసుల కథనం మేరకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరు రాజాజీ నగరంకు చెందిన నాగరాజరావు(61),ఇతని భార్య జయంతి (59), కుమార్తె పూజ(33)లతో పాటు జయంతి అక్క కుసుమ(61),బావ మోహనదాస్(71)లు తిరుమల శ్రీవారి దర్శనంకోసం తమ సొంత కారులో బయలుదేరారు.మండలంలోని దండపల్లె కూడలి సమీపంలోనికి రాగానే బైరెడ్డిపల్లె నుండి మాచర్లకు వెళ్తున్న లారీని కారు అతివే గంగా, అజాగ్రత్తగా వచ్చి వెనక వైపు నుండి లారీ కిందకు దూసుకుపోవడంతో ఈ ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం >>2

05-3Pg2exHNWMJQE.qxd:05-3Pg2exHNWMJQE.qxd 1/1/02 6:53 AM Page 1



# ఇరానీ నౌకను ముంచేసిన అమెరికా

>> దాడులు చేసింది. బహ్రెయిన్, కువైట్, సౌదీ, యుఎఇలోని అమెరికా మిలిటరీబేస్‌లే లక్ష్యంగా ఇరాన్ దాడులుచేస్తోంది. మరోపక్క ఇజ్రాయెల్‌సైతం ఇరాన్‌కు మద్దతిస్తోందని, కాల్పులు జరుపుతున్నదన్న ఆరోపణలపై తూర్పు లెబనాన్‌లోని 50 నగరాలు లక్ష్యంగా దాడులుచేస్తోంది. వీటిలోభాగంగా పలువురు కమాండర్లు కూడా హతమయ్యారు. తాజాగా హెజ్బొల్లా స్థావరాలున్నాయని భావిస్తున్న 15 ఆవాసాలను ఖాళీచేసి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైరన్‌లు మోగించింది. దీనితో లెబనాన్ సైతం ఇపుడు ఇరాన్‌తోపాటు అట్టుడికిపోతోంది. ఇదిలా ఉంటే ఇరాన్ గల్ఫ్‌దేశాల్లో అమెరికా దౌత్యకార్యాలయాలనే టార్గెట్‌చేసింది. అమెరికాకాన్సులేట్ సమీపంలో పేలుడు సంభవించడంతో మొత్తం సిబ్బంది అధికారులను ఖాళీచేయించారు. అలాగే ఇజ్రాయెల్‌కూడా ఇరాన్ ఎయిర్‌పోర్టుపై దాడిచేయడంతో పార్క్‌చేసి ఉన్న అతిపెద్ద విమానం ధ్వంసం అయింది. బుషెహర్ ఎయిర్‌పోర్టుపై ఇజ్రాయెల్ దాడులుచేసింది.

**పెంటగాన్ సెంట్‌కామ్ సంచలన ప్రకటన**

మరోపక్క అమెరికా వద్ద క్షిపణి నిల్వలు కరిగిపోతున్నాయని సెంట్‌కామ్ ప్రకటించింది. యుద్ధం పదిరోజులు కొనసాగితే అమెరికా వద్ద ఆయుధ నిల్వలు పూర్తిగా అడుగంటిపోతాయని హెచ్చరించడంతో అధ్యక్షుడు అత్యవసరంగా రక్షణ ఉత్పత్తుల తయారీ కంపెనీలతో సమావేశం అయి క్షిపణులు, డ్రోన్లు, బాంబులను మరింతగా సమకూర్చుకునేందుకు కసరత్తులు పెంచారు. ఇరాన్‌చౌకబారు క్షిపణులను ధ్వంసంచేసేందుకు అమెరికా అత్యంత ఖరీదైన క్షిపణులు వినియోగిస్తోందన్న వాదన ఉంది. దీనితో ఇరాన్ వ్యూహాత్మకంగా వ్యవహరించి అమెరికా వద్ద ఉన్న ఆయుధ సంపత్తి మొత్తం ఆవిరయ్యేలాచేస్తున్నట్లు ప్రచారంజరుగుతోంది. ఇరాన్‌పైయుద్ధానికి అమెరికా రూ.18.87 లక్షలకోట్లు ఖర్చుచేస్తోందని అమెరికా రక్షణశాఖ అంచనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా 50వేలమంది సైన్యం, 200 యుద్ధవిమానాలను మొహరించింది.

**20 ఇరాన్‌పాఠశాలలపై బాంబులు దాడి**

ఇదిలా ఉంటేయుద్ధనియమాలను ఉల్లంఘించి ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్‌లోని 20 పాఠశాలలపై బాంబుదాడులుచేసాయని ఇరాన్ రక్షణ మంత్రిత్వశాఖ ప్రకటించింది. సుమారు 170 మందికిపైగా ఉపాధ్యాయులు టీచర్లు మృతిచెందారు. వీరందరినీ సామూహిక ఖననంచేస్తున్నట్లు తెలిపింది. ఇరాన్‌లోని మొత్తం 50 నగరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికాలు దాడులుచేస్తున్నాయి. అయితే ఆసుపత్రులు, విద్యాసంస్థలు కేంద్రాలుగా ఇరాన్ ఐఆర్‌జిసి దాడులకు పాల్పడుతునానరని అందువల్లనే దాడులు చేయాల్సి వచ్చిందని ఇజ్రాయెల్ చెపుతోంది.

**ఇరాన్ సుప్రీం కమాండర్‌గా ఖమైనీ వారసుడు**

ఓపక్కయుద్ధం జరుగుతుంటే మరోపక్క ఇరాన్ సుప్రీం లీడర్ పగ్గాలకు కొత్తనేతను ఎంపికచేసారు. దివంగత ఖమైనీ కుమారుడు ముజ్తబా ఖమైనీ నియమితులయినట్లు గల్ఫ్‌మీడియా ప్రకటించింది. సుప్రీం లీడర్ ఎంపిక ముగ్గురుపెద్దల మండలి నిర్ణయిస్తుంది. ఐఆర్‌జిసి ముజ్తబాను ఎంపికచేయాలన్న ఒత్తిడితో ఆతనికే మొగ్గుచూపించినట్లు తెలుస్తోంది. అలాగే సైన్యంతోను, రక్షణశాఖలోని ఇతర విభాగాలతో ముజ్తబాకు ఉన్న సాన్నిహిత్యమే ఆతడిని ఎంపికచేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఇరాన్‌సుప్రీం లీడర్‌గా ఎవరిని నియమించినా మట్టుపెట్టేస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్‌ప్రకటించారు. ఇరాన్‌లో ఇకపై నియంతపాలన అనేది ఉండకూడదన్నదే తమ లక్ష్యమని ప్రకటించింది. ఇస్లామిక్ రిపబ్లిక్‌లో తండ్రినుంచి కుమారుడికి అధికారం బదలీ కావడం ఇదే తొలిసారి. తెరవెనుక కీలకంగా ఉన్నముజ్తబా ఇపుడు నేరుగా సుప్రీం పగ్గాలుచేపట్టారు.

**ఖమైనీ జన్మస్థలంలోనే అంత్యక్రియలు**

దివంగత ఇరాన్ సుప్రీంనేత అయతొల్లా ఖమైనీ అంత్యక్రియలు ఆయన స్వస్థలం మషాద్‌లోనే జరుగుతాయని ఇరాన్‌ప్రకటించింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఇమామ్ రెజా ష్రైన్‌ప్రాంగణంలోనే ఖననంచేస్తారని, ఈ ప్రాంగణం షియా ముస్లింలకు అత్యంత పవిత్ర యాత్రాకేంద్రంగా కూడా భాసిల్లుతోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డుల పర్యవేక్షణలో అధికార లాంఛనాలతోనే అంత్యక్రియలు జరుగుతాయి.



అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లో శిథిలమైన భవనం

# లొంగిపోయిన గణపతి?

>> పెరిగింది.మావోయిస్టు పార్టీని ఈ నెలాఖరుకు తుడిచి పెడతామని ప్రకటించిన కేంద్రం ఇందులో బాగంగా ఆపరేషన్ కగార్ 1, 2 చేబట్టడం తెలిసిందే. ఈ క్రమంలోనే వందల సంఖ్యలో నక్సలై ట్లు లొంగిపోగా పదుల సంఖ్యలో మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతమవడం విదితమే. ఈ క్రమంలో పా ర్టీ ప్రస్తుత అధ్యక్షుడుగా చెప్పుకుంటున్న తిపిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీతో పాటు కీలక నేతలు బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నరసింహ్ రెడ్డి తెలంగాణ డిజిపి ఎదుట వారం రోజుల క్రితం లొంగిపోయారు. వీరి లొంగుబాటు కోసం ఛత్తీస్‌ఘఢ్, మహారాష్ట్రలు గట్టిగానే ప్రయత్నించినా తెలంగాణ పోలీసులకు ఈ అవకాశం దక్కింది. వీరి తరువాత పార్టీలో కేవలం 12 మంది మాత్రమే మిగిలారని పోలీసులు ప్రకటించారు. పార్టీ అగ్రనేత గణపతి కూడా లొంగిపోతారని అప్పుడే ప్రచారం జరిగింది. గణపతి లొంగిపోతే మంచిదని డిజిపి శివధర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. అనారోగ్యంతో విదేశాల్లో చికిత్స పొందుతున్న గణపతిని లొంగిపోయేలా చేసేందుకు తెలంగాణ పోలీసు శాఖ తమదైన శైలిలో ప్రయత్నాలు చేబట్టింది. తెల ంగాణ పోలీసుల ప్రయత్నాలు ఫలించి గణపతి విదేశాల నుంచి భారత్‌కు రెండు రోజుల క్రితం వచ్చి ఢిల్లీలో లొంగిపోయినట్లు వార్తలు వస్తున్నాయి.

గణపతి లొంగిపోయిన విషయాన్ని పోలీసులు గోప్యంగా వుంచుతున్నారు. దీనిపై గురువారం నాడు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సిఎం రేవం త్ రెడ్డిల సమక్షంలో గణపతి లొంగుబాటుపై మీడియా సమావేశం జరగనుందని తెలిసింది. ఇదే విషయమై ఢిల్లీలో వున్న సిఎం రేవంత్ రెడ్డి కేం ద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడినట్లు తెలిసింది. సిఎం వెంట డిజిపి శివధర్ రెడ్డి, ఎస్ఐబి ఐజి సుమతి కూడా వుండడం గమనార్హం. వీరి భేటీ రాష్ట్రంలో నక్సలిజం రూపుమాపడం, తదనంతర పరిణామాలపై చేబట్టిన చర్యల గురించేని చెబుతున్నా గణపతి లొంగుబాటుపై చర్చించినట్లు తెలిసింది. గణపతి లొంగిపోవడం నిజం అయితే మావోయిస్టు పార్టీ పూర్తిగా కనుమరుగైనట్లేనని ని పుణు చెబుతున్నారు. ప్రపంచ గెరిల్లా పోరాట చరిత్రలో ఎల్‌టిటిఈ తరువాత అంతటి బలమైన తీవ్రవాద సంస్థగా మావోయిస్టు పార్టీకి పేరుండడం తెలిసిందే. 1980-2000 దశకంలో ఎల్ టిటిఈ, మావోయిస్టు పార్టీ మధ్య బలమైన సంబంధాలు వుండేవని పోలీసు రికార్డులు చెబుతున్నా యి. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వ చ్చాక జరిగిన చర్చల తరువాత మావోయిస్టు పార్టీ క్రమంగా బలహీనంగా మారి పూర్తిగా కనుమరు గయ్యే దశకు చేరిందనే వాదనలు వున్నాయి. ఎ ల్‌టిటీఈ కూడా ఇలాగే కనుమరుగవడం తెలిసిందే. మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం మిగిలివున్న ఏకైక అగ్ర నాయకుడు గణపతి లొంగిపోతే ఆ పా ర్టీ కథ పూర్తిగా ముగిసినట్లుగా భావించాలని నిపుణులు చెబుతున్నారు.

## 15 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు

>> కొత్త వంగడాలను ప్రోత్సహిస్తున్నామని స్పష్టం చేశారు. మొదటి దశలో రాయలసీమ జిల్లాల నుండి ప్రకాశం జిల్లా వరకు 15 లక్షల హెక్టార్లలో క్రాప్ డైవర్షన్ చేపట్టి హార్టికల్చర్ హబ్‌లుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 30,000 కోట్లు, ప్రైవేట్ రంగం ద్వారా 70,000 కోట్లు సమీకరించి హార్టికల్చర్ అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. సంవత్సర కాలంలో రైతులకు వరి పంటలో ఎకరాకు సుమారు 6,000 ఆదాయం మాత్రమే వస్తుండగా, కందిపంటకు 26,000,మినుముల పంటకు 21,000, జొన్న పంటకు 16,000, పామాయిల్ పంటకు 1.50 లక్ష రూపాయల లాభం వస్తుందని వివరించారు. డైవర్షన్‌కు ముందుకొచ్చే రైతులకు పామాయిలు ఉచిత మొక్కలు, సాంకేతికసలహాలు, డ్రిప్, స్ప్రింక్లర్ సదుపాయాలు కల్పించి,పండించిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. మొక్కజొన్నకు 2400 మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో 90 శాతం నీటి నిల్వలు ఉన్నందున ఖరీఫ్ సాగును రెండు నెలలు ముందుకు తీసుకురావాలని, మేనెలలో ఖరీఫ్ ప్రారంభం అయ్యేలా ప్రతి గ్రామంలో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నామని, ఎమ్మెల్యేలు రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి పిలుపునిచ్చారు. కౌలు రైతుల విషయానికి వస్తే, 9.13 లక్షల మందికి సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి ..4474 కోట్లు రుణాలుగా మంజూరు చేశామని వెల్లడించారు. రైతుల ఆదాయ వృద్ధి, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో స్పష్టం చేశారు.

## ఫిలిం,టెలివిజన్ హాబ్‌గా ఎపి : మంత్రి కందుల దుర్గేష్

>> 45ఏళ్ళుగా టివి పరిశ్రమ రాష్ట్ర ఆర్థిక ప్రగతికి,కళాకారులు ఉపాధికి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు.విశాఖపట్టణం జిల్లా భీమిలి వద్ద కేటాయించిన స్థలంలో టివి నగర్ (నివాస స్థలాలు), స్టూడియోల నిర్మాణం కోసం సభ్యులుచేసిన అభ్యర్థనను సానుకూలంగా పరిశీలిస్తామన్నారు.అమరావతి,వైజాగ్,రాజమండ్రి,తిరుపతి ప్రాంతాల్లో స్టూడియోల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న టివి నంది అవార్డులను త్వరలోనే అందజేస్తామని,ఉగాధి పురస్కారాల్లో టివి కళాకారులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు.దివంగత ప్రముఖులు సుమన్,దేవదాస్ కనకాల పేర్లతో కళాకారులను సత్కరించే ప్రతిపాదనను పరిశీలిస్తామన్నారు. షూటింగ్స్ కోసం ప్రభుత్వ స్థలాలు,ఆడిటోరియాలు, దేవాలయాలు, టూరిజం గెస్ట్ హౌస్‌లలో రాయితీలు కల్పించే దిశగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి దుర్గేష్ తెలి పారు. ప్రభుత్వానికి ,టివి పరిశ్రమకు మధ్య వారధిగా పనిచేసేందుకు టెలివిజన్ ఫ్రెటర్నిట్ ఫోరమ్‌ను అనుసంధాన కమిటీగా గుర్తించాలన్నకోరికను పరిగణనలోనికి తీసుకుంటామని మంత్రి చెప్పారు.



వేట్లపాలెం సంఘటనపై శాసనసభలో బుధవారం
సీఎం చంద్రబాబు నేతృత్వంలో సభ్యులంతా మౌనం పాటిస్తున్న దృశ్యం

**విజయవాడ,మార్చి 4,ప్రభాతవార్తప్రతినిధి:** వేట్లపాలెంలో భారీ పేలుళ్ళు చోటు చేసుకున్న బాణా సంచా తయారీ పరిశ్రమ సూర్యశ్రీ ఫైర్ వర్క్స్‌కు వైసీపీ హయాంలోనే అనుమతి ఇచ్చారని ఏపీ సీఎం చంద్రబావబు అసెంబ్లీలో ప్రకటించారు. బాణా సంచా తయారీ పరిశ్రమలో జరిగిన .ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపకంగా రెండు నిముషాలపాటు శాసనసభ మౌనం పాటించింది.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఈ పరిశ్రమ బాణసంచా ఉత్పత్తి చేస్తోంది మొత్తం 30 మంది ఆ కర్మాగారంలో పనిచేస్తున్నారు. పరిమితికి మించి మందుగుండు సామాగ్రి నిల్వ చేశారుఆర్డర్లు ఉన్నాయన్న కారణంతో బాణసంచా పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు విజయనగరం పర్యటనలో ఉన్న నేను వెంటనే ఘటనా స్థలికి వెళ్లాను ప్రమాదం జరిగిన 30 నిముషాల్లో పోలీసులు, అగ్నిమాపక శాఖ ఘటనాస్థలికి వెళ్లింది ఈ కేసులో నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. కొందరి నిరక్ష్యంల దురాశల కారణంగా ఈ దారుణం చోటు చేసుకుంది. ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చాను.
రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాను. ఇళ్లులేని వారందరికీ ఇళ్లు కట్టించి ఇస్తాం
.. ప్రభుత్వ పరంగా వారందరినీ ఆదుకుంటాంఅన్నారు. సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పేరిట కాకినాడ జిల్లా

## లిక్కరు కుంభకోణం నేరస్తులను వదలం సిఎం చంద్రబాబు

### స్కామ్‌పై మంత్రివర్గ ఉపసంఘంతో విచారణ చేస్తున్నాం

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఎక్సైజ్ శాఖలో గత పాలకుల హయాంలో అతిపెద్ద కుంభకోణం చేశారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఏపీ అసెంబ్లీలో కీలకారోపణ చేసారు.లిక్కర్ స్కామ్‌పై మాట్లాడుతూ దీనిపై కేబినెట్ సబ్ కమిటీని వేసి విచారణ చేస్తున్నామని వెల్లడించారు. సొంత బ్రాండ్లు తెచ్చి వ్యాపారం చేసి ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారు.ఇప్పుడు మొత్తం పారదర్శకంగా మార్చి అంతర్జాతీయ బ్రాండ్లు తీసుకువచ్చామన్నారు. ఎవరు తప్పు చేసినా కఠినంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ప్రజల ఆరోగ్యమే మాకు అత్యంత ప్రాధాన్యం అన్నారు.నాసిరకం మద్యం సేవించి 30 వేల మంది వరకూ అనారోగ్యాల పాలై మరణించారని వివరించారు.ప్రస్తుతం ఎక్సైజ్ విధానాన్ని ప్రక్షాళన చేశామన్నారు. దీనిని భరించలేక వైసీపీ నెగటివ్ ప్రచారాన్ని మొదలు పెట్టింది అన్నారు.పెట్టుబడులు అంటే విముఖత చూపిస్తున్నట్టుగా దుష్ప్రచారం చేస్తున్నారు అన్నారు.ఎన్డీఏ పాలన ఉన్నంత కాలం ఏపీకి పారిశ్రామిక వేత్తలు క్యూ కడతారు. ఏపీ అంటే విశ్వాసం కల్పించాం మన్నారు. ఓ బ్రాండ్ అని పేరు తీసుకువచ్చామన్నారు. భారత్‌లో తొలి క్వాంటం కంప్యూటర్ వ్యాలీ అమరావతికి వచ్చిందని అన్నారు.అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంటే అమరావతి క్వాంటం వ్యాలీకి అడ్రస్‌గా మారుతుందన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా రాష్ట్రంలోని 5 జోన్లలో ఆవిష్కరణలకు, నైపుణ్యాలకు పదును పెడుతున్నామన్నారు.మానవ వనరులను అభివృద్ధి చేయటంతో పాటుఅత్యుత్తమ ఉపాధి కల్పించేలా కార్యాచరణ చేపడుతుందన్నారు.

# ఆరు లక్షలుపైగా ఉద్యోగాలు

>> చేయాలని నిర్ణయించాం. గత ప్రభుత్వంలో యువత పొరుగు రాష్ట్రాలకు వలస పోయిన పరిస్థితి. పెట్టుబడులకు ప్రిఫర్డ్ డెస్టినేషన్‌గా ఏపీ మారుతుంది. ఎన్డీఏ పాలన ఉన్నంత కాలం ఏపీకి పారిశ్రామిక వేత్తలు క్యూ కడతారు. దీనిని భరించలేక వైసీపీ నెగటివ్ ప్రచారాన్ని మొదలు పెట్టింది పెట్టుబడులు అంటే విముఖత చూపిస్తున్నట్టుగా దుష్ప్రచారం చేస్తున్నారు" అని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. 'ఎపి అంటే పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించాం. ఏపీ అంటే బ్రాండ్ అనే పేరు మళ్లీ తీసుకువచ్చాం. భారత్‌లో తొలి క్వాంటం కంప్యూటర్ వ్యాలీ అమరావతికి వచ్చింది. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంటే అమరావతి క్వాంటం వ్యాలీకి అడ్రస్‌గా మారుతుంది. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ ద్వారా ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా రాష్ట్రంలోని 5జోన్లలో ఆవిష్కరణలకు, నైపుణ్యాలకు పదును పెడుతున్నాం. గత ప్రభుత్వంలో ఎవరికీ నైపుణ్యాలను కల్పించలేక పోయారు. మా ప్రభుత్వంలో మానవ వనరులను అభివృద్ధి చేయటంతో పాటు అత్యుత్తమ ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపడుతుంది' అని ముఖ్యమంత్రి ప్రకటించారు. 'దేశంలోనే తొలిసారి ప్రజలందరికీ వర్తింప చేసేలా యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకువస్తున్నాం. రూ.2.5 లక్షల వరకూ ఉచితంగా వైద్య సేవలు అందించేలా ఈ విధానం ఉంటుంది. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణం చేపడుతున్నాం. గత పాలకులు కనీసం వైద్య కళాశాలలకు భూమి కూడా చూపించలేదు. ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పీపీపీ అంటే ప్రైవేటు కాదని మరోమారు ప్రజలకు చెబుతున్నాం. ఇది పూర్తిగా ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుంది. అన్ని మెడికల్ కళాశాలల్లోనూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సేవలు అందుతాయి. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసం డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నాం. ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని సీఎం స్పష్టం చేశారు.
'విద్యా రంగంలో మరింత మెరుగైన ఫలితాల కోసం ఏటా రాష్ట్రంలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగులతో సమీక్షి ంచుకుంటున్నాం. గత పాలకుల వల్ల విద్యా రంగం దిగజారి పోయింది. ప్రాథమిక విద్య ఎక్కడైనా మాతృ భాషలోనే ఉంటుంది. ప్రపంచానికి తెలివైన యువతను అందించటంతో పాటు తెలుగును కాపాడుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. భూకేటాయింపులు సహా వివిధ ప్రోత్సాహకాలను ప్రాజెక్టులకు అందిస్తున్నాం. పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా పర్యాటక పాలసీకి రూపకల్పన చేశాం. 102 ఎంఓయుల ద్వారా రూ.18 వేల కోట్ల పెట్టుబడులు కూడా రాష్ట్రానికి వచ్చాయి. 3.4 లక్షల మందికి దీని ద్వారా ఉద్యోగాలు వస్తాయి. 7,348 హోటల్ గదుల నిర్మాణానికి అనుమతులు కూడా ఇచ్చాం. సూర్యలంక బీచ్‌ను గోవాతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం. అఖండ గోదావరి, పాపికొండలను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం. గండికోట మన దేశపు గ్రాండ్ కాన్యన్. దీనిని కూడా అద్భుతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ప్రసాద్ స్కీమ్ కింద వివిధ దేవాలయాలను కూడా అభివృద్ధి చేయబోతున్నాం. కారావాన్, హోంస్టేలు, టెంట్ సిటీల ద్వారా పర్యాటకాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాం. అంతర్జాతీయ స్థాయి కంపెనీలతో వీటిని అనుసంధానించి పర్యాటక ప్రాజెక్టులు పెద్ద ఎత్తున తీసుకు వస్తున్నాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు. "గత పాలకుల హయాంలో ఎక్సైజ్‌లో అతిపెద్ద కుంభకోణం చేశారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీని వేసి విచారణ చేస్తున్నాం. సొంత బ్రాండ్లు తెచ్చి వ్యాపారం చేసి ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారు. ఇప్పుడు మొత్తం పారదర్శకంగా మార్చి అంతర్జాతీయ బ్రాండ్లు తీసుకువచ్చాం. ఎవరు తప్పు చేసినా కఠినంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల ఆరోగ్యమే మాకు అత్యంత ప్రాధాన్యం. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం సేవించి 30 వేల మంది వరకూ అనారోగ్యాల పాలై మరణించారు. ప్రస్తుతం ఎక్సైజ్ విధానాన్ని ప్రక్షాళన చేశామని సిఎం చంద్రబాబు శాసనసభలో అన్నారు.

## అందరికి 'ఫ్యామిలీ కార్డు'లు

>> ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎస్‌జీఎస్‌డబ్ల్యు, డిస్కమ్స్, ఎంఏయూడీ, వెబ్‌ల్యాండ్,వాహన్, హెచ్‌ఆర్‌ఎంఎస్, సీబీడిటీల, పంచాయతీరాజ్, మార్క్‌ఫెడ్ వంటి శాఖల నుంచి సేకరించిన సమాచారాన్ని ఇందులో పొందుపరచాలని సూచించారు. ఇప్పటికే 82 శాతం సమాచారం ఉందని, వచ్చే ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ సిద్ధం చేస్తామని అధికరులు తెలిపారు. అయితే ప్రభుత్వంలోని అన్ని శాఖల దగ్గర ఉన్న డేటాబేస్ సమీకృతం చేయాలని, అప్పుడు కచ్చితత్వం పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు.

## అంతరాష్ట్ర జల వివాదాల కేసుల్లో వాదనలకు ప్రత్యేక న్యాయవాదుల నియామకం

**హైదరాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** అంతరాష్ట్ర జల వివాదాల కేసుల్లో తెలంగాణ ప్రభుత్వ వాదనలు మరింత సమర్థవంతంగా వినిపించేందుకు కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇరిగేషన్ విభాగం పరిధిలో ప్రభుత్వం జూనియర్ అడ్వొకేట్లను నియమించేందుకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం చైతన్య సింగ్, సంచితా ద్వివేది సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించింది.

# ఆ టెండర్లు పిలిచిందెవరు?

>> ముందుకు కదలాలని భావిస్తున్నారు. తిరుపతిలోని ఎస్వీ విశ్రాంతి గృహంలో రెండోరోజు బుధవారం టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, మార్కెటింగ్ విభాగం అధికారులతో మాట్లాడి నిబంధనలు,టెండర్లు పిలిచే ప్రక్రియ విధానం,రెండుదశాబ్దాలుగా నెయ్యిసరఫరాలో అమలుచేసిన నిబంధనలు,నెయ్యిట్యాంకర్లను ఎలా పరీక్షిస్తారనే అంశాలపై అధ్యయనం చేయడం విశేషం. తిరుమల లడ్డూల తయారీలో వినియోగించే నెయ్యిసరఫరాకు నిబంధనలు ఉల్లంఘించి టెండర్లు ఎలా పిలిచారు?ఆ టెండర్లు ప్రక్రియ తయారుచేసిందెవరెవరు,ఇందులో అప్పటి బోర్డు పెద్దల ప్రమేయం ఎంతవరకు ఉంది, అధికారుల పాత్ర ఏంటనే ప్రశ్నలకు ఆధారాలు సేకరిం చారనేది తెలుస్తోంది.ఎక్కడో ఉత్తరాఖండ్‌లో ఉన్న బోలేబాబాడెయిరీకి, తమిళనాడులోని ఏఆర్ డెయి రీలు టెండర్లలో ఎలా పాల్గొన్నాయి. వీరికి నెయ్యి సరఫరా చేయాలని సూచించిన పెద్దలు ఎవరు అనే కోణంలో సిబిఐ సిట్ అధికారుల నివేదికలను పరిశీలించి తదుపరి ఎలా కార్యాచరణ మొదలు పెట్టాలనేది కూలంకుషంగా చర్చించారు. ఏఆర్ డెయిరీ యాజమాన్యం ,సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్,నెల్లూరు ప్రాంతాలకు చెందిన కొందరు ఉద్యోగులను ఈ కమిటీ విచారణకు పిలవనుంది. వారిలో కొందరు కీలకం కావున వారిచ్చే సమాధానాలు, సమాచారం ఆధారంగా తదుపరి సమగ్ర దర్యాప్తులో ఎవరినీ పిలుస్తారనేది కూడా టిటిడి వర్గాల్లో గత బోర్డు పెద్దల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఇప్పటికే గత బోర్డు పెద్దలు సుప్రీంకోర్టుకు, హైకోర్టులను ఆశ్రయించి విచారణ సాగకుండా చూసుకున్న విషయం తెలిసిందే. కల్తీనెయ్యి సరఫరా అయినా పరీక్షించి వెనక్కు పంపకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చిందెవరు?వారికి సహకరించిన అప్పటి టిటిడి బోర్డు,అధికారుల సమాచారంపై కూడా రికార్డులు పరిశీలన చేయడం , వివరాలు తెలుసుకోవడం ప్రధానం.టిటిడికి అవసరమైన నెయ్యి నిబంధనల మేరకు సరఫరా చేయాల్సి ఉన్నా,అందుకు భిన్నంగా సామర్థ్యం లేకపోయినా టిటిడి ప్రతిపాదనలను ఎందుకు అంగీక రించారు, ఎవరు సహకరించారనేది ఇప్పుడు ఈ ఏకసభ్యకమిటీ రాబట్టనున్న అంశాలు.నిబంధనలు మార్చి లోపాయికారి ఒప్పందం,సరఫరాకు వీరికిఅనుమతులివ్వడంపైనే ప్రధానంగా దృష్టి సారించే అవకాశం ఉంది.

## సూర్యశ్రీఫైర్ వర్క్స్ గత ప్రభుత్వ హాయాంలోనిదే అసెంబ్లీలో సిఎం చంద్రబాబు

వేట్లపాలెంలో కొన్నేళ్లుగా బాణసంచా తయారీ సాగుతోంది. రోజూలాగే కార్మికులు టపాసులు తయారీలో నిమగ్నం అయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పేలుళ్లు సంభవించాయి. పెద్ద మొత్తంలో టపాసులు నిల్వ ఉండడంతో విస్ఫోటం ఆగలేదు. కార్మికులు బయటకు రాలేక కాలిపోయారు. ఈ ప్రమాదంలో 10 మంది పురుషులు, 10 మంది స్త్రీలు సజీవ దహనం అయ్యారు. కొందరివి కాళ్లుంటే చేతులు లేవు, చేతులుంటే కాళ్లు లేవు. కొన్ని శరీరభాగాలే మిగిలాయి. పెను విస్ఫోటం నుంచి 10 మంది గాయాలతో బయటపడ్డారు. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు పంటకాల్వల్లో చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. ఓ మహిళ పుర్రె పేలిపోయింది. మరొకరు శవమై 50 మీటర్ల దూరంలోని పంట కాల్వలో పడ్డారు. ఇవాళ మరో ఇద్దరు మృతి చెందారు. తీవ్రంగా గాయపడి ఇవాళ వారు చనిపోయారుజపెద్దాపురం ఆర్డీఓ, పెద్దాపురం డీఎస్పీ, ఫైర్ ఆఫీసర్, లేబర్ ఆఫీసర్ ను సస్పెండ్ చేశాం అన్నారు.పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్, ఐజీ రామకృష్ణలతో కమిటీ నియమించాం అన్నారు. సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పేరిట ఈ లైసెన్సు తీసుకున్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని ఉత్పత్తి చేయాల్సి ఉంది. దురాశతో ఎక్కువ మందు గుండు తయారు చేయటం దుర్మార్గం అన్నారు.భవిష్యత్తులో ఇలాంటివి జరక్కుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం
నిందితుల ఆస్తులను కూడా అక్షన్ వేసి బాధిత కుటుంబాలకు ఇస్తాం మరికొన్ని నిరక్ష్య పూరితమైన అంశాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది . ఆడబిడ్డలపై ఆకృత్యాలకు పాల్పడుతున్న ఘటనలపైనా తీవ్రంగా వ్యవహరిస్తాం.ప్రతిపక్షంగా ఓ పార్టీ ఉంది. కానీ ఈ తరహా ప్రజా సమస్యలను లేవనెత్తకుండా తిరుపతి శ్రీ వారి లడ్డూ ప్రసాదం గురించి రాజకీయం చేస్తున్నారు.బాధ్యత కలిగిన ప్రభుత్వంగా ఆ బాధ్యత నుంచి తప్పించుకోం .. కఠినమైన నిబంధనలు పెట్టి చర్యలు తీసుకుంటామని శాసనసభా వేదికగా ప్రకటిస్తున్నానుజ ఈ ఘటనలో ఇంత మంది మరణించటం చాలా బాధాకరం, తీవ్రమైన ఆవేదన కలిగిస్తోంది.చిన్న తప్పిదం కూడా పెను ప్రమాదానికి దారితీస్తుందన్నారు.

## లారీ కిందకు దూసుకెళ్లిన కారు

>> చెందారు.విషయం తెలుసుకున్న గంగవరం అర్బన్, రూరల్, పలమనేరు సిఐలు రాంభూపాల్, పరశురాముడు, మోహన్‌రెడ్డి, పలమనేరు ఎస్ఐ లోకేష్‌రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంలో లారీ కింద ఇరక్కుపోయిన కారును జెసిబి సహాయంతో తొలగించి,కారులో నుజ్జునుజ్జయి,ఛిద్రమైన మృతదేహాలను స్థానికుల సహాయంతో వెలికి తీశారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం 108వాహనాల్లో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతురాలు పూజ బెంగళూరు శివమొగ్గ నందు నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తుంది. ఈమె భర్త నిఖిల్ జర్మనీలో ఐటి సెక్టర్‌లో పని చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.ప్రమాదానికి గల కారణాలపై చరవాణి ద్వారా అధికారులను ఆరా తీశారు. ప్రమాదాల నివారణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## 'ఆంధ్రా మోడల్' ఆదర్శం

>> తెలిపారు. ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, సుందరపు విజయ్ కుమార్ విద్యారంగంపై మాట్లాడారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వచ్చే 3 నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో 3,371 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిభర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఉన్నత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించి 3నెలల్లో అవసరమున్న ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల సంఖ్య, ఆయా ఖాళీలను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని మండలిలో సభ్యుడు బొర్రా గోపిమూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఖాళీల భర్తీకి 2018, 2023లో నోటిఫికేషన్ ఇచ్చారని వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ పాటించక పోవడంతో 2023 నోటిఫికేషన్‌ను కోర్టు తప్పు బట్టినందున సదరు ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. ఇప్పటికే మేం ఏఏజీతో మూడు సార్లు సమావేశమై పూర్తిస్థాయిలో చర్చించామని నూతన నోటిఫికేషన్ ఇవ్వాలని మేం నిర్ణయం తీసుకు న్నామని మంత్రి లోకేశ్ తెలిపారు.

## వారం - వర్జ్యం

05-03-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
విదియ సా.5.08
ఉత్తరఫల్గుణి ఉ.8.18
వర్జ్యం : సా.5.08-6.49
దు.ఉ.10.21-11.08, 2) 3.06-3.53
శుభసమయం: ఉ.9.00-10.00, సా.6.00-7.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** వైద్యుని మార్పు చేయడం వలన లాభపడగలుగుతామని భావిస్తారు. ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉంటారు.

**వృషభం:** సుపరిచితులు కొందరు మీ సహాయాన్ని అర్థిస్తారు. ప్రతివారిని అనుమానాస్పద దృష్టితో చూస్తారు.

**మిథునం:** వృత్తి, ఉద్యోగాల పరంగా మీ కృషికి తగినటువంటి మంచి ఫలితాలను అందుకోగలుగుతారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** అన్నిరంగాలవారికి గతంలో కంటే నేడు ఎంతో కొంత ప్రోత్సాహం లభిస్తుంది. ఆరోగ్యం సాధారణంగా వుంటుంది.

**సింహం:** పని భారం వలన వత్తిడి అధికంగా ఉంటుంది. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ప్రముఖుల పరిచయాలు.

**కన్య :** కీలక విషయాలలో వాయిదాలు వేయకుండా వెనువెంటనే నిర్ణయాలు తీసుకుని లాభపడగలుగుతారు.

**తుల :** కార్యాలయంలో ఉన్న పెండింగ్ వర్క్‌ను పూర్తిచేయడానికి ప్రాముఖ్యత నిస్తారు. స్వల్ప ధనలాభం గడిస్తారు.

**వృశ్చికం:** సంస్థాగతంగా పురోభివృద్ధిని సాధించటమే తక్షణ కర్తవ్యమని భావిస్తారు. నూతన మిత్రుల పరిచయాలు.వాహనసౌఖ్యం.

**ధనుస్సు:** మంచి మాటకారితనం వలన అనుకూల ఫలితాలను ఎంతగా సాధించ వలెను అనునది అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు.

**మకరం:** దూరప్రాంతాల నుండి రావలసిన ధనం కొంత వరకు చేతికందివస్తుంది. నూతన వాహన కొనుగోలు చేస్తారు.

**కుంభం:** నిజంగా మీ శ్రేయస్సు కోరుకునే వారు ఎవరన్నది తెలుసుకుంటారు. ఆర్థిక అంశాలపై దృష్టిని పెడతారు.వస్త్రలాభం.

**మీనం :** భూ, గృహ, యంత్ర సంబంధిత మైన విషయములకు సంబంధించి నటువంటి లావాదేవీలు సానుకూల పడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఫ్యాక్షన్ రాజకీయాలను జగన్ పెంచి పోషించారు: మంత్రి లోకేశ్



విజయవాడ, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఫ్యాక్షన్ రాజకీయాలను గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్ పెంచి పోషించి వందల మంది తెదేపా కార్యకర్తల హత్యలకు కారకులయ్యారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో దారుణ హత్యకు గుఐన తెదేపా నేత తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇచ్చేందుకు వీలుగా ఏపీ పబ్లిక్ సర్వీసు నియామకాల సవరణ బిల్లును శాసనసభలో మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. 2025 సెప్టెంబర్ 27న శాసనసభలో బిల్లును ఆమోదించి మండలికి పంపించామని అక్కడ బిల్లును చర్చకు తీసుకోలేదన్నారు. వంద రోజులు దాటడంతో మళ్లీ బిల్లును శాసనసభలో పెట్టాల్సి వచ్చిందని వివరించారు. బీసీ వర్గానికి చెందిన తోట చంద్రయ్యను 2022 జనవరి 12న హత్య చేశారని, నమ్ముకున్న సిద్ధాంతం కోసం నిలబడి ప్రజల కోసం ఆయన పోరాడారన్నారు. నడిరోడ్డుపై చంద్రయ్యను గొంతు కోసి చంపారని దేశమంతా ఇది చూసిందని చెప్పారు. ఆయన కుమారుడికి ఉద్యోగం ఇచ్చేందుకు కూటమి పార్టీలు సమ్మతించాయని అందుకే బిల్లు పెట్టినట్లు సభకు వివరించారు. అనంతరం ఆ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.

## విద్యాసంస్థలతో సహా ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకాలు అమర్చే ప్రతిపాదన

### - ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



సచివాలయం, మార్చి 4 ప్రభాతవార్త: దశల వారీగా అన్ని భవనాలపై సోలార్ పలకాలు అమర్చేందుకు టెండర్లు ఆహ్వానించామని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బుధవారం శాసనమండలిలో చైర్మన్ కెకె మోషేన్ రాజు అధ్యక్షతన జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పై విధంగా స్పందించారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులపై పెట్టిన కేసులపై శాసనమండలిలో పలువురు సభ్యులు ప్రశ్నించారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధర్నా చేసిన ఉద్యోగులపై గత ప్రభుత్వం కేసులు పెట్టింది. రాజధాని రైతులపైన కూడా కేసులు నమోదు చేసింది. జూన్ 2019 మే 2024 వరకు సిపిఎస్, నాన్ సిపిఎస్, మీడియా, రాజధాని రైతులపై 242కేసులు పెట్టారు. విచారణలో 11కేసులు, పెండింగ్ 39, ముగింపు దశలో 170కేసులున్నాయి. హైకేసుల యూనిట్లలో తిరుపతి, విజయవాడ, చిత్తూరు, అనకాపల్లి, ప్రకాశం, శ్రీకాకుళం, కాకినాడ, ప.గో.జిల్లాలు ఉన్నాయి. నాన్ సిపిఎస్‌లో 43కేసులుండగా పెండింగ్‌లో 9ఉన్నాయి. వడ్డెర, రజక, పల్లెకార సామాజిక వర్గాలను ఎస్సీఎస్టీ వర్గంలో చేర్చే ప్రతిపాదనపై మండలిలో ప్రశ్నలకు సంక్షేమ శాఖ మంత్రి సవిత వివరణ ఇస్తూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈ అంశంపై అధ్యాయనం చేస్తుంది. ఎస్టీల్లో చేర్చేందుకు కేంద్రం నుంచి కూడా అనుమతి రావాల్సి ఉంది. వడ్డేర, రజకులకు ప్రతి కుటుంబంలో పారిశ్రామికవేత్తగా చేయడమే లక్ష్యంగా చర్యలు, త్వరలో ఆదరణ 2పథకాన్ని తీసుకొస్తున్నామన్నారు.

## తిరుమల సమాచారం



### దేశ ప్రజలంతా బాగుండాలి: ప్రహ్లాద్ మోడీ

తిరుమల, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: దేశ ప్రజలందరూ బాగుండాలని, ఉన్నతంగా ఉండాలని కోరుకున్నట్లు ప్రధాని మోడీ సోదరుడు ప్రహ్లాద్ మోడీ చెప్పారు. కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని దర్శనం కోసం వచ్చానని ఆయన తెలిపారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్న ప్రహ్లాద్ మోడీకి ఆలయ అదికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



### అందరికీ శుభాలు కలగాలి

తిరుమల, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని, సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం మాజీ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్, తమిళ నటుడు నీలగిరి రవి, సినీనటి మిత్రావ్ శర్మ విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



### తెలుగు ప్రజలకు శుభాలు కలగాలి

తిరుమల, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం ఆనందదాయకమని తెలుగు ప్రజలకు శుభాలు కలగాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 30 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు

# నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్

● అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు ● అసెంబ్లీలో హోంమంత్రి వంగలపూడి అనిత



విజయవాడ, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును శాసనసభ ఆమోదం తెలిపింది. హోంమంత్రి వంగలపూడి అనిత ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై మంత్రి వివరణ. సభ్యుల అభిప్రాయాల అనంతరం సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు రావటంతో మార్పులు అవసరమైనట్లు చెప్పారు. ఈ సవరణ ద్వారా భవన నిర్మాణ అనుమతులను జాతీయ నిబంధనల మేరకు సవరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అగ్నిమాపక పరికరాలు లేని భవనాలపై జరిమానాలను భారీగా పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. నిర్దేశిత కాలపరిమితి ప్రకారం అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అగ్నిమాపక పరికరాల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చేలా చట్టంలో సవరణ చేసినట్లు తెలిపారు. వాణిజ్య, పారిశ్రామిక, నివాస భవనాలకు ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తున్నామన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర మార్గాలు, అగ్నిమాపక పరికరాలతో పాటు తగిన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అనిత పేర్కొన్నారు. సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం, ఆధునిక రక్షణ విధానాలపై అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు 21 నుంచి 30 రోజుల్లో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భవన ప్రాంగణాన్ని సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత హెచ్చరించారు. ఈ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

## తిరుమల లడ్డూలో కల్తీలేదు... నాణ్యత లోపమే

● లడ్డూపై జరిగిన లఘు చర్చలో వైకాపా ఎమ్మెల్సీ తోమాటి మాధవ్

● కల్తీ జరిగిందని గత చైర్మన్ సుబ్బారెడ్డి అంగీకరించారు: మంత్రి పయ్యావుల



సచివాలయం, మార్చి 4 ప్రభాతవార్త : శాసన మండలిలో బుధవారం చైర్మన్ మోషేన్‌రాజు అధ్యక్షతన జరిగిన తిరుమల లడ్డూలో జరిగిన కల్తీ పై లఘు చర్చలో కల్తీలేదు కేవలం నాణ్యత లోపమే అని వైకాపా ఎమ్మెల్సీ తోమాటి మాధవ్ అన్నారు. కేవలం వైకాపా అధికారంలో ఉన్న ప్పుడు మాత్రమే కల్తీ జరిగిందని చెప్తున్నారంటే 2019-24 మధ్యలో అప్పటి ప్రతిపక్ష నాయకులు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల వెళ్ళారని ఆదేవిధంగా ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా తిరుమలను దర్శించారని అప్పుడు ఎందుకు కల్తీ జరిగిందని చెప్పలేదని తప్పుపట్టారు. ఈ విషయంలో సిట్ కూడా కేవలం నాణ్యతా లోపాలు మాత్రమే జరిగిందని చెప్పినప్పటికీ అధికార ప్రభుత్వం పదేపదే కల్తీ జరిగిందనా హిందూ మనోభావాలు దెబ్బతినే విధంగా దుష్ప్రచారం చేయడం సాంప్రదాయం కాదని తెలిపారు.

**నాణ్యతా లోపాలు కాదు కల్తీ జరిగిన మాట వాస్తవం**

**- శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల**

భారతదేశానికి ఎంతో పవిత్రమైన తిరుమల దేవస్థానం అక్కడ అందించే ప్రసాదాలు ఎంతో పవిత్రంగా ఉండాలని భక్తులు కోరుకుంటారని అయితే గత ప్రభుత్వం వారి సొంత లాభాల కోసం కల్తీనెయ్యి వాడటం జరిగిందని ఈ విషయాన్ని సిట్ నిర్ధారించిందని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. స్వయంగా గతంలో టిటిడి చైర్మన్‌గా ఉన్న వైవి సుబ్బారెడ్డి కూడా కల్తీ జరిగినట్లు అంగీకరించిన విషయాన్ని సభ దృష్టిలో ఉంచారు. వైకాపా సభ్యులు కూడా కనీసం ఖండించకపోగా తప్పు కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. మాట్లాడుతుంటే గతంలో హెరిటేజ్ సంస్థ టెండర్లు వేశారని సభను తప్పుదోవ పట్టించే విధంగా వైకాపా సభ్యులు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. అధికార ప్రతిపక్ష సభ్యుల వాదోపవాదాల మధ్యనే చర్చను కొనసాగించినప్పటికీ ఇరువర్గాల దూషణల పర్వంతో వ్యవహరించడంతో సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## నేతన్నలకు నిరంతర ఉపాధే లక్ష్యం

### రాష్ట్ర సచివాలయంలో చేనేత స్టాళ్లను ప్రారంభించిన చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



సచివాలయం, మార్చి 4 ప్రభాతవార్త: జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో ఆప్కో ప్రత్యేక చేనేత స్టాళ్ళను ప్రారంభించినట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. 50శాతం డిస్కౌంట్లపై రాష్ట్రంలో తయారవుతునన్న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పట్టుచీరలు, ఇతర చేనేత చీరలు, రెడీమేడ్ వస్త్రాలను విక్రయించనున్నామన్నారు. నేతన్నలకు నిరంతరం ఉపాధి కల్పించాలన్న లక్ష్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్ర సచివాలయంలోని 4వ బ్లాక్ వద్ద మూడు చేనేత స్టాళ్ళను మంత్రి సవిత బుధవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి సవిత విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయ మహిళా ఉద్యోగుల వినతి మేరకు ప్రత్యేక చేనేత స్టాళ్ళను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రానున్న జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అన్ని చేనేత ఉత్పత్తులను 50శాతం డిస్కౌంట్లపై విక్రయించనున్నట్లు వెల్లడించారు. ఈనెల 10వ తేదీ వరకు ఈ స్టాళ్ళను కొనసాగించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1వ తేది నుండి చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయనున్నామన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో వారం రోజులపాటు ఏర్పాటుచేసిన చేనేత స్టాళ్ళకు విశేష స్పందన లభించిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, ఉద్యోగుల చేనేత వస్త్రాల కొనుగోలుకు ముందుకొచ్చారని, సచివాలయ ఉద్యోగుల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచి నేతన్నలకు 365రోజులు ఉపాధి కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, ఇతర అధికారులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, పేరెపి ఈశ్వర్, ఎం.ఈశ్వర్, రాష్ట్ర సచివాలయ మహిళా ఉద్యోగ సంఘ ప్రతినిధులు దుర్గ, సత్యవతి, సునీత, కవిత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం



బిట్రగుంట (నెల్లూరు), మార్చి 4, ప్రభాతవార్త: బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైఖానస సాంప్రదాయ ప్రకారం పాల్గొణ మాస పౌర్ణమి రోజున ఈ కల్యాణ మహోత్సవం అత్యంత కమనీయంగా వేదమంత్రాలు మధ్య నిర్వహించారు. కల్యాణం సందర్భంగా భక్తులు గోవింద నామస్మరణతో బిలకూట క్షేత్రం మార్మోగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు కావలి శాసనసభ్యులు డివి కృష్ణారెడ్డి ద్వారా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు శ్రీస్వామి వారికి, అమ్మవార్లకు సమర్పించారు. జిల్లా నలుమూల నుండి విశేషంగా ఈ మహోత్సవాన్ని తలకించేందుకు హాజరయ్యారు. నూతనంగా అమర బచ్చు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన లక్ష్మి కృష్ణ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం శోభయమానంగా జరిగింది. ఉభయకర్తలు తోపాటు అర్చకులు, పలువురు ప్రముఖులు వేదిక పైన ఆశీనులయినారు.

## తెప్పోత్సవంలో అపశృతి

### పరుగులు తీసి ప్రాణాలతో బయటపడ్డ ఉభయకర్తలు



బిట్రగుంట (నెల్లూరు), మార్చి 4, ప్రభాత వార్త: బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జరిగిన తెప్ప ఉత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. తెప్పోత్సానికి సంబంధించిన బోటులో పరిమితికి మించి ఉభయకర్తలతో పాటు ఎక్కువ మంది ఎక్కడంతో బోటు ఓ పక్కకు ఒరిగిపోయింది. దీంతో అందరూ క్షేమంగా ప్రాణాలతో బయటపడ్డారు. ప్రతి ఏడాది జరిగే బ్రహ్మోత్స వాల్లో రథోత్సవంలో అపశృతి చోటుచేసుకోవ డం జరుగుతుండడంతో ఏడాది రథోత్సవం విజయవంతంగా జరిగి తెప్పోత్సవంలో అపశృతి చోటుచేసుకోవడం భక్తులు విస్మయం చెందారు.

## జగన్, భూమన, వైవీ సుబ్బారెడ్డి కుట్రపూరితంగా నేరం చేశారు

### - తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసన మండలిలో ఎమ్మెల్సీ అనురాధ



విజయవాడ, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిది: తిరుమల శ్రీవారిపై గతంలో జగన్ ప్రభుత్వం కక్షగట్టిందని తెదేపా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆరోపించారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసన మండలిలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. టెండర్ నిబంధనలను సవరించి ఇష్టానుసారం వ్యవహరించారని విమర్శించారు. అనేక భయంకరమైన రసాయనాలు కలిసి ఉన్నవాటికి ఆవు నెయ్యి అని పేరు పెట్టారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సడలించారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించేశారు. టర్నోవర్ ఏడాదికి రూ.250 కోట్లు అని ఉన్న నిబంధనను రూ.150 కోట్లకు పరిమితం చేశారు. సాంకేతిక అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా టెండర్లు కట్టబెట్టారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చేశారు. టెంబర్ నిబంధనల సడలింపుపై తితిదే అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సంతకం చేశారు. నెయ్యి కల్తీ జరిగిందని ఎన్డీడీబీ నివేదిక ఇచ్చింది. ఇది కుంభకోణమే కాదు. హిందుత్వంపై దాడి. మాజీ సీఎం జగన్, తితిదే మాజీ చైర్మన్లు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి కుట్రపూరితంగా నేరం చేశారు అని పంచుమర్తి అనురాధ ఆరోపణలు గుప్పించారు.



## చైనా నౌకలకు హార్ముజ్ జలసంధిలో అనుమతి

### ఇతర నౌకలు ప్రయాణిస్తే మిలిటరీ చర్యలు తప్పవు.. ఇరాన్

### హార్ముజ్ నౌకలకు అమెరికా నేవీరక్షణ: ట్రంప్

**టెహ్రాన్, మార్చి 4:** భీకరపోరులో ఇరాన్ తనకు మద్దతుగా నిలిచిన చైనాదేశపు నౌకలను పంపించేందుకుగాను హార్ముజ్ జలసందిని తెరిచింది. చైనా నౌకలు తప్ప మరే ఇతర దేశం నౌకలను కూడా హార్మోజ్ జలసంధినుంచి అనుమతించబోమని, లేనిపక్షంలో కచ్చితంగా మిలిటరీ చర్యలు ఉంటాయని అమెరికా హెచ్చరించింది. అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్‌యుద్ధం ఐదోరోజుకు చేరుకున్న తరుణంలో ఇరాన్ తన మిత్రదేశాలపట్ల కొంత మెతక వైఖరితో ఉంది. చైనా చమురు నౌకలు మాత్రమే ఈ జలసందిగుండా వెళ్లేందుకు అనుమతులు ఇచ్చిందని తేలింది. బీజింగ్ ఇచ్చిన మద్దతుకు కృతజ్ఞతగా ఇరాన్ ఈచర్యలు చేపట్టింది. ఇతర అన్నిదేశాలచైనా గల్ఫ్‌దేశాలనుంచి తమ దేశీయ అవసరాలకు ఈ జలసంధి ద్వారానే చమురు రవాణాచేస్తుంది. నౌకలు ఒక్కసారిగా నిలిచిపోవడంతో చైనా దేశీయ అవసరాలకు విఘాతం కలిగింది. దీనితో చైనా దౌత్యంమేరకు ఇరాన్ ముందుకు వచ్చింది. నౌకలను మాత్రం నిషేధించింది. ఇరాన్ హెచ్చరికలను ఖాతరుచేయకపోవడంతో సుమారు 10 చమురు ట్యాంకర్లుఉన్న నౌకలపై ఇరాన్ దాడులుచేసింది. అయితే హార్మోజ్ జలసంధిగుండా నిలిచిపోయిననౌకలకు అమెరికా నేవీ రక్షణతో ప్రయాణిస్తాయని, ఇరాన్ ప్రతిఘటనకు వస్తే భారీ స్థాయిలో ప్రతిఘటన చర్యలు కూడా ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ హెచ్చరించారు. ప్రపంచానికి చమురు స్వేచ్ఛగా రవాణా చేయాలని అమెరికా లక్ష్యంతో ఉందని, ప్రపంచంలో అమెరికా ఆర్థికంగా, రక్షణపరంగా, మిలిటరీపరంగా కూడా అతిపెద్ద దేశమని, మరిన్ని కార్యాచరణ చర్యలు బయటపడతాయని ఇరాన్‌ను హెచ్చరిస్తూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టుపెట్టారు.

## మధ్యప్రాచ్యంలోని భారతీయులను రప్పించేందుకు 58 విమానాలు



**న్యూఢిల్లీ, మార్చి 4:** మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తరలించేందుకు భారత విమానయాన సంస్థలు భారీ ఆపరేషన్ చేపట్టా యి. బుధవారం ఒక్కరోజే 58 ప్రత్యేక విమానా లను నడుపుతున్నట్లు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇండిగో 30 విమానాలను, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ కలిసి 23 విమానాలను నడపనున్నాయి. పశ్చిమాసియాలోని చాలా దేశాలు తమ గగనతలాన్ని మూసివేయడం లేదా కఠిన ఆంక్షలు విధించడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఈ సంక్షోభ పరిస్థితుల్లో చిక్కుకున్న భారతీయు లను సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకు న్నారు. ఎయిర్ ఇండి యా, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ వంటి సంస్థలు దుబాయ్, ఫుజైరా వంటి నగరాల నుంచి ఈ ప్రత్యేక సర్వీసులను నడుపు తు న్నాయి. ఈ విమా నాలు న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, కొచ్చి, అహ్మదాబాద్, తిరువనంతపురం విమానాశ్రయాలకు చేరుకోనున్నాయి. ప్రస్తుతం దుబాయ్ గగనతలం పాక్షికంగా మాత్రమే తెరిచి ఉంది. పరిమిత సంఖ్యలో విమానాలకు అనుమతి నిస్తున్నారు. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థ నుంచి నిర్ధారిత బయలుదేరే సమయం గురించి సమాచారం అందిన తర్వాతే విమానాశ్రయానికి రావాలని అధికారులు ప్రయాణికులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. అప్పటివరకు దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లవద్దని కోరారు. మరోవైపు అబుధాబి నుంచి తమ కార్యకలాపాలను గురువారం (మార్చి 5వ తేదీ) మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఎతిహాద్ ఎయిర్‌వేస్ ప్రకటించింది. ప్రయాణికుల భద్రతే తమకు అత్యంత ముఖ్యమని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రిఫండ్‌లు, రీషెడ్యూలింగ్, ఇతర సహాయక చర్యల విషయంలో ప్రయాణికులతో పారదర్శ కంగా వ్యవహరించాలని అన్ని విమానయాన సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్లిష్ట సమయంలో విమాన టికెట్ల ధరలు అదుపు తప్పకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రయాణికులపై అనవసర భారం పడకుండా చూస్తామని మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది.

## సౌదీ ఆరామ్‌కోపై ఇరాన్ మళ్లీ దాడి!

### ఎగుమతులు నిలిపివేసిన సౌదీ సంస్థ



**దుబాయి, మార్చి 4:** ఇరాన్ తన దాడుల్ని తీవ్రతరం చేసింది. ముఖ్యంగా కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియాలపై ప్రతీకారంతో విరుచుకుపడుతోంది. తాజాగా చమురు దిగ్గజ సంస్థ సౌదీ అరామ్‌కోకు చెందిన రాస్ తనురా రిఫైనరీపై దాడి చేసింది. ఈ రోజు మళ్లీ రిఫైనరీ దాడికి గురైనట్లు సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తెలిపారు. ఈ అరామ్‌కో కాంప్లెక్స్ అతిపెద్ద దేశీయ చమురు శుద్ధి కార్మాగారాలకు నిలయంగా ఉంది. ఇది ఆ దేశ ఇంధన రంగానికి కీలకంగా ఉంది. రాస్ తనురా శుద్ధి కర్మాగారాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి ప్రయత్నించారు, ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ దాడి డ్రోన్ ద్వారా జరిగిందని, ఫలితంగా ఎటువంటి నష్టం జరగలేదని ప్రతినిధి చెప్పారు. ఇరాన్ షాహెద్ ఆత్మాహుతి డ్రోన్లతో ఇలాంటి దాడినే చేసింది. ఈ దాడి కారణంగా సౌదీ అరామ్ కో తన రాస్ తనురా రిఫైనరీని మూసేయాల్సి వచ్చింది. సౌదీ అరేబియా ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతిదారుగా ఉంది. దీని చమురు క్షేత్రాలు, పెట్రోలియం మౌలిక సదుపాయాలు తూర్పు తీరంలో ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
అటవీ విభాగం
సంక్షిప్త టెండర్ ప్రకటన నం. 10/2025-26
Rc.No. 1303/2025/TO తేది: 27.02.2026
ఐటమ్: విశాఖపట్నం ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్‌లో అంచనా ధర: రూ.7.75 లక్షలు వైల్డ్ డాగ్ (ఓల్డ్ జాగార్) ఆవరణంకు మరమ్మతులు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 11.03.2026 మ.12.00 గం. వరకు. తదుపరి వివరాలు దిగువ సంతకందారుని నుండి పొందవచ్చును. ఫోన్ నం. 9281054758.
సం/- క్యూరేటర్, ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్, విశాఖపట్నం
DIPR.No.19236/CL/Advt/1/1/2022-23, తేది: 04.03.2026

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
నిట్ నెం.159/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 28.02.2026
అనకాపల్లి R&B డివిజన్‌లో రూ.7.94 లక్షల మొత్తం కొరకు (R&B) డివిజన్‌లో 1 పని కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. ఆన్‌లైన్‌లో బిడ్స్ యొక్క జారీ కొరకు తేది: 05.03.2026 మ.3.00 గం. నుండి 09.03.2026 మ.3.30 గం. వరకు. తదుపరి వివరాలు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా http://www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), అనకాపల్లి
DIPR.No.19237/CL/Advt/1/1/2022-23, తేది: 04.03.2026

5-3Pg7exHMNWJQE.qxd:5-3Pg7exHMNWJQE.qxd 1/1/02 7:06 AM Page 1



# గన్నవరంలో తెలుగుతమ్ముళ్ల 'అసంతృప్తి'

## రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల్లో తీరని అన్యాయం

గన్నవరం(కృష్ణా) మార్చి 4, ప్రభాతవార్త: గత మూడు దశాబ్దాలకు పైగా అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన ప్రతిసారి రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి కలిగించే నియోజకవర్గం గన్నవరం అనటం అతిశయోక్తి కాదు. గతంలో ఇక్కడ పార్టీ టిక్కెట్ల కేటాయింపు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఉత్కంఠతను రెక్కిత్తించింది. 2019 ఎన్నికల్లో ఇక్కడ టిడిపి నుండి గెలిచిన వంశీమోహన్ వైసిపి తీర్థం పుచ్చుకోవటం తదుపరి టిడిపి శ్రేణులను టార్గెట్ చేసి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేయటం తెలిసిందే. తనకు రాజకీయ బిక్షపెట్టిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడను అసభ్య పదజాలంతో తిట్టడంతో పాటు, ఆయన భార్య భువనేశ్వరిని కించపరుస్తూ వ్యాఖ్యలు చేయటం తెలుగుదేశం శ్రేణులు జీర్ణించుకోలేకపోయారు.

ఇదే సమయంలో గన్నవరం టిడిపి పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయటంతో రాష్ట్రవ్యాప్తంగా టిడిపి కార్యకర్తలు నాయకులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. టిడిపి కార్యాలయాన్ని ధ్వంసం చేసి టిడిపి నాయకులపైనే పోలీస్ కేసులు పెట్టారు. పచ్చని పంటపొలాలతో ప్రశాంతంగా ఉండే కృష్ణాజిల్లాలో గన్నవరం నియోజకవర్గంలో వైసిపి నాయకులు చేసి ఆగడాలకు అంతులేకుండా పోయింది. ఫ్యాక్షన్ తరహా దాడులతోపాటు టిడిపి శ్రేణులపై లెక్కలేనన్ని పోలీస్ కేసులు పెట్టి వేధించారు. లోకేష్ యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు శతవిధాల ప్రయత్నించి బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలో యువగళం పాదయాత్రపై వైసిపి మూకలు దాడులకు పాల్పడ్డారు. ఈదాడులను టిడిపి కార్యకర్తలు తిప్పికొట్టడంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ యార్లగడ్డ వెంకట్రావ్‌తోపాటు నాయకులు, కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు. దీంతో వారంతా దాదాపు రెండు నెలలపాటు ఇళ్ళు, కుటుంబాలు వదలి పరారయ్యారు. ఈవిధంగా ఎన్నో వేధింపులను తట్టుకుని నిలబడ్డ టిడిపి శ్రేణులు వైసిపి అభ్యర్థి వంశీని ఓడించాలని కంకణం కట్టుకుని గత ఎన్నికల్లో పనిచేసాయి.

గన్నవరం పక్క నియోజకవర్గమైన గుడివాడలోనూ ఇదే రీతిగా కొడాలి నాని అధినేత చంద్రబాబును అరెయ్ ఒరేయ్ అంటూ దూషించటం టిడిపి శ్రేణులకు మింగుడు పడలేదు. గత ఎన్నికల్లో ఈరెండు నియోజకవర్గాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఆసక్తి కలిగించాయి. ఈరెండు నియోజకవర్గాల ఫలితాల పై భారీస్థాయిలో పందాలు జరిగాయి. ఈరెండు నియోజకవర్గాల టిడిపి నాయకులు ఇక్కడ టిడిపి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రాణాలను ఫణంగా పెట్టి ఎన్నికల్లో పనిచేసాయి.

టిడిపికి బిజేపి, జనసేన మద్దతుగా నిలవటంతో ఈరెండు నియోజకవర్గా ల్లో టిడిపి అభ్యర్థులు ఎన్నడూ రానంత మెజార్టీ సాధించి ప్రత్యర్థులను కోలుకోలేని దెబ్బకొట్టి మట్టికరిపించారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పాటయిన తరువాత ఈరెండు నియోజక వర్గాలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని భావించగా వారి అంచనాలు తప్పాయి. రాష్ట్రస్థాయి నిమినేటెడ్ పదవుల పంపిణీలో గన్నవరం నియోజకవర్గానికి తీరని అన్యాయం జరిగింది. దీంతో అధిష్టానం తమను చిన్నచూపు చూసిందన్న భావన టిడిపి శ్రేణుల్లో నెలకొంది. గుడివాడ నియోజకవర్గం నుండి రావి వెంకటేశ్వరావుకు కార్పోరేషన్ ఛైర్మన్ పదవిని ఇవ్వగా గన్నవరం నియోజకవర్గానికి మాత్రం మొండిచేయి చూపించారు.

గన్నవరం నియోజకవర్గం నుండి కేవలం రెండు కార్పోరేషన్‌ల డైరెక్టర్ పదవులు టిడిపికి ఇవ్వగా, కమ్మకార్పోరేషన్ డైరెక్టర్ ఇచ్చినట్లు ప్రకటించినా అది ప్రకటనకే పరిమితం అయ్యింది. కనీసం రాష్ట్రవ్యాప్తంగ ఉన్న ప్రముఖ దేవాలయాల పాలక మండళ్ళలోనూ, జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల్లోనూ గన్నవరం నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వలేదు.

పార్టీకోసం కష్టపడి పోలీస్ కేసులు ఎదుర్కొని ఎన్నో అవమానాలు, ఇబ్బందులు పడి ఆర్థికంగా నష్టపోయిన తమకు సరైన గుర్తింపు ఇవ్వలేదన్న అసంతృప్తి పార్టీ నాయకుల్లో నెలకొంది. తెలుగుతమ్ముళ్ల అసంతృప్తిని గమనించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ వారిని బుజ్జగిస్తున్నారు.

తదుపరి పదవుల కేటాయింపులో గన్నవరం కు ప్రాధాన్యత దక్కేలా అధినేతతో మాట్లాడి నాయకులకు న్యాయం చేస్తానని భరోసా ఇస్తున్నారు. ఇప్పటికైనా అధిష్టానం స్పందించి గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం నాయకులకు రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యత నివ్వాలని పార్టీశ్రేణులు కోరుతున్నాయి.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**● సిఎం చంద్రబాబు నాయుడుకు ఎపి ఎన్‌జిఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ విజ్ఞప్తి**



విజయవాడ, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: గత ప్రభుత్వం హయాంలో అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యల పరిష్కారం కోసం వేగవంతమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఎన్నికైన అంజి జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. వేతన సవరణ కమిటీ ఛైర్మన్ నియామకం చేయాల్సి న అవసరం ఉందని తెలిపారు నియామకం చేయాల్సి న అవసరం ఉందని తెలిపారు. బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసిన తరువాత మీడియాతో మాట్లాడుతూ పెండింగ్ డిఏలు, మధ్యంతర భృతి, పిఆర్‌సి కమిటీ నియామకం, ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్యలపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక, పెన్షనర్లు, ఔట్సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలోని వివిధ శాఖలలో ఖాళీలు భర్తీ వంటి కీలకమైన అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం స్పందన కోసం రాష్ట్రంలోని ఉద్యోగులందరూ ఎదురుచూస్తున్నారని ముఖ్యమంత్రి వివరించానన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ, పరిష్కారం కావలసిన అంశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు పెన్షనర్లకు డిఎ బకాయిలు మంజూరు చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఆర్థికపరమైన అంశాలతో పాటు ఆర్థికేతర అంశాలలో కూడా ప్రభుత్వం దశలవారీగా ఉద్యోగులకు న్యాయం చేస్తుందని ఆశాభావంతో ఉద్యోగులు ఉన్నారన్నారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో కనీసం నిర్ణిత వ్యవధిలో జీతాలు కూడా పొందలేకపోయిన ఉద్యోగులందరూ ప్రస్తుత ప్రభుత్వంలో ఖచ్చితమైన సమయానికి జీతాలు పొందగలుగుతున్నారన్నారు. పెన్షనర్లకు క్వాంటం పెన్షన్ అన్యాయాన్ని సరిదిద్దాలని ముఖ్యమంత్రిని కోరానన్నారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి సావధానంగా వినడంతో పాటు ఉద్యోగుల ప్రయోజనాలపై ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, గత ప్రభుత్వం ద్వారా ఉద్యోగులకు ఎదురైన అన్ని ఇబ్బందులను ఒక్కొక్కటి పరిష్కారం చేసుకుంటూ వెళ్తున్నామని, బకాయిలను కూడా క్రమబద్ధంగా చెల్లిస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వి రమణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.జగదీశ్వర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ రవికుమార్, ఎండి.జాని పాషా, ఎం కిరణ్ కుమార్ రాష్ట్ర కార్యదర్శులు యస్.బి.వి. రాంప్రసాద్, యల్.రజనీష్ బాబు, వివిధ జిల్లాల అధ్యక్షులు జి.రామ్మోహన్, జివి ఆర్ యస్ కిషోర్, బి శ్రీనివాసులు, ఆకునూరి శ్రీనివాసరావు, బి వెంకటేశ్వర్లు, యన్ టి ఆర్ జిల్లా సహ అధ్యక్షులు వి వి ప్రసాద్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ జోనల్ అధ్యక్షులు ఎం రాజుబాబు, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు బి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యసభకు నితీశ్‌కుమార్!

## జాతీయ రాజకీయాల్లోకి బీహార్ సిఎం

## వారసుడికి డిప్యూటీ సిఎం

## ఒక్కసారిగా వేడెక్కిన ఎన్డీయె రాజకీయాలు

**పాట్నా, మార్చి 4:** బీహార్‌లో జెడియు, ఎన్డీయే కూటమి రాజకీయాలు ఒక్కసారిగా మలుపులు తిరిగాయి. ఎన్డీయే సీఎంగా ఉన్న నితీష్‌కుమార్ రాజీనామాచేసి రాజ్యసభకు వెళతారని అంచనాలు పెరిగిపోయాయి. ఇదే నిజమైతే బీహార్ రాజకీయాల్లో సంచలనం రేగడం ఖాయం. ప్రస్తుతం ఎన్డీయే ఆధ్వర్యంలోని ఉమ్మడి ప్రభుత్వం కొలువుదీరి ఉంది. బీహార్‌లో నితీష్ కుమార్ (జేడీయూ) సీఎంగా కొనసాగుతున్నారు. ఒప్పందంలో భాగంగా ఆయనకు సీఎం పదవి దక్కింది. అయితే కూటమిలోని బీజేపీకి ఎక్కువ అసెంబ్లీ స్థానాలున్నాయి. 243 అసెంబ్లీ స్థానాలకుగాను ఎన్డీయేకు 202 సీట్లున్నాయి. అందులో అత్యధికంగా బీజేపీకి 89, ఆ తర్వాత జేడీయూకు 85, కూటమిలోని మిగతా పార్టీలకు 28 సీట్లు దక్కాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ తప్పుకొంటారన్న అంచనాలు పెరిగాయి. ఆయనను రాజ్యసభకు పంపాలని జేడీయూ, బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం దీనికి కావాల్సిన ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. జేడీయూ కూడా దీనిపై అంగీకారం తెలిపింది. రాజ్యసభకు నితీష్ నామినేషన్ వేసేందుకు తగిన పత్రాలు కూడా సిద్ధమయ్యాయి. ఆయన సంతకం పెడితే చాలు నామినేషన్ వేసేందుకు రంగం సిద్ధమైంది. బీహార్ నుంచి జేడీయూ తరపున రెండు రాజ్యసభ స్థానాలకు అవకాశం ఉంది. అందులో రామనాథ్ ఠాకూర్‌ను ఒక అభ్యర్థిగా ఖరారు చేశారు. ౦ండో అభ్యర్థి విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ రెండో స్థానంలోనే నితీష్ రాజ్యసభకు వెళ్లే అవకాశం ఉంది. నితీష్ దీనికి పూర్తిగా అంగీకరిస్తే గురువారం నాడే నామినేషన్ దాఖలు చేస్తారు. ఇదే జరిగితే నితీష్ బీహార్‌లో చేపట్టబోయే మలిదశ సమృద్ధి యాత్ర వాయిదా పడొచ్చు. ఈ యాత్ర ఈ నెల 8న ప్రారంభం కావాలి. నితీష్ రాజ్యసభకు వెళ్తే సీఎం పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీంతో బీహార్‌కు కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలి. ఈసారి ఆ స్థానాన్ని కూటమిలో అత్యధిక స్థానాలున్న బీజేపీ తీసుకుంటుంది. ఆ పార్టీ అభ్యర్థి నూతన సీఎం అవుతారు. రాష్ట్ర రాజకీయాల నుంచి నితీష్ జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనుకోవడం కూడా ఆయన రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకోవడానికి కారణమని తెలుస్తోంది. మరోపక్క నితీష్ వారుడు నిశాంత్‌కుమార్ రాజకీయాల్లో చురుకుగా ముందుకురావాలన్న కసరత్తులు మొదలయ్యాయి. రాజ్యసభకు నిశాంత్‌కుమార్ అర్హత కల వ్యక్తి అని చెపుతున్నారు. సీఎంగా ఉన్న తండ్రి రాజ్యసభకు వెళితే ముఖ్యమంత్రి పదవికి రాజీనామాచేస్తారు. ఆ సందర్భంగా బిజెపికే ఈసారి సీఎం పోస్టు దక్కుతుంది. అయితే సీఎం కుమారుడునిశాంత్‌కుమార్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారన్న ఊహాగానాలుపెరిగాయి. అయితే తండ్రి లేదా కుమారుడు రాజ్యసభకు వెళతారన్న వాదన కూడా లేకపోలేదు. జెడియు ప్రతినిధి నీరజ్‌కుమార్ మాట్లాడుతూ అభ్యర్థులను నిర్ణయించే హక్కు బీహార్‌సీఎం, జెడియు జాతీయ అధ్యక్షుడు నితీష్‌కుమార్‌కే ఉందని స్పష్టంచేసారు.

# నేడు తిరుమలకు కల్వకుంట్ల కవిత



తిరుమల, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం మధ్యాహ్నం తిరుపతి పర్యటనకు వస్తున్నారు. ఆమె బిఆర్‌ఎస్ నుండి బయటకు వచ్చిన తరువాత తొలిసారిగా తెలంగాణ జాగృతి తరపున ఆమె ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని ఆశీస్సు లందు కునేందుకు వస్తుండటం ప్రత్యేకత. త్వరలోనే ఆమె రాజకీయపార్టీని ఏర్పాటుచేయనున్న నేపథ్యంలో ఆమె రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుమలేశుని దర్శనంకోసం వస్తున్న ఆమె నేటి మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకోనున్నారు. అక్కడ నుండి అలిపిరివరకు ప్రయాణించి మధ్యాహ్నం 3 గంటలకు అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమలకు రానున్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

# కుంభాభిషేక ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు : మంత్రి ఆనం



ఇంద్రకీలాద్రి, మార్చి 4, ప్రభాతవార్త: శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై ఈనెల 6నుండి 8వ తేదీ వరకు జరగబోయే మహా కుంభాభిషేకం ఏర్పాట్లను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి బుధవారం పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే సుజానా చౌదరి, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్‌లతో కలిసి నిర్వహించిన ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ భక్తులకు అందాల్సి న సౌకర్యాలు నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. 12 ఏళ్ల తర్వాత వచ్చే ఈ అద్భుత ఆధ్యాత్మిక ఘట్టాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, విజయవంతంగా నిర్వహించేం దుకు ప్రభుత్వం, ఆలయ యంత్రాంగం కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పాలక మండలి కార్యాలయం లో నిర్వహించిన సమీక్షలో కుంభాభిషే కానికి వచ్చే భక్తుల కోసం చేపట్టాల్సి న చర్యలపై దిశానిర్దేశం చేశారు. క్యూ లైన్ల ఆధునీకరణ, తాగునీటి సౌకర్యం. అన్నప్రసాదం మరియు లడ్డూ ప్రసాదం పంపిణీ కౌంటర్ల ఏర్పాట్లు వగైరా. నూతన ఘాట్ రోడ్డు కనెక్టివిటీ, ఎస్కలేటర్లు, లిఫ్టుల ఏర్పాటు వంటి శాశ్వత అభివృద్ధి పనుల సమీక్షించారు. తొలుత విమాన గోపురంపై జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, పనుల పురోగతిపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. మహామండపాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న కుంభాభిషేక ఏర్పాట్లు, ఆలయ అభివృద్ధికి సంబంధించిన ఇంజనీరింగ్ పనులను పరిశీలించారు.

**కుంభాభిషేకంకు పటిష్ట ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్:** మహా కుంభాభిషేకం 2026 ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ జె. చంద్, విజయవాడ సిపి రాజశేఖర్ బాబు, డీసీపీ గున్నం రామకృష్ణ తదితరులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఆలయ క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు, ఘాట్ రోడ్డు మరియు యాగశాల ప్రాంతాలను కలెక్టర్ బృందం సందర్శించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం, తాగునీరు, అన్నప్రసాదం పంపిణీలో ఎక్కడా లోటు రాకూడదని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ మరియు డీసీపీ రామకృష్ణలతో కలిసి భద్రతా అంశాలపై కలెక్టర్ చర్చించారు. సీసీ కెమెరాల నిఘా, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, తోపులాటలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఇఓ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, మహా కుంభాభిషేకం కోసం చేసిన ప్రత్యేక ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు. విమాన గోపుర పనులు, రంగులు పనులు పూర్తయ్యాయని వారు పేర్కొన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ, దర్శనం వేగంగా జరిగేలా చూడాలని, ఎండ తీవ్రత దృష్ట్యా చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం నిరంతరం అందుబాటులో ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తులందరికీ అమ్మవారి దర్శనం అత్యంత ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టిందని కలెక్టర్ డా లక్ష్మీశ వెల్లడించారు.

**దుర్గమ్మవారి సేవలో సిఎంఓ అధికారి ప్రద్యుమ్న:** ముఖ్యమంత్రి కార్యాలయ సిఎంఓ ప్రద్యుమ్న కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మవారిని బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఇఓ వికె సీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణలు శ్రీఅమ్మవారి శేషవస్త్రం, జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు. మార్చి 6 నుండి 8 వరకు జరగనున్న మహా కుంభాభిషేక మహోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ఈ సందర్భంగా వారిని ఆహ్వానించారు.



**గో సంరక్షణ కోసం భారీ విరాళం:** విజయవాడకు చెందిన కె లీలా కుమారి, వారి కుటుంబ సభ్యులు గో సంరక్షణార్థం రూ.1,01,116లను విరాళంగా బుధవారం అందజేశారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అధికారులు దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ

**● అవినీతిపరులతో కుమ్మక్కయిన అధికారులపై చర్యలు ● పెండింగ్ లో 32,970 రెవెన్యూ కేసులు ● శాసనసభలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్**



విజయవాడ, మార్చి4, ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో 10.2.2026 నాటికి 32,970 రెవెన్యూ కేసులు పెండింగ్ లో ఉన్నాయని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. 2005 వరకు 4 కేసులు మాత్రమే పెండింగ్ లో ఉండగా, 2006 నుండి 2010 వరకు 204 కేసులు, 2011 నుండి 2015 వరకు 1809 కేసుల, 2016 నుండి 2020 వరకు 17,291 కేసులు, 2021 నుండి 2025 వరకు 12,434 కేసలు, 2026 నుండి ఇప్పటి వరకు 1228 కేసులు పెండింగ్ లో ఉన్నట్లు తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తీసుకుంటన్న వివిధ చర్యల కారణంగా నమోదవుతున్న కేసుల సంఖ్య కూడా చాలా తక్కువగా ఉందని తెలిపారు. హైకోర్టులో నమోదైన కేసుల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో లైజనింగ్ ఆఫీసర్లను నియమించామని చెప్పారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ నాయకత్వంలో లీగ్ సెల్ ను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఈ లీగల్ సెల్ జిల్లాకు సంబంధించిన కోర్టు కేసులను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తోందని అన్నారు. కోర్టు కేసుల నిర్వహణ కోసం రెవెన్యూ శాఖ ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ లిటిగేషన్ కేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్‌ను సమర్థవంతంగా ఉపయోగిస్తోందన్నారు. ఈ వ్యవస్థ వల్ల జిల్లా అధికారులకు మరియు ప్రభుత్వ ప్లీడర్లకు మధ్య సమన్వయం పెరిగిందని, దీనివల్ల చాలా కేసులు ప్రారంభ దశలోనే పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. అయితే భూ వివాద కేసుల పరిష్కారంలో ఎవరైనా అధికారులు తప్పు చేస్తే సహించేది లేదన్నారు. లైజనింగ్ ఆఫీసర్లు కుమ్మక్కయినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భూ వివాదాల్లో రికార్డులను తారుమారు చేసిన కొందరు అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కోర్టు కేసులను మరింత సమర్థవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు, విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటుకు పునరుత్పాదక విద్యుత్ పరిశ్రమల(గ్రీన్ ఎనర్జీ) ఏర్పాటు చాలా కీలకమన్నారు. దేశంలోనే మొదటి సారిగా అనకాపల్లిలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీని ప్రారంభించమని, అదేవిధంగా కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంటును కూడా ప్రారంభించామని చెప్పారు. పునరుత్పాదక విద్యుత్(క్లీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల ఏర్పాటుకు 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని, ఈ పెట్టుబడులన్నీ గ్రౌండ్ అయితే దాదాపు 7.5 లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని, దీంతో మొత్తం రాష్ట్ర ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలంటే కొన్ని చోట్ల అసైన్డ్ భూములు అవసరమని, అందకే లీజు ప్రాతిపదికన ఆ భూములు తీసుకునేందుకు చట్ట సవరణ చేస్తున్నట్లు చెప్పారు. 20 లక్షల మంది ఉపాధి కల్పించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలో ఈ చట్ట సవరణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజలపై ఉన్న విద్యుత్ ఛార్జీల భారాన్ని మరింత తగ్గించడానికి కూడా ఈ చట్ట సవరణ ఉపయోగపడుతుంది. ఇప్పటికే యూనిట్ పై 13 పైసలు తగ్గించాం. భవిష్యత్తులో మరింత తగ్గిస్తామన్నారు. క్లీన్ ఎనర్జీ ఉత్పాదన ఎంత ఎక్కువ పెరిగితే విద్యుత్ ఉత్పత్తిపై పెట్టే ఖర్చు అంత తక్కువ అవుతుందన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ లో భాగంగా నెట్ జీరో కార్బన్ స్థాయికి చేరుకోవాలన్న లక్ష్య సాధనకి ఈ చట్ట సవరణ దోహద బడుతుందన్నారు. అసైనీదారులు పూర్తి సమ్మతితో, వారి అంగీకరించిన తర్వాతే వారి వద్ద నుండి భూములు లీజుకు తీసుకుంటామన్నారు. ఈ భూములు లీజుకు ఇవ్వడం ద్వారా ఎకరానికి 31 వేల రూపాయల నికర ఆదాయం అసైనీదారులకు లభిస్తుందని, ప్రతి రెండేళ్ల ఒకసారి ఐదు శాతం లీజు పెంచడం జరుగుతుందన్నరు. అసైన్డ్ భూముల్లో చాలా చోట్ల బంజరు భూములు ఉన్నాయని, వీటిని లీజుకు ఇవ్వడం ద్వారా అసైనీలకు అదనపు ఆదాయం వస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# అచ్చెన్నాయుడిని బర్తరఫ్ చేయాలి

## వైఎస్సార్సీ నేతలు బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, సుధాకర్ బాబు

విజయవాడ, మార్చి 4 ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర శాసనమండలిలో ఇవాళ చోటుచేసుకున్న ఘటనలు ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా నిలిచిపోయాయని వైఎస్సార్సీపీ సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, టీజేఆర్ సుధాకర్ బాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సి న పవిత్ర వేదిక అయిన చట్టసభలోనే అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. శాసనమండలి ఛైర్మన్ మోషెన్ రాజు గారి పట్ల మంత్రులు, టీడీపీ సభ్యులు అమానవీయంగా, అవమానకరంగా ప్రవర్తించారని తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని గౌరవించాల్సింది పోయి కులం, మతం పేరుతో టార్గెట్ చేయడం చట్టసభల సంస్కృతికి విరుద్ధమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకే ఈ దాడులు జరిగాయని స్పష్టమైందని వైఎస్సార్సీపీ నేతలు ఆరోపించారు. మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు యాదృచ్ఛికం కాదని, దీనివెనుక స్పష్టమైన దురుద్దేశం ఉందని పేర్కొన్నారు. మంత్రి లోకేష్ సభలో ఉండగానే ఈ ఘటన జరగడం మరింత ఆందోళనకరమని అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఒక దళిత వ్యక్తిని మతం, కులం పేరుతో అవమానించడం కేవలం వ్యక్తిగత దాడి మాత్రమే కాకుండా సామాజిక న్యాయం, సమానత్వంపై దాడి అని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు స్పష్టం చేశారు. ఛైర్మన్‌ను ఏ మతానికి చెందినవారు?" అని ప్రశ్నించడం చట్టసభల గౌరవాన్ని మంటగలిపిందని పేర్కొన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారాన్ని రాజకీయ దుమారంగా మార్చి, ఆ నీడలో హెరిటేజ్ ఫుడ్స్ ద్వారా జరుగుతున్న అనుమానాస్పద లావాదేవీలపై వస్తున్న ఆరోపణలను దారి మళ్లించేందుకు అధికార పక్షం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తిరుమల నెయ్యి కొనుగోళ్లలో అవకతవకలపై ఆధారాలతో ప్రశ్నలు లేవనెత్త గానే అధికార పక్షం అసహనానికి లోనైందని పేర్కొన్నారు. మార్కెట్ రేటు కంటే అధిక ధరలకు నెయ్యిని సరఫరా చేస్తూ హెరిటేజ్ యూనిట్ ద్వారా లాభాలు పొందుతు న్నారనే అంశాలపై సమాధానం చెప్పలేకపోయినందుకే సభను గందరగోళానికి గురిచేసే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. మండలిని తమ చేతుల్లోకి తీసుకోవాలన్న దురుద్దేశంతోనే ఛైర్మన్‌పై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు హానికరంగా వ్యవహరించిన మంత్రి అచ్చెన్నాయుడిపై తక్షణ చర్యలు తీసుకుని, మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

# ఉత్కంఠ భరితంగా రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలు

అనంతపురం, మార్చి 4 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలు ఆసక్తిని రేకిస్తున్నాయి. హోలీ పండుగతో బుధవారం ఓట్ల లెక్కింపు జరగలేదు. గురువారం నుంచి ఓట్ల లెక్కింపు ప్రాధాన్యత ఓట్ల పరంగా తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులకు జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేసుకోవడం, వివిధ జిల్లాల్లో ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుల స్థానాలకు ఓట్ల లెక్కింపులో భాగంగా గత మంగళవారం రాత్రి తుది ఫలితాలను బట్టి మొదటి రౌండ్లో ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. అజయ్ కుమార్ చలసాని ( విజయవాడ) 2121, చిదంబరం. కె ( ఏపీ హైకోర్టు) 1290, రామిరెడ్డి ఆలూరు ( అనంతపురం) 1289, బ్రహ్మారెడ్డి. వి ( గుంటూరు) 1056, బాలాజీ ఎలమందల(ఏపీ హైకోర్టు)1021, సుమంత్ ఎన్వి ( ఏపీ హైకోర్టు) 918, శాంత కుమార్ (గుంటూరు) 912, కృష్ణారెడ్డి (ఏలూరు) 836, చంద్రశేఖర్ రెడ్డి (నెల్లూరు)813, రామారావు గంటా (ఏపీ హైకోర్టు) 740, వెంకటరమణమూర్తి బండారు (విశాఖపట్నం) 725, శ్రీనివాసరెడ్డి కొమ్మినేని ( ఏపీ హైకోర్టు) 717, వెంకట్రామిరెడ్డి కొవ్వూరు, ఏపీ హైకోర్టు) కోర్టు 691 ఓట్లు వచ్చాయి, ఈ విధంగా మిగిలిన అభ్యర్థులకు కూడా మొదట్లో ఓట్లు పోలయ్యాయి.

05-03Pg5.qxd:05-03Pg5.qxd 1/1/02 6:56 AM Page 1



# అమెరికా ఆయుధ సంపద ఆవిరి!



మరో 10 రోజులు దాడులు కొనసాగితే ఆయుధ కొరత అనివార్యం

ఇరాన్‌తో పోరుకోసం క్షిపణుల సంఖ్యభారీగా పెంచిన అమెరికా

**వాషింగ్టన్, మార్చి 4:** అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం రోజురోజుకూ ముదురుతోంది. యుద్ధం కొనసాగుతున్న ఈ పరిస్థితుల్లో పెంటగాన్ నుంచి వచ్చిన హెచ్చరిక చర్చనీయాంశంగా మారింది. అమెరికా వద్ద రోజురోజుకూ క్షిపణి నిల్వలు తగ్గిపోతున్నట్లు పెంటగాన్ నివేదిక లీక్ అయింది. మరో 10 రోజులు ఇలాగే దాడులు కొనసాగిస్తే కీలకమైన క్షిపణుల నిల్వలు తగ్గిపోవచ్చని ఈ నివేదిక హెచ్చరించింది. ముఖ్యంగా ఇంటర్‌సెప్టర్ క్షిపణులు, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ల నిల్వలు గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను ఎదుర్కోవడంలో ప్రస్తుతం ఇవి కీలక పాత్రను పోషిస్తున్నాయి. ఈ క్రమంలో పది రోజులు దాడులు కొనసాగితే పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఆయుధ, క్షిపణి సంపత్తిని తిరిగి పెంచుకునేందుకు అధిక ఖర్చులు భరించాల్సి ఉంటుందని ఈ నివేదిక పేర్కొంది. కీలకమైన ఆయుధాల కొరత వల్ల ఇరాన్ దాడులను తిప్పికొట్టడం అసాధ్యంగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది. గత కొన్నేళ్లుగా మిత్రదేశాలైన ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌లకు ఆయుధ సంపత్తిని అందిస్తుండటంతో నిల్వలు తగ్గిపోతున్నట్లు తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటన మాత్రం మరోలా ఉంది. తమ వద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇరాన్‌తో పోరాడటానికి కావాల్సిన ఆయుధాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అత్యాధునిక ఆయుధాలను ఇతర దేశాల్లోనూ నిల్వచేశామని వెల్లడించారు. ఇరాన్‌పై దాడులు మరో ఐదు వారాలు లేదా అంతకంటే ఎక్కువగా కొనసాగవచ్చునని తెలిపారు.

ఇరాన్ సుమారు 20,000 డాలర్ల విలువైన షా136 డ్రోన్లు ప్రయోగించింది. వీటిని ఎదుర్కొనేందుకు అమెరికా ఎఐఎం104, పేట్రియాట్ క్షిపణులు ఉపయోగిస్తోంది. దీని విలువ ఒక్కొక్కటి సుమారు 4 మిలియన్ డాలర్లు ఖర్చు అవుతోంది.

ఇరాన్ మాత్రం తక్కువ ఖర్చుతో కూడిన భారీ సంఖ్యలో డ్రోన్లు ప్రయోగించి అమెరికా నుంచి ఖరీదైన క్షిపణి నిల్వలను ఖాళీ చేయిస్తోంది. ఇప్పటికే అమెరికా క్షిపణులు 90 శాతం కంటే ఎక్కువ ముప్పులను విజయవంతంగా అడ్డుకుంది. అందుకోసం అమెరికా చాలా ఎక్కువ ఖర్చు చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక ఇరాన్‌కు చెందిన షాహెద్136 డ్రోన్లు దూర ప్రయాణ సామర్థ్యంతో లక్ష్యాన్ని ఢీకొని పేలే విధంగా రూపొందించబడ్డాయి. ఈ డ్రోన్లు అమెరికా సైనిక స్థావరాలు, చమురు మౌలిక సదుపాయాలు, భవనాలను లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. తక్కువ ఖర్చు ఆయుధాలతో అధిక ఖర్చు రక్షణ వ్యవస్థలను సవాలు చేయడం అనే ఈ విధానాన్ని అసమాన యుద్ధ వ్యూహంగా రక్షణ నిపుణులు పేర్కొం టున్నారు. టెహ్రాన్‌పై తొలిసారి చేసిన దాడి కోసం అమెరికా అక్షరాల 779 మిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు సమాచారం. భారత కరెన్సీలో అక్షరాల రూ.6,900 కోట్లు ఖర్చు చేసినట్లు అంచనా. యుద్ధం ఇలానే కొనసాగితే ట్రంప్ మరిన్ని కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఖతార్ దగ్గర ఉన్న పేట్రియట్ ఇంటర్‌సెప్టర్ క్షిపణుల నిల్వలు నాలుగు రోజులు మాత్రమే సరిపోతాయని తెలిపింది. గత ఏడాది ఇజ్రాయెల్‌తో జరిగిన ఘర్షణల తర్వాత ఇరాన్ దగ్గర సుమారు 2,000 బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు అంచనా. షాహీద్ డ్రోన్ల సంఖ్య మాత్రం మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు భద్రతా కేబినెట్ సభ్యుడు ఎలి కోహెన్ ప్రకారం ఇరాన్ వందలాది క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించకుండా అమెరికాఇజ్రాయెల్ దాడులు అడ్డుకున్నాయని ఇప్పటివరకు 150 క్షిపణి లాంచర్లను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ వెల్ల డించింది. ప్రస్తుత దాడుల తీవ్రత ఇదే విధంగా కొనసాగితే ప్రాంతీయంగా పేట్రియట్ క్షిపణుల నిల్వలు కొద్ది రోజుల్లో ప్రమాదకర స్థాయికి చేరవచ్చని రక్షణ వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

## ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరణించిన ఖమేనీ

**టెహ్రాన్, మార్చి 4:** ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ మరణంపై కొనసాగుతున్న సందిగ్ధతకు తెరపడింది. అమెరికాఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో ఆయన వెంటనే మరణించలేదని, తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరుసటి రోజు కన్నుమూశారని ఆయన సన్నిహిత అనుచరుడు అబ్దుల్ మజిద్ హాకీమ్ ఎలాహి వెల్లడించారు. ఈ ప్రకటనతో ఖమేనీ మరణంపై నెలకొన్న అనుమానాలు తొలగిపోయాయి. దాడి సమయంలో ఖమేనీ కార్యాలయం పూర్తిగా ధ్వంసమైందని, ఆయన కుమార్తె, అల్లుడు అక్కడికక్కడే మరణించారని మజిద్ తెలిపారు. దాడి తర్వాత ఖమేనీని వెంటనే ఆసుపత్రికి తరలించాం. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ఆయన మరుసటి రోజు తుదిశ్వాస విడిచారని మజిద్ వివరించారు.

**అంత్యక్రియలకు సర్వంసిద్ధం:** ఖమేనీ అంత్యక్రియలకు ఇరాన్ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. దేశవ్యాప్తంగా సంతాప దినాలు ప్రకటించగా, ఆయనకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఖమేనీ అంత్యక్రియలకు సంబంధించిన సమయం, ప్లేస్, తేదీలను ప్రకటించారు. ఖమేనీని ఇరాన్‌లోని పవిత్ర నగరమైన మషద్‌లో ఖననం చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఆయన జన్మస్థలం కూడా మషద్‌నే. ప్రపంచ ప్రసిద్ధిగాంచినప్రాంగణంలోనే ఖననం చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ స్థలం షియా ముస్లింలకు అత్యంత పవిత్ర యాత్రా కేంద్రంగా గుర్తింపు పొందింది. ఖమేనీకి ముందుగా రాజధాని టెహ్రాన్‌లో ప్రజలు నివాళులర్పించేలా భారీ వీడ్కోలు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి గౌరవాలతో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఇరాన్ కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 10:00 గంటలకు ప్రధాన అంత్యక్రియలు ప్రారంభమవుతాయని స్థానిక మీడియా నివేదించింది. మూడు రోజుల పాటు ప్రజలు వచ్చి నివాళులు అర్పించేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం మషద్‌కు భౌతిక కాయాన్ని తరలించి ఖననం చేయనున్నారు. 1979 ఇస్లామిక్ విప్లవం అనంతరం ఇరాన్ రెండవ సుప్రీం నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన ఖమేనీ దాదాపు మూడు దశాబ్దాలకుపైగా దేశాన్ని నడిపించారు. రక్షణ, విదేశాంగ, ఆర్థిక విధానాల్లో కీలక పాత్ర పోషించారు. మధ్యప్రాచ్య రాజకీయాల్లో కూడా ఆయన ప్రభావం గణనీయంగా నిలిచింది.

## పాక్,అఫ్ఘాన్‌ల మధ్య వార్ ఉధృతం



### నిలిచిపోయిన ఆహార సరఫరా

**కాబూల్, మార్చి 4:** పాకిస్థాన్ ఆఫ్ఘనిస్థాన్ మధ్య గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు మరింత తీవ్ర రూపం దాల్చి, పెను విషాదాన్ని నింపుతున్నాయి. ఇరు దేశాల మధ్య జరుగుతున్న ఈ భీకర పోరు కారణంగా సరిహద్దు ప్రాంతాల్లోని వేలాది కుటుంబాలు చెల్లాచెదురై రోడ్డున పడ్డాయి. గత గురువారం నుంచి ప్రారంభమైన ఈ ఘర్షణలు ఇరు దేశాల సైనిక చర్యలతో మరింత దారుణంగా మారాయి. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, ఆఫ్ఘనిస్థాన్‌లోని పలు ప్రాంతాల నుండి సుమారు 20 వేల కుటుంబాలు ప్రాణభయంతో తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వచ్చింది. ఈ హింసాత్మక ఘటనల్లో ఇప్పటివరకు కనీసం 42 మంది పౌరులు మరణించగా, వందకు పైగా ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల్లో చిన్నారులు కూడా ఉండటం తీవ్రంగా కలచివేస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో మానవతా సంక్షోభం ఏర్పడింది. ఇప్పటికే ఈ ప్రాంతాల్లోని ప్రజలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో, ఈ ప్రాంతాల్లో అత్యవసర ఆహార సరఫరా నిలిచిపోవడంతో సుమారు 1.6 లక్షల మంది ఆకలితో అలమటించే ప్రమాదం ఉందని ప్రపంచ ఆహార కార్యక్రమం హెచ్చరించింది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులకు ప్రతిగా తాము దాడులు ప్రారంభించినట్లు ఆఫ్ఘన్ ప్రకటించగా, ఇస్లామాబాద్ సైతం వెనక్కి తగ్గకుండా కాబూల్, కాందహార్, వ్యూహాత్మక బాగ్రామ్ ఎయిర్ బేస్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడింది. ముఖ్యంగా కునార్ ప్రాంతంలో క్షిపణి దాడులు, భారీ ఆయుధాల మోతతో ప్రజలు భీతావహ స్థితిలో కాలం గడుపుతున్నారు. సైనిక పరంగా కూడా ఇరు దేశాలకు భారీ నష్టం వాటిల్లింది. అఫ్ఘన్ తన వైపు 25 మంది సైనికులు మరణించారని చెబుతూనే, సుమారు 150 మంది పాక్ సైనికులను మట్టుబెట్టినట్లు ప్రకటించింది.



## బిజెపి రాజ్యసభ అభ్యర్థిగా రాందాస్ అథవాలే పోటీ

### నలుగురి పేర్లతో రెండో జాబితా విడుదల

**న్యూఢిల్లీ, మార్చి 4:** రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి భారతీయ జనతా పార్టీ మరో నలుగురు పేర్లతో రెండో జాబితా విడుదల చేసింది. మహారాష్ట్ర నుంచి కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే, మాజీ కేంద్రమంత్రి వినోద్ తవ్డే, నాగ్‌పూర్ మాజీ మేయర్ మాయా చింతమాన్ ఇవ్నేట్, మాజీ ఎమ్మెల్సీ రాంరావు వాడ్‌కుటేని బరిలోకి దించింది. మహారాష్ట్ర నుంచి పెద్దల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడుగురి పదవీ కాలం ఏప్రిల్‌తో ముగియనుంది. ఇందులో ఆర్‌పిఐ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న రాందాస్ అథవాలే, ఈసారి బిజెపి తరఫున రాజ్యసభకు పోటీ చేస్తున్నారు. బుధవారం ఉదయం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ను రాందాస్ అథవాలే సమావేశమే, తాజా రాజకీయ పరిణామాలపై చర్చలు జరిపారు.

## ఇరాన్ కొత్త సుప్రీంనేతగా మొజ్తాబా హుసేన్ ఖమేనీ



**టెహ్రాన్, మార్చి 4:** ఇరాన్ కొత్త సుప్రీం నేతగా అయతుల్లా ఖమేనీ కుమారుడు మొజ్తాబా హుసేన్ ఖమేనీ ఎన్నికయ్యారు. ఇజ్రాయిలీ మీడియా బయటపెట్టింది. ఇరాన్‌కు చెందిన నిపుణుల అసెంబ్లీ మోజ్తాబాను ఎన్నుకున్నది. అయతుల్లా అలీ ఖమేనీ వారుసుడిగా మోజ్తాబా కొనసాగనున్నారు. 36 ఏళ్ల పాటు ఇరాన్ సుప్రీం నేతగా కొనసాగిన ఖమేనీ గత శనివారం అమెరికాఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ దాడిలో ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనువరాలు మృతిచెందారు. గాయపడ్డ ఖమేనీ భార్య మన్సౌరీ ఖోజసేత్ భగేర్జదే రెండు రోజుల తర్వాత ప్రాణాలు విడిచింది. మొజ్తాబా వయసు 56 ఏళ్లు. తన తండ్రి ఖమేనీ అడుగుజాడల్లో రాజకీయ, మతపరమైన వ్యవస్థలను ఆయన నడిచారు. 1969లో మషాద్‌లో మోజ్తాబా జన్మించారు. అలీ ఖమేనీ రెండో కుమా రుడు ఆయన. ఆయనకు అయిదుగురు సోదరులు ఉన్నారు. టెహ్రాన్‌లో ఉన్న అలావి ఉన్నత పాఠ శాలలో ఆయన చదు వుకున్నారు. ఆ తర్వా త ఖోమ్‌లో మోజ్తాబా మతపరమైన విద్య నేర్చుకు న్నారు. మతపర మైన శిక్షణలో ఆయన చాన్నాళ్లుగా కొనసాగుతున్నా అయతుల్లా ర్యాంక్‌కు మాత్రం ఇంకా చేరుకోలేదు. ఇరాన్‌ఇరాక్ మధ్య యుద్ధసమయంలో హాబిబ్ బెటాలియన్‌లో మోజ్తాబా విధులు నిర్వర్తించారు. ఇరాన్ సెక్యూర్టీ, ఇంటెలిజెన్స్‌లో ఉన్న ప్రముఖులతో ఆయనకు సంబంధాలు ఉన్నాయి. అంతేకాకుండా మొజ్తాబాను ఎంపికచేయాలని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ముగ్గురు సభ్యుల మండలిపై ఒత్తిడితెచ్చినట్లు అంచనా.

## టివికెను అడ్డుకునేందుకు డిఎంకె, అన్నాడిఎంకె కుట్రలు: విజయ్



**తంజావూరు, మార్చి 4:** తమిళనాడులో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు కొందరికి మాత్రమే ఎలక్షన్స్, మాకు ఆత్మగౌరవం లాంటివి అని, అందుకే ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్నా అని తమిళగ వెట్రీ కజగం (టివికె) వ్యవస్థాపకుడు, నటుడు విజయ్ పిలుపునిచ్చారు. బుధవారం తంజావూరు సమీపంలోని సెంగిపట్టులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో విజయ్ మాట్లాడుతూ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టివికె అధికారంలోకి వస్తే రెండు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు, భూమిలేని కార్మికుల పిల్లల విద్యా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే ఐదు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు సహకార పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారు. డిఎంకె – ఎఐఎడిఎంకెలు ప్రత్యామ్నాయంగా అధికారాన్ని చేజిక్కించుకోవడానికి రహస్య ఒప్పందం కుదుర్చుకున్నాయని, తమను అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు కుట్ర పన్నాయని ఆరోపణలు గుప్పించారు. 'రాజకీయాలు అంటే సేకరణ కాదు; ప్రజల కోసం పనిచేయడం అవసరం. ప్రజలకు సేవ చేయడానికి తాము రాజకీయాల్లోకి వచ్చాము. మన శత్రువులకు ఇది బాగా తెలుసు. అందుకే మన చుట్టూ చాలా కుట్రలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది డిఎంకె– ఎఐఎడిఎంకె మధ్య ఒప్పందం. అయితే బాహ్యంగా, వారు ఒకరితో ఒకరు విభేదిస్తున్నట్లు డ్రామాలాడుతున్నారు. తాను రాజకీయాల్లోకి రావడం వల్ల వారి ప్రణాళిక పనిచేయదని వారు గ్రహించారు. కాబట్టి, వారిలో ఒకరు తర్వాత మరొకరు తనపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారు' అని విజయ్ ఆరోపించారు.

## డిఎంకె, కాంగ్రెస్ సీట్ల పంపకాలు కొలిక్కి

### కాంగ్రెస్‌కు 28 అసెంబ్లీ, ఒక రాజ్యసభ సీటు: అధిష్ఠానం ఓకే



**చెన్నై, మార్చి 4:** తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి డిఎంకె– కాంగ్రెస్ పార్టీల మధ్య సీట్ల పంపకాల ఒప్పందం కుదిరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గత కొంతకాలంగా డిఎంకె అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సీనియర్ కాంగ్రెస్ నేత పి.చిదంబరం చర్చలు జరుపుతున్న విషయం తెలిసిందే. మంగళవారం కూడా చెన్నై శివారులోని ఓ రిసార్టులో కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకాలపై సుదీర్ఘ మంతనాలు సాగాయి. ఎట్టకేలకు కాంగ్రెస్‌కు 28 అసెం బ్లీ సీట్లు కేటాయించడంతోపాటు ఒక రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డిఎంకె అంగీకారం తెలిపినట్లు సమాచారం. ఇదే విషయాన్ని కాంగ్రెస్ అధిష్టా నానికి తెలియజేయగా, డిఎంకెతో సీట్ల పంపకాల ఒప్పందాన్ని ఖరారు చేయడం అంశంపై కాంగ్రెస్ హైకమాండ్ పార్టీ సీనియర్ నాయకుడు పి. చిదం బరానికి అధికారం ఇచ్చింది. వర్గాల ప్రకారం, పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ, ఈ ఒప్పందంతో ముందుకు సాగడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు తన ఆమోదాన్ని తెలియజేసారు. దీంతో అధికార ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె)తో ఒప్పందంపై సంతకం చేయాలని చిదంబరానికి ఖర్గే సూచించారు. దీంతో రెండు మిత్రపక్షాల మధ్య సీట్ల పంపకం కుదిరింది.



## ప్రజల సందర్శనార్థం ఖమేనీ భౌతికకాయం

**టెహ్రాన్, మార్చి 4:** ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో హత్యకు గురైన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతదేహాన్ని ఇవాళ బుధవారం రాత్రి నుంచి ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ప్రజా సందర్శనకు ఉంచనున్నారు. అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభానికి సంకేతంగా ఖమేనీ భౌతికకాయాన్ని బయటికి తీస్తున్నారు. ప్రజల సందర్శనార్థం ఖమేనీ భౌతికకాయాన్ని మూడు రోజులపాటు ప్రదర్శనకు పెట్టనున్నట్లు ఇరాన్ అధికార టీవీ తెలిపింది. ఖమేనీ తరచుగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగాలు చేయడమేగాక, ప్రార్థనలు నిర్వహించిన సెంట్రల్ టెహ్రాన్‌లోని ఒక పెద్ద ప్రాంగణంలో ఆయన భౌతికకాయాన్ని ఉంచనున్నట్లు వెల్లడించింది. మూడు రోజుల ప్రజా సందర్శన అనంతరం ఇరాన్ ఖమేనీ అంత్యక్రియలు నిర్వహించనుంది. మరోపక్క ఇజ్రాయెల్‌పైన, పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ఇరాన్ ప్రతీకార దాడులను తీవ్రతరం చేసింది.

## ఇరాన్ రహస్య అణుస్థావరం ధ్వంసం చేశాం: ఇజ్రాయెల్

**జెరూసలెం, మార్చి 4:** ఇరాన్‌లోని రహస్య భూగర్భ అణుప్రాజెక్టును ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ప్రకటించింది. రాజధాని టెహ్రాన్ సరిహద్దుల్లోని మింజాదేహైలో రహస్యంగా ఏర్పాటు చేసిన ఈ అణు ప్రాజెక్టుపై దాడి చేసినట్లు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డెఫ్రిన్ వెల్లడించారు. ఇక్కడ శాస్త్రవేత్తలు రహస్యంగా పనిచేస్తున్నట్లు సమా చారం అందిందని, దీనితో దాడి జరిపినట్లు ఐడీఎఫ్ తెలిపారు. 2025లో అమెరికా దాడుల తర్వాత ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ఇక్కడకు మళ్లించిందని వెల్లడించారు. గత ఏడాది జూన్ నెలలో ఇరాన్‌పై ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో 12రోజుల పాటు దాడులు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

## ఇరాన్ తదుపరి నేతనూ మట్టుబెట్టేస్తాం: ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్

**జెరూసలెం, మార్చి 4:** ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ఎంపికయ్యే వ్యక్తిని కూడా నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుంటామని ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ సంచలన ప్రకటన చేశారు. ఇజ్రా యెల్, అమెరికా సంయుక్తంగా జరిపిన దాడిలో సుప్రీంలీడర్ అలీ ఖమేనీ మృతి చెందిన విషయం తెలిసిందే.ఖమేనీ మృతి చెంది నాలుగు రోజులైనా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ఆపడంలేదు. ఈతరుణంలో ఇజ్రా యెల్ మంత్రి నుంచి ఈకీలక ప్రకటనవచ్చింది. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనుకునే వారిని,అమెరికాను బెదిరించే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు.

# మంటల్లో పశ్చిమాసియా

## హార్ముజ్‌లో చమురు నౌకలకు అమెరికా నేవీ రక్షణ: ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 4:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధిని మూసివేస్తున్నామని ఇరాన్ ప్రకటించింది. దీంతో ఇంధన రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హార్మూజ్ మీదుగా వెళ్లే చమురు ట్యాంకర్లకు అవసరమైతే అమెరికా నేవీ రక్షణ కల్పిస్తుందని వెల్లడించారు. వీలైనంత త్వరంగా దీనిపై నిర్ణయం తీసుకుంటామని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచానికి ఇంధన సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా అమెరికా తప్పకుండా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు తన ట్రూత్ ఖాతా పోస్టులో రాసుకొచ్చారు. ఇక, గల్ఫ్ మీదుగా సముద్ర మార్గాల్లో జరిపే వాణిజ్యానికి ఆర్థిక భద్రత, అందుబాటు ధరల్లో బీమా, ఇతర గ్యారెంటీలన్నీ తక్షణమే అందించాలని యుఎస్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఆదేశించినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ ప్రకటన తర్వాత చమురు మార్కెట్లు స్వల్పంగా కోలుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 73 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇటీవల ఇది 80 డాలర్లకుపైనే ట్రేడ్ అయిన సంగతి తెలిసిందే. హార్మూజ్ జలసంధిని మూసివేస్తున్నామని, ఆ దిశగా నౌకలు వస్తే నిప్పు పెడతామని ఇరాన్ మంగళవారం హెచ్చరించింది. దీంతో ఈ మార్గంలో చమురు రవాణా స్తంభించింది. హార్మూజ్‌కు అటూఇటూ వందల సంఖ్యలో నౌకలు నిలిచిపోయినట్లు మారిటైమ్ అనలిటిక్స్ సంస్థల గణాంకాల వెల్లడించాయి. ఈ క్రమంలోనే ట్రంప్ నుంచి ప్రకటన వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఇరాన్‌లో ప్రజా తిరుగుబాటుకు అమెరికా ప్రణాళిక



**వాషింగ్టన్, మార్చి 4:** ఇరాన్‌లో ప్రజా తిరుగుబాటును ప్రోత్సహించేందుకు అమెరికా యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకోసం ఇరాన్–ఇరాక్ సరిహద్దుల్లో చురుగ్గా ఉన్న కుర్దులకు ఆయుధాలు ఇవ్వాలని అమెరికా నిఘా సంస్థ సిఐఎ ప్లాన్ చేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ఇరాన్ విపక్ష గ్రూపులు, కుర్దిష్ లీడర్లతో ట్రంప్ అధికారులు చర్చలు జరుపుతున్నారని వెల్లడించాయి. డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇరానియన్ కుర్దిస్థాన్ (కెడిపిఐ) అధ్యక్షుడితో ట్రంప్ మాట్లాడారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పశ్చిమ ఇరాన్‌లో రానున్న రోజుల్లో జరిగే గ్రౌండ్ ఆపరేషన్‌లో ఇరానియన్ కుర్దిష్ బలగాలు పాల్గొనాలని చూస్తున్నాయి. దాన్ని ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నాయి. అలాగే ఇజ్రాయెల్, అమెరికా మద్దతు ఉంటుందని ఆశిస్తున్నాయి. ఇరాన్, ఇరాక్, సిరియా, తుర్కియేలో విస్తరించిన కుర్దుజాతి.. తమకు స్వతంత్ర దేశం కావాలని దశాబ్దాలుగా పోరాడుతుంది. ఇరాన్–ఇరాక్ సరిహద్దులో ఇరానియన్ కుర్దిష్ సాయుధ గ్రూప్‌లకు వేల సంఖ్యలో బలగాలు ఉన్నాయి. ఇవి పశ్చిమాసియాలో యుద్ధం మొదలైన వెంటనే ఇరాన్ సైనిక దళాలు వెనక్కి తగ్గాలంటూ ప్రకటనలు చేశాయి. మరోవైపు.. ఈ గ్రూప్‌లపై ఇరాన్ సైన్యం దాడులు చేయడంతో పాటు కెడిపిఐను కూడా టార్గెట్ చేసింది.

**ఇరాన్ దాడులకు స్పందిస్తాం..**

ఇరాన్ దాడులపై స్పందించేందుకు సౌదీ అరేబియా సిద్ధమవుతోంది. తమ ప్రజల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆ దేశం వెల్లడించింది.ఈ మేరకు సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీలో మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. 'ఇరాన్ దాడులతో ఇబ్బంది పడుతున్న దేశాలకు సంఘీభావం తెలియజేస్తున్నాం.ప్రాంతీయ భద్రత, స్థిరత్వాన్ని దెబ్బతీసే దాడులకు ప్రతిస్పందనగా ఆ దేశాలు తీసుకునే చర్యలకు మా సహకారం అందిం చేందుకు సిద్ధంగా ఉన్నాం' అని సౌదీ ప్రకటించింది.

## ఆ దేశాలపై అమెరికా యుద్ధం: రూ.లక్షల కోట్ల ఖర్చు



**వాషింగ్టన్, మార్చి 4:** విదేశీ యుద్ధాల్లో జోక్యాన్ని తగ్గించుకుంటామని అమెరికా పలు సందర్భాల్లో పేర్కొన్నప్పటికీ తాజాగా ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై భీకర దాడులు కొనసాగిస్తోంది. మాజీ అధ్యక్షుల మాదిరిగానే డొనాల్డ్ ట్రంప్ కూడా పశ్చిమాసియాలో తన వ్యూహాలను అమలు చేస్తున్నారు. 2001 సెప్టెంబరు 11 నాటి దాడుల తర్వాత మూడు దేశాలపై పూర్తిస్థాయి యుద్ధం చేసిన అమెరికా, రెండున్నర దశాబ్దాల్లో మొత్తంగా పది దేశాలపై సైనిక చర్య చేపట్టింది. ఇందుకోసం భారీగా ఖర్చు చేసింది. 2001 సెప్టెంబరు తర్వాత 'ఉగ్రవాదంపై పోరు'కు సిద్ధమని ప్రకటించిన నాటి అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యు బుష్ అఫ్ఘానిస్థాన్‌పై యుద్ధం మొదలుపెట్టారు. 'ఆపరేషన్ ఎండ్యూరింగ్ ఫ్రీడమ్'తో మొదలైన ఆ సైనిక చర్య దాదాపు 20 యేళ్లు కొనసాగింది. అమెరికా చరిత్రలోనే సుదీర్ఘ యుద్ధంగా నిలిచింది. ఇరాక్‌పైనా దాడి చేసింది. 2001–2023 మధ్యకాలంలో బుష్, ఒబామా, ట్రంప్, బైడెన్‌ల హయాంలో సిరియా, యెమెన్, సోమాలియా, లిబియా, నైజీరియాలపై వైమానిక దాడులు జరిపింది. ఇటీవల వెనిజులాపై సైనిక చర్య చేపట్టిన అగ్రరాజ్యం, తాజాగా ఇరాన్‌పైనా మరోసారి భీకర దాడులు చేస్తోంది. బ్రౌన్ యూనివర్సిటీ వాట్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ ప్రకారం రెండున్న దశాబ్దాల్లో అమెరికా యుద్ధాల కారణంగా దాదాపు తొమ్మిది లక్షల మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వీరిలో దాదాపు సగం మంది సామాన్యులేనని చెప్పింది. ఆహారం, వైద్యం, యుద్ధ సంబంధిత వ్యాధులతో అనేకమంది మరణించినట్లు తెలిపింది.ఇలా రెండు దశాబ్దాలకుపైగా సైనిక చర్యల కోసం అమెరికా దాదాపు 5.8 ట్రిలియన్ డాలర్లు ఖర్చు పెట్టినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటితోపాటు రానున్న రోజుల్లో మాజీ సైనికుల ఆరోగ్య సంరక్షణ కోసం మరో 2.2 ట్రిలియన్ డాలర్లు అవసరం అవుతాయని తెలుస్తోంది. మొత్తంగా 2001 నుంచి యుద్ధాలపై అమెరికా పెట్టే ఖర్చు సుమారు 8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా.

## యుద్ధానికి ఫ్రాన్స్ సన్నద్ధం



**పారిస్, మార్చి 4:** పశ్చిమాసియా సమరంలోకి ఫ్రాన్స్ కూడా అడుగుపెట్టేందుకు సిద్ధం అవుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులను తిప్పికొట్టేందుకు విచక్షణరహితంగా ఇరాన్ తన ఆయుధాలను వాడుతున్నది. ఈ నేపథ్యంలో యురోపియన్ దేశమైన ఫ్రాన్స్ తన ఆస్తులను కాపాడుకునేందుకు ముందుకు కదులుతోంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్ కీలక ఆదేశాలు చేశారు. అణ్వాయుధ సామర్థం కలిగిన యుద్ధ నౌకను మధ్యధరా ప్రాంతానికి తరలించాలని ఆదేశించారు. బాల్టిక్ సముద్రం నుంచి మెడిటెరేనియన్ దిశగా యుద్ధనౌక చార్లెస్ డీ గల్లే దూసుకెళ్తున్నది. ఆ యుద్ధ నౌకకు ఎస్కార్ట్‌గా వాయుసేన, ఫ్రిగేట్స్ ఉంటాయి. రఫేల్ యుద్ధ విమానాలు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, ఎయిర్‌బార్న్ రేడర్ వ్యవస్థలను ఇప్పటికే పశ్చిమాసియాలో ఫ్రాన్స్ మోహరించినట్లు తెలుస్తోంది. బ్రిట్టనీ పట్టణంలోని బాలిస్టిక్ మిస్సైల్ సబ్‌మెరైన్ బేస్ నుంచి మాక్రన్ ప్రసంగించారు. దేశానికి చెందిన కీలక ఆస్తులను కాపాడుకునేందుకు తాము వెనుకడుగు వేయబోమన్నారు. యురోప్ మిత్ర దేశాలతో కలిసి ముందుకు సాగనున్నట్లు చెప్పారు. దేశ కీలక ప్రయోజనాలకు ఆటంకం ఎదురైతే సహించేదిలేదన్నారు. అమ్ములపొదిలో న్యూక్లియర్ వార్‌హెడ్స్ సంఖ్యను పెంచుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు.తమ వద్ద ఎంత సంఖ్యలో న్యూక్లియర్ వార్‌హెడ్స్ ఉన్నాయో చెప్పబోమన్నారు. ఫ్రాన్స్ వద్ద సుమారు 290 న్యూక్లియర్ వార్‌హెడ్స్ ఉన్నట్లు భావిస్తున్నారు. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్స్‌టిట్యూట్ ప్రకారం ఈ అంచనా వేశారు. బ్రిటన్, జర్మనీ, పోలాండ్, నెదర్లాండ్స్, బెల్జియం, గ్రీస్, స్వీడన్, డెన్మార్క్ దేశాలు కూడా అణు నిరాయుధీకరణ ఆకాంక్షిస్తున్నట్లు మాక్రన్ తెలిపారు. యురోపియన్ యూనియన్ దేశాల్లో ఒక్క ఫ్రాన్స్ దగ్గరే అణ్వాయుధాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా న్యూక్లియర్ వెపన్స్ 9 దేశాల వద్ద ఉన్నాయి. రష్యా, అమెరికా, ఫ్రాన్స్, యూకే, చైనా, ఇండియా, పాకిస్థాన్, ఇజ్రాయెల్, నార్త్ కొరియా ఆ జాబితాలో ఉన్నాయి. అణ్వాయుధ ఒప్పందం ప్రకారం మాత్రం మొదటి 5 దేశాలనే న్యూక్లియర్ వెపన్ స్టేట్స్‌గా గుర్తిస్తున్నారు.

## యుద్ధంలోకి లాగొద్దు: స్పెయిన్ ప్రధాని



**మ్యాడ్రిడ్, మార్చి 4:** మధ్యప్రాచ్యయుద్ధంలోకి తమను లాగవద్దని, తాను అలాంటి చర్యను కోరుకో లేదని స్పెయిన్‌ప్రధాని పెడ్రోసాంచెజ్ అన్నారు. ఇరాన్‌పై యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నందుకు స్పెయిన్‌ను తమతో వాణిజ్య కార్యకలాపాల నుంచి తొలగిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన మరుసటి రోజే స్పెయిన్ ప్రధాని ఈ కామెంట్ చేశారు. బుధ వారం జాతిని ఉద్దేశించి ప్రసంగించిన స్పెయిన్ ప్రధాని ఇరాన్‌పై యుద్ధం మొద లు పెట్టిన వారి లక్ష్యాలు ఏమిటో స్పష్టత లేదు. స్పె యిన్ మరో మధ్యప్రాచ్య యుద్ధంలోకి లాగబ డాలని తాను ఎన్నడూ కోరుకోలేదు. పలు దేశాల తీర్మానం తర్వాతనే తాము అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలు యుద్ధం ఆపాలనే డిమాండ్‌ను వినిపిం చాం.మీ చట్టవిరుద్ధమైన చర్యలపై చట్టవిరుద్ధంగా స్పందించడం సబబుకాదు. అలాంటి చర్యల వల్లనే మానవాళి భారీ విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. స్పెయిన్‌ను వాణి జ్యం నుంచి తొలగిస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలకు ప్రతిగానే పెడ్రోసాంచెజ్ ఈవిధంగా స్పందించారని తెలుస్తోంది. కాగా ఇరాన్‌పై, ఇజ్రాయెల్, అమెరికా తీవ్రంగా దాడులు చేస్తోంది. ఈ క్రమంలో స్పెయిన్ సహా పలుదేశాలు మరింత ఆలస్యం చేయకుండా యుద్ధాన్ని ఆపాలని ఆ మూడు దేశాలను డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో స్పెయిన్‌కు ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు.



## కొత్తవలసలో 'కుంభంపాటి'

కొత్తవలస (విజయనగరం జిల్లా), మార్చి 4 ప్రభాతవార్త: మంగళపాలెంలోని శ్రీ గురుదేవ్ ఛారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అద్భుతమని ఒడిస్సా గవర్నర్ డాక్టర్ కుంభంపాటి హరిబాబు అన్నారు. కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామంలో శ్రీ గురుదేవ్ ట్రస్ట్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హరిబాబు శ్రీఉప్పలపాటి క్యాన్సర్ మెమోరియల్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ సేవలు వెలకట్టలేమని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ సేవలను అద్భుతం అన్నారు. ఈ సందర్భంగా వికలాంగులకు కృత్రిమ అవయువాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస పోలీసులతో పాటు తహశీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.



## మరింత విశ్వాసం కల్పించేలా వైద్య సేవలు

### - టిటిడి జెఇఒ డాక్టర్ శరత్

తిరుమల, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల ఆలయంతోబాటు పరిసరాల ఆలయాల్లో దర్శనార్థం విచ్చేసే భక్తులు అనుకోకుండా అనారోగ్యానికి గురైన సందర్భాల్లో వారికి మరింత విశ్వాసాన్ని కల్పించే విధంగా సమగ్ర వైద్య సేవలు అందించాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ సూచించారు. తిరుచానూరులోని టిటిడి ఉచిత వైద్యశాలను, అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెఇఒమాట్లాడుతూ టిటిడి ఆధ్వర్యంలో ఏడు ప్రథమ చికిత్సా కేంద్రాలు, ఐదు డిస్పెన్సరీల ద్వారా భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. తిరుచానూరులోని టిటిడి ఉచిత వైద్యశాలలో భక్తుల సౌకర్యార్థం ఐదు నుండి 10 పడకలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో చిన్నపాటి వైద్య సహాయం కూడా రోగులకు అపారమైన ధైర్యాన్ని నింపుతుందని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన మందులతో పాటు, మరింత మనోధైర్యాన్ని కలిగించే సేవలను అందించాలని కోరారు. భక్తులు అనుకోకుండా అనారోగ్యానికి గురైనపుడు వారికి తక్షణం వైద్య సేవలు అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని జెఇఒ డాక్టర్ శరత్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ డాక్టర్ కుసుమ కుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుహర్లత, వైద్యుడు డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల ఉద్యమానికి కాంగ్రెస్ మద్దతు

### - ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దకుట్ర - పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



విజయవాడ, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: అంగన్‌వాడీల ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. అంగన్‌వాడీ లను అర్ధరాత్రి వేళ అరెస్టు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హామీలు అమల్జేయాలని అడిగితే మహిళలని చూడకుండా మగ పోలీసులతో అరెస్ట్ చేయించడం అమానుషమని పేర్కొన్నారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాల సంగతేమిటని అడిగితే జైళ్లలో పెట్టడమా ఈ ప్రభుత్వ విధానం అని ప్రశ్నించారు. న్యాయబద్ధమైన అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ అమలుకు మార్గదర్శకాలు వెంటనే రూపొందించా లన్నారు. అలాగే 1,810 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా వెంటనే అప్ గ్రేడ్ చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. మరో ప్రకటనలో పేదలకు అనుకూలంగా ఉపాధిపరంగా ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేస్తుంది అని రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో పేదల కోసం ఉపాధి కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసే కుట్ర కొనసాగిస్తుందని విమర్శించారు. అందులో భాగంగా ముందుగా మహాత్ముని పేరు తొలగించి విబి జి రాంజీ ఉపాధి హామీ పథకం అని నామకరణం చేశారన్నారు. తదుపరి ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టే విధంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పొడిగించామన్నారు. గతంలో వందరోజులకే పని కల్పించిన ఈ పథకాన్ని పేరుకు 125 రోజులు పని దినాలు కల్పించాము అని చెబుతున్నప్పటికీ అందులో చిత్తశుద్ధి లేదన్నారు. గతంలో గ్రామంలో పేద ప్రజలే తమకు పనిలేదని ఉపాధి కోసం గ్రామంలో పెద్దలను అధికారులను సంప్రదిస్తే వారికి ఉపాధి చూపించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించేవారన్నారు. అయితే ప్రస్తుత నూతన విధానంతో అందుకు అవకాశం లేదన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఎంతో మంచి గొప్ప పథకాన్ని తొలగించే ప్రయత్నం బిజెపి చేస్తుందని అన్నారు. పథకాన్ని గుండు సున్నా చుట్టేలా చేస్తుందన్నారు. ఇది బిజెపికి డబ్బులు వచ్చే పథకం కాదని అందువలన తొలగించారని అన్నారు.

## యువత అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి

### ● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ ● 522 మందికి ఉద్యోగ నియామక పత్రాలు






తిరుపతి, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: సమాజంలో యువత అవకాశాలను అందిపుచ్చుకుని, జీవితంలో ముందుకు సాగాలని ఎస్పీడిసిఎల్ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అనెక్స్ బిల్డింగ్‌లో ఎపిఎస్ఎస్ఎస్ డిసి సౌజన్యంతో నిర్వహించిన మెగా జాబ్ మేళా బుధవారం ఉదయం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ సంస్థలో పొరుగు సేవల కింద ఉద్యోగాల కోసం అభ్యర్థులు ప్రజా ప్రతినిధులు, అధికారుల ద్వారా ఒత్తిడి తీసుకు వస్తున్నారని తెలిపారు. ఈ ఒత్తిడిని అధిగమించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్ డిసి) సహకారంతో జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి 1,577 మంది అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఆయా కంపెనీల అవసరాల మేరకు అభ్యర్థులను ఉద్యోగాల్లోకి ఎంపిక చేసుకుంటాయని తెలిపారు. అభ్యర్థులు నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా కంపెనీల అవసరాల మేరకు ఆత్మవిశ్వాసంతో పనిచేస్తూ ముందడుగు వేయాలని, కంపెనీ తమను వదులుకోలేని విధంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తద్వారా యువత తమకాళ్ళపై తాము నిలబడడమే కాకుండా కుటుంబానికి ఆసరాగా వుండే అవకాశం లభిస్తుందన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చిన స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ మాట్లాడుతూ నేడు ప్రైవేటు సంస్థల్లో కూడా మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. తిరుపతి జిల్లా పరిధిలో 55 దేశాలకు చెందిన సుమారు 500కు పైగా కంపెనీలు నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పోల్చి చూసినట్లయితే ప్రైవేటు సంస్థల్లోనే ఉద్యోగుల వృద్ధి బాగుంటుందని తెలిపారు. యువతకు ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన ఎస్పీడిసిఎల్ కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

**522 మందికి నియామక పత్రాల అందజేత**

బుధవారం జరిగిన జాబ్ మేళాలో వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి బుధవారం సాయంత్రం ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సిఎండి వారిని అభినందించారు. 41 ప్రైవేటు సంస్థల హెచ్ఆర్ ప్రతినిధులు ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, 522 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు, మరో 274 మంది వివిధ కంపెనీల్లో షార్ట్ లిస్ట్ అయ్యారు. షార్ట్ లిస్ట్ అయిన వారికి ఆయా కంపెనీలు మరోమారు ఫైనల్ లెవెల్ ఇంటర్వ్యూలను నిర్వహించి, ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె. గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు సిహెచ్ రామచంద్ర రావు, కె.ఆదిశేషయ్య, జె. రమణాదేవి, ఆర్. పద్మ, యం. మురళీ కుమార్, యం.ఉమాపతి, యం.కృష్ణారెడ్డి, కె. సంపత్ కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు, జనరల్ మేనేజర్లు సి. ప్రసాద్, వై. వెంకటరాజు, ఎస్. శ్రీనివాసులు, జి. చక్రపాణి, పి. రవికుమార్, పిఆర్ఒ తోట మధుసూదన, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాధం, నియామక అధికారి ఎ. గణేష్ పాల్గొన్నారు.





## మృత్యు ఘోష

### ● వేట్లపాలెం పేలుడు ఘటనలో మరో ముగ్గురు మృతి
### ● 26కు చేరిన మృతుల సంఖ్య
### ● చికిత్స పొందుతున్న ఐదుగురి పరిస్థితి విషమం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మార్చి 4 ప్రభాతవార్త: వేట్లపాలెం బాణసంచా విస్ఫొటనం సంఘటనలో మృత్యు ఘోష చల్లారడం లేదు. వేట్లపాలెం సూర్యశ్రీ ఫైర్‌వర్క్సులో జరిగిన ఘోర విస్ఫోటన సంఘటనలో ఇప్పటివరకు 26 మంది మృత్యువాత పడ్డారు బుధవారం రోజున సామర్లకోట కుమ్మరి వీధికి చెందిన పల్లపాటి శ్రీనివాసరావు 45 చికిత్స పొందుతూ మృతి చెందాడు అలాగే కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు తాకేటి శ్రీను 35 మృతి చెందాడు. కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో మహిళ చిటికెల లక్ష్మి మ్మ 45 చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రోజు రోజుకు మృతుల సంఖ్య పెరగడం కలవర పాటుకి గురిచేస్తున్నది. ఒకేరోజు చికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందడంతో ఆ విషాద వార్త విని కుటుంబ సభ్యులు గుండెలు బాధుకొంటూ చేస్తున్నా రోధనలు స్థానికుల హృదయాలను ద్రవించి వేసింది.

శనివారం వేట్లపాలెంలో జరిగిన బాణాసంచా విస్ఫోటనంలో 20మంది సజీవ దహనం అయిన షాక్ నుంచి ఇప్పడు ఇప్పుడే స్థానికులు, కుటుంబ సభ్యులు కోలుకుంటున్న సమయంలో చికిత్స పొందుతున్నవారు ఒక్కొక్కరుగా మృతి చెందడంతో కుటుంబాలలో విషాదం అలుముకుంటుంది. విస్ఫోటనంలో సామర్లకోట కుమ్మర వీధికి చెందిన ఇద్దరు, జి. మేడపాడు చెందిన ఇద్దరు, పీబీ దేవం గ్రామానికి చెందిన ఒకరు. వేట్లపాలెంకు చెందిన 15 మంది ఉన్న విషయం తెలిసింది. సంఘటన జరిగిన వెంటనే క్షతగ్రాతులైన 9 మందిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వేట్లపాలెంకు చెందిన పచ్చిగళ్ల నూక రత్నం, కాకినాడ ప్రెవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. మిగిలిన ఐదుగురి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. చికిత్స పొందుతున్న వారిలో పెద్దాపురంకు చెందిన మోర్త శ్రీను, వేట్లపాలెంకు చెందిన సప్పా సత్యవెంకటలక్ష్మీ మ్మ, చిటికెల లక్ష్మీ మ్మ సామర్లకోట కుమ్మరవీధి చెందిన కాతేటి శ్రీను, వేమగిరి దావీదులు ఉన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన నలుగురు కుమ్మర వీధికి చెందిన వారు కావడంతో ఆ ప్రాంతానికి చెందిన మృతుల సంఖ్య ఆరుకు చేరింది. కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనా దాలతో నిండి పొయింది. ఏ కుటుంబాన్ని కదిపినా కన్నీటి గాథలే వినిపిస్తున్నాయి.

**బాణసంచా తయారీ చేస్తే కఠిన చర్యలు:ఎస్‌పి**

నిబంధన విరుద్ధంగా బాణసంచా తయారీ కేంద్రాలు నిర్వహించిన ముందు గుండు సామాగ్రి తయారుచేసిన నిల్వచేసిన కఠిన చర్యలు తీసు ఉంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఇప్పటికే అధికారుల బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సామర్లకోట బాణ సంచా విస్ఫోటనం సంఘటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆర్డిఓ శ్రీ రమణి, డిఎస్పి శ్రీహరి రాజులతో పాటు పలువురు అధికారులను సస్పెండ్ చేశారు.

**నష్టపరిహారం అందజేత:** ఇప్పటివరకు సామర్లకోట బాణాసంచా విస్పటంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించింది ఇప్పటివరకు 26 మంది మృతి చెందగా ఒక్కొక్కరికి 20 లక్షల రూపాయలు వంతన చెక్కులు బాదిత కుటుంబాలకు అందించారు.

## నెల్లూరు రైల్వే స్టేషన్‌లో 12.5 కిలోల గంజాయి స్వాధీనం

### - పాత నేరస్తుడు అరెస్ట్



నెల్లూరు క్రైం, మార్చి 4, ప్రభాతవార్త: నెల్లూరు రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. నెల్లూరు రైల్వే డిఎస్పీ మురళీధర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గుంటూరు రైల్వే జిల్లా పరిధిలోని నెల్లూరు రైల్వే స్టేషన్‌లో భద్రతా తనిఖీల సందర్భంగా 12.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. రైల్వే డీజీపి ఆదేశాల మేరకు, నెల్లూరు రైల్వే డిఎస్పీ జి. మురళీధర్ పర్యవేక్షణలో, నెల్లూరు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సుధాకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పి. రమేష్ గౌడల నేతృత్వంలో ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టింది. మంగళవారం రాత్రి సమయంలో ప్లాట్‌ఫాం నంబర్ 2, 3ల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని బ్యాగులను పరిశీలించగా 13 ప్యాకెట్లలో మొత్తం 12.5 కిలోల గంజయి లభించింది. రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం హోసూర్‌కి చెందిన విశ్వనాథ్ (38) గతంలో కూడా ఇలాంటి నేరాల్లో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతనిపై పలు గంజాయి అక్రమ రవాణా కేసులతో పాటు హత్య కేసులోనూ నిందితుడుగా ఉన్నాడు. ఒడిశా రాయగడ ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, బెంగళూరు, హోసూరు ప్రాంతాలకు తరలించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించిన జీఆర్‌పీఎస్ ఎస్సైలు కె. వెంకటేశ్వర్లు, ఎన్. హరిచందన ఏఎస్ఐ రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుళ్ల వి. కిరణ్, ఎ. మణికంఠలను ఉన్నతాధికారులు అభినందించారు.

### అలిపిరి వద్ద నిరసన ఎఫెక్ట్...

## వైసిపి నేతలపై పోలీసు కేసులు

తిరుపతి, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి అలిపిరి గరుడ విగ్రహం కూడలి వద్ద మంగళవారం నిరసన తెలిపి, శాంతి భద్రతలకు భంగం కలిగించారనే కోణంలో తిరుపతి వైసిపి నాయకులపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. గరుడ విగ్రహం వద్ద వైసిపి నాయకులు వైసిపి ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్, రాష్ట్ర అదికార ప్రతినిధి ఆరే అజయ్ కుమార్, వైసిపి ఎస్సీసెల్ అధ్యక్షుడు టి.రాజేంద్ర, బిసి సెల్ అధ్యక్షుడు అరుణ్ యాదవ్‌తోపాటు మరికొందరిపై 285, 270 రెడ్ విత్ 3(5), 30 పోలీస్ యాక్టు -1861 సెక్షన్స్ మేరకు 91/2026 క్రైమ్ నంబర్ క్రింద కేసు నమోదు చేసినట్లు అలిపిరి పోలీసులు తెలిపారు. తదుపరి వీరిని విచారణ చేయనున్నట్లు చెప్పారు. అలిపిరి గరుడ కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించి టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడుకి వ్యతిరేకంగా నిరసన చేయడం, చైర్మన్ పదవికి రాజీనామా చేయాలనీ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కారణంగా తిరుమల నుండి తిరుపతికి వచ్చే బస్సులు, తిరుమలకెళ్ళే భక్తులకు మంగళవారం ఉదయం 10.15 గంటల నుండి 10.40 గంటల వరకు ట్రాఫిక్ అంతరాయం కలిగించారు. వైసిపి నేతలకు విన్నవించినా, పోలీస్ యాక్టు అమలులో ఉందని, అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించడం చట్టవిరుద్ధమని చెప్పినా పట్టించుకోలేదు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా వైసిపి నేతలపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## టీనేజ్ ప్రెగ్నెన్సీలపై అవగాహన కల్పిస్తాం

### ఎపి మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ



విజయవాడ, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో టీనేజ్ ప్రెగ్నెన్సీలు అధికమవుతున్నాయని ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జాబితాలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడో స్థానంలో ఉందని తెలిపారు. బుధవారం విజయవాడలో రాయపాటి శైలజ విలేకర్లతో మాట్లాడుతూ.. విశాఖపట్నం మినహా అన్ని జిల్లాల్లో టీనేజ్ ప్రెగ్నెన్సీలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ అంశంపై అన్ని విభాగాలతో కలిసి రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేశామని వివరించారు. ఒక్కొక్క జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఇవి పల్నాడు, కర్నూలు జిల్లాల్లో జరుగుతున్నాయని వివరించారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్యం మీద పిల్లలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విలేజ్ డెవలప్‌మెంట్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు చదువుకోకపోవడం వల్ల కూడా టీనేజ్ ప్రెగ్నెన్సీలు పెరిగే అవకాశం ఉందని మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో దీనిపై తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పిస్తున్నామన్నారు. సోషల్ మీడియా ద్వారా టీనేజర్లు ఆకర్షణకు గురవుతున్నారని తెలిపారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు పెరిగిపోవడానికి ఇదీ ఓ కారణమని రాయపాటి శైలజ ఆందోళన వ్యక్తం చేశారు.




## ప్రజలకు మెరుగైన సేవలందించాలి

తిరుపతి, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలపైన రెవెన్యూ క్లినిక్, పిజిఆర్ఎస్, మ్యుటేషన్‌పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సమీక్షించారు. బుధవారం ఉదయం రీసర్వే, పీపీబి డిస్ట్రిబ్యూషన్ తదితర అంశాలపై సమీక్షా సమావేశం చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి మ్మతో కలసి నిర్వహిం చారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, సంయుక్త కలెక్టర్ గోవిందరావు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీఒలు తిరుపతి, సూళ్లూరుపేట రామ్మోహన్, దేవేందర్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్ మాండ్, సంబంధిత సెక్షన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జింకను వేటాడి చంపిన చిరుత

### అలిపిరి తనిఖీ కేంద్రం సమీపంలో ఘటన



తిరుమల, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం అటవీ ప్రాంతంలో వేసవికి ముందే చిరుతలు మళ్ళీ జనసంచారంలోకి వచ్చేస్తున్నాయి. తాజాగా బుధవారం వేకువజామున తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రం సమీపంలో ఓ జింకను వేటాడి చిరుత చంపి తినింది. జింక కళేబరం తిరుమల మార్గంలో పడివుండటాన్ని భక్తులు గమనించారు. అంతేగాక అలిపిరి ఏవిఎస్ఒ కార్యాలయానికి సమీపంలోనే ఈ ఘటన జరగడంతో భక్తులు, భద్రత సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. అలిపిరి తనిఖీ కేంద్రం సమీపంలో బుధవారం వేకువజామున ఓ చిరుత సంచారం సిసికెమెరాల్లో కనిపించింది. అదే సమయంలో సమీప పొదల్లో ఓ జింకను చంపినట్లు కనుగొన్నారు. ఈ విషయాన్ని టిటిడి అటవీ విభాగంకు తెలియజేశారు. సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది జింక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. చిరుత దాడి చేయడం వల్లే జింక మరణించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. చిరుత కదలికపై నిఘా ఉంచారు. అలిపిరి కాలినడక మార్గంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఇదివరకే అమర్చిన సిసిటివి కెమెరాల ద్వారా చిరుత సంచారాన్ని పసిగడుతున్నారు. సిసిటివి ఫుటేజీని నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతానికి ఒంటరి చిరుత అలిపిరి పరిసర ప్రాంతాల్లోనే సంచరిస్తున్నట్లు భద్రత సిబ్బంది నిర్ధారణకు వచ్చారు. కాలినడకన తిరుమలకు వస్తున్న భక్తులకు జాగ్రత్తలను సూచిస్తున్నారు. ఏకంగా అలిపిరి టోల్‌గేట్ వద్దే చిరుత సంచారంతో భయంతో వణుకుతున్నారు. గతంలోనూ తిరుమలలో, ఘాట్‌రోడ్డులో, కాలినడక మార్గాల్లో చిరుతల సంచారం జరగడం, చిన్నారులపై దాడిచేయడం, ఒకరిని చంపి తినడం వంటి విషాద ఘటనలు జరిగాయి. ఇప్పుడు వేసవిరి ముందే మళ్లీ చిరుతపులుల సంచారం ఆరంభమైనట్టే తెలుస్తోంది.

## ఏప్రిల్ 18 నుంచి గుడిమల్లం కుంభాభిషేకం

### మార్చి 7న బాలాలయం ఏర్పాటు



శ్రీకాళహస్తి రూరల్, మార్చి 4 ప్రభాతవార్త: పురావస్తుశాఖ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఏర్పేడు మండలం గుడిమల్లం ఆలయం కుంభాభిషేకానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 18నుంచి 23వరకు కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నెల 7న బాలాలయం ఏర్పాటుకు నిర్ణయించారు. గుడిమల్లం ఆలయం అతి పురాతనమైనది. 30 సంవత్సరాల ముందు శివరాత్రి సందర్భంగా అగ్నిప్రమాదం జరిగి ప్రాణనష్టం జరిగింది. దాంతో ఆలయంలో కుంభాభిషేకం జరపాల్సి ఉండగా ఏ కారణాల చేతనో నిర్వహించలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి దిశగా ప్రయాణం సాగిస్తున్నారు. ఆలయానికి ధర్మకర్తల మండలిని నియమించారు. దేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన ఆలయంలో మహాకుంభాభిషేకం నిర్వహించుటకు చొరవ చూపారు. సాధారణంగా 12సంవత్సరాలకొకమారు కుంబాభిషేకం జరగాలి. కానీ గుడిమల్లం ఆలయానికి ధర్మకర్తల మండలి లేకపోవటంతో ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ధర్మకర్తల మండలి చైర్మన్ బత్తల గిరిబాబునాయుడు ఇక్కడకు వచ్చే భక్తులకు బస సదుపాయం కోసం ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. గుడిమల్లం అభివృద్ధికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఎంతో కృషిష చేస్తున్నారు. రూ.3 కోట్లతో రోడ్లు ఏర్పాటు చేశారు. ఆలయానికి సంబంధించి కట్టడాలు ధ్వంసం కాకుండా మరమ్మత్తులు చేపట్టి మహాకుంభాభిషేకం జరుపుటకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బత్తల గిరినాయుడు, పాలకమండలి సభ్యులు రాజకుమార్ నాయుడు, ఆరుణ, నిరంజన్, ఆలయ ఇఒ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. బాలాలయం సందర్భంగా 42 రోజుల పాటు అంతరాలయం ప్రవేశం ఉండదని వివరించారు.

### రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వివాదం

## హార్షవీణకు ముందస్తు బెయిలు

### షరతులతో మంజూరు చేసిన హైకోర్టు

విజయవాడ, మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసిన కేసులో హార్షవీణకు హైకోర్టు షరతులతో ముందస్తు బెయిలు మంజూరు చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి దీన్ని అనుసరించి ఉత్తర్వులిచ్చారు. అందుకు అనుగుణంగా వారంలో సంబంధిత కోర్టు ముందు హాజరై రూ. 20,000 బాండ్‌తో రెండు పూచీకత్తులను సమర్పించాలని హైకోర్టు ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. అభియోగపత్రం దాఖలు చేసేంత వరకు ఎస్‌హెచ్‌వో ముందు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు ఏదో ఒక సమయంలో హాజరుకావాలని, అదే విధంగా దర్యాప్తునకు సహకరించాల్సిందిగా వెల్లడించింది. దీంతో పాటు విచారణకు అందుబాటులో ఉండాలని హార్షవీణకు తెలియజేసింది. ఈ కేసుకు సంబంధించి ప్రధానంగా సాక్షులను బెదిరించడం లేదా ప్రభావితం చేయడానికి ఏ మాత్రం వీల్లేదని ఈ సందర్భంగా హైకోర్టు తేల్చి చెప్పింది. న్యాయస్థానం అనుమతి లేకుండా జిల్లాను దాటి వెళ్లకూడదని తెలియజేసింది. పాస్‌పోర్టును కోర్టులో అప్పగించాలని, ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏ విధమైన మీడియాతోనూ పంచుకోకూడదని తెలిపింది. ఈ షరతులను ఉల్లంఘించినట్లయితే బెయిలు రద్దుకు పోలీసులు చర్యలు తీసుకోవచ్చునని న్యాయమూర్తి కొన్ని షరతులను విధించారు. గతంలో హార్షవీణ నేరపూర్వక బెదిరింపులు, కుట్ర, బలవంతపు డబ్బుల వసూళ్లకు పాల్పడ్డారంటూ జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రైల్వే కోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసులో ముందస్తు బెయిలు కోసం హార్షవీణ హైకోర్టును ఆశ్రయించారు. అదే విధంగా రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణకు కమిటీ నియమిస్తూ రాష్ట్ర జనసేన పార్టీ నిర్ణయం తీసుకుంది. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై ప్రసార మాధ్యమాలలో వచ్చిన వార్తలు, ఒక మహిళ చేసిన ఆరోపణలపై విచారణ చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై వచ్చిన ఫిర్యాదుపై ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించింది. టి. శివశంకర్, తంబళ్లపల్లి రమాదేవి, టి.సి. వరుణ్‌లు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. దీని ప్రకారం అరవ శ్రీధర్ ఏడు రోజుల్లోగా కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాలని పేర్కొంది. కమిటీ సదరు ఆరోపణలపై నిజానిజాలు విచారణ చేసి పార్టీకి నివేదిక అందిస్తుంది. నివేదిక పరిశీలన చేసి, తుది నిర్ణయం వెలువడే వరకూ అరవ శ్రీధర్‌ను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేస్తూ జనసేన రాజకీయాల పార్టీ కార్యదర్శి హరిప్రసాద్ పేరుతో ప్రకటన విడుదలైంది.




విశాఖపట్నం విచ్చేసిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న మాజీ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి (విశాఖపట్నం - ప్రభాతవార్త)



# ఐటీ గ్లోబల్ మ్యాప్‌లో విశాఖపట్నం నిలపబోతున్నాం..



**ఒక్క ఐటీ రంగంలోనే 5లక్షల ఉద్యోగాల కల్పన మా లక్ష్యం -99 పైసలకే భూమి విషయంలో టీమ్ -11 అనవసర రాద్ధాంతాం -గూగుల్, కాగ్నిజెంట్, టిసిఎస్, ఆసిప్ అడ్రస్ లేని కంపెనీలా? -గతంలో ఎనర్జీ, ఐటీ కంపెనీలపై ఒక యుద్ధమే ప్రకటించారు -శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్**

విశాఖపట్నం, మార్చి 04, ప్రభాతవార్త

ఐటీ రంగంలో విశాఖపట్నాన్ని గ్లోబల్ మ్యాప్‌లో పెట్టబోతున్నాం. ఐదేళ్లలో ఒక్క ఐటీ రంగంలోనే విశాఖ కేంద్రంగా 5లక్షల ఉద్యోగాలు కల్పించాలని ముఖ్యమంత్రి నాకు లక్ష్యాన్ని నిర్దేశించారు. దీనిని ఒక బాధ్యతగా చేపట్టి మంత్రులందరం కలిసికట్టుగా పనిచేస్తూ విశాఖపట్నాన్ని ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఐటి అండ్ లక్ట్రానిక్స్ శాఖ బడ్జెట్ డిమాండ్స్‌పై మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... హైదరాబాద్, బెంగుళూరుల్లో ఐటీ అభివృద్ధికి 30 ఏళ్లు పట్టింది, దానిని ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్లలో చేసి చూపిస్తాం. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున ఎంవోయూలు కుదుర్చుకున్నాం. ఒక్క ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో రూ. 1.50లక్షల కోట్ల విలువైన 52 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. వీటిద్వారా 2.3లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. క్వాంటంలో కూడా పెద్దఎత్తున ఒప్పందాలు కుదుర్చుకున్నాం. పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి, ఇందుకు సభ్యులందరి సహకారం అవసరం. టీమ్ -11కి కూడా ఆఫర్ ఇస్తున్నా. మీకు తెలిసిన కంపెనీలు ఉన్నా చెప్పండి. కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం. రాజకీయాలు రాష్ట్రం లోపల చేద్దాం. బయటకు వెళ్లినప్పుడు కలిసికట్టుగా రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడదాం. సభ్యులకు తెలిసిన ఐటీ కంపెనీలు ఉంటే వివరాలు మాకు పెట్టండి. పర్సనల్‌గా ఫాలో అప్ చేసి గ్రౌండ్ చేసేందుకు 8వ పేజీలో

# 'సింహాద్రప్పన్న' భూములపై గళమెత్తిన ఎమ్మెల్యేలు

**ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న పంచ గ్రామాల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి -ఇప్పటికైనా రైతులు, నివాసితుల కష్టాలు తీర్చాలని వినతి -అసెంబ్లీ వేదిగా సుదీర్ఘంగా చర్చించిన విశాఖ ఎమ్మెల్యేలు**






(ప్రభాతవార్త-విశాఖపట్నం)

ఏళ్ళ తరబడి నలుగుతున్న పంచ గ్రామాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని బుధవారం అసెంబ్లీ వేదికగా విశాఖ శాసనసభ్యులు కోరారు. వేపగుంట, అడవివరం, చీమలాపల్లి, వెంకటాపురం, పురుషోత్తపురం గ్రామాల పరిధిలోని నివాసితులు, రైతులు ఏళ్ల తరబడి కష్టాలు పడుతున్నారని, తమ కష్టార్జితంతో స్థలాలు కొన్నా.. యాజమాన్య హక్కులు దక్కక వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావని వారు వివరించారు. సింహాచలం దేవస్థానానికి చెందిన భూములు కావడంతో ఏర్పడిన సాంకేతిక సమస్యలను పరిష్కరించేం దుకు తగిన మార్గాలను అన్వేషించాలని వారు విజ్ఞప్తి చేశారు. భీముని పట్నం, విశాఖ పశ్చిమ, గాజువాక, ఉత్తర, పెందుర్తి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చర్చలో పాల్గొన్నారు.

**అసెంబ్లీలో చర్చను ప్రారంభించిన 'గంటా'**

దశాబ్దాలుగా పంచ గ్రామాల సమస్య ఉన్నా చంద్రబాబునాయుడు సీఎం అయ్యాకే పరిష్కారానికి బీజం పడిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 1996లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే హౌస్ కమిటీ వేశారని, 2000 సంవత్సరంలో 578 జీఓ జారీ చేశారని చెప్పారు. దాని ప్రకారం సమస్య పరిష్కారం అవుతున్న దశలో తాము అధికారంలోకి వస్తే ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రజలను తప్పుదారి పట్టించిందన్నారు. 2014లో మళ్లీ అధికారంలోకి వచ్చాక విశాఖలో జరిగిన తొలి మంత్రివర్గ సమావేశంలో చంద్రబాబునాయుడు పంచగ్రామాల సమస్య గురించి చర్చించిన విషయం గుర్తు చేశారు. సింహాచలం దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూములు ఇచ్చి వివాదాస్పద స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున ఇప్పటికైనా ఈ సమస్య పరిష్కారం అవుతుందన్న ఆశాభావంతో ప్రజలు ఉన్నారని గంటా చెప్పారు.

**చట్టబద్ధమైన పరిష్కారం చూపాలి**

పంచగ్రామాల సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం చూపి, రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు ప్రభుత్వాన్ని కోరారు. చారిత్రక 8వ పేజీలో

# కూటమి ఆధ్వర్యంలో యువతకి ఉపాధి అవకాశాలు మెరుగు

**దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**



విశాఖపట్నం, మార్చి 5 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉమ్మడి విశాఖ నగరంలో అనేక కంపెనీలు రాకతో, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ గతంలో ఎంతో మంది యువతీయువకులు ఏదైనా ఉపాధి కొరకు బెంగళూరు, హైదరాబాద్ గాని వంటి నగరాలకు వలస వెళ్లాల్సి వచ్చేదనీ వివరించారు. ఉమ్మడి విశాఖలో 15 కొత్త సాఫ్ట్ వేర్ కంపెనీలు రావడంతో లక్షలు 8వ పేజీలో

# విశాఖ-విజయవాడ మధ్య హైస్పీడ్ రైలు



8లో

# విద్యుత్ రంగంలో సేవల విస్తరణ... అభివృద్ధి పనులపై ఎంపీ సమీక్ష



8లో

**ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన కలెక్టరేట్లో జిల్లా ఎలక్ట్రిసిటీ కమిటీ సమావేశం -భాగస్వామ్యమైన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, విద్యుత్ శాఖ అధికారులు**

# లోకేష్‌తో ఉల్లాసంగా ఆత్మీయ సమ్మేళనం..







**విశాఖపట్టణం, అరకు పార్లమెంట్ ప్రజాప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ విందు సమావేశం**

# నగరంలో ఘనంగా హోలీ వేడుకలు



# ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కుమారుడు వివాహ వేడుకకు హాజరైన వైఎస్ జగన్మోహన్ రెడ్డి

**నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ ముఖ్యమంత్రి జగన్**



8లో

# క్షేత్ర స్థాయి పర్యటనలో వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్



8లో

## క్షేత్ర స్థాయి పర్యటనలో వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్

విశాఖపట్నం–ప్రభాతవార్త

మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ వీఎం ఆర్డీఏ చేపడుతున్న ప్రాధాన్యత బృహత్ ప్రణాళిక రహదారుల విస్తరణలో భాగమైన గంభీరం, నేరెళ్ళవలస– తాళ్లవలస పనుల ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రస్తుతం పనులు నిర్దేశించిన టైం షెడ్యూల్ ప్రకారం చురుగ్గా సాగుతున్నాయని, అదేసమయంలో భూములు కోల్పోయిన భూ యజమానులకు సాధ్యమైనంత త్వర గా టీడీఆర్‌లు, ప్రభావిత కట్టడాల యజమానులకు నష్టపరిహారం ఇచ్చే విధంగా జీవీఎంసీ, వీఎంఆర్డీఏ ప్రణాళిక విభాగాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి మధ్యలో ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభా లను మార్చి, వాటి స్థానే కొత్తవి ఈ నెల 15 తారీఖు కల్లా ఏర్పాటు చేయాలని సూచించారు. రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, ఏపీ ట్రాన్స్కో, జీవీఎంసీ విభాగాలు సమన్వయంతో అడ్డంకులను అధిగమించి, ఏప్రిల్ నెలాఖరునాటికి చేసి రహ దారులను వినియోగంలోకి తీసుకొనివచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తదుపరి వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో జీవీఎంసీ, ఏపి ట్రాన్స్కో, ఆర్‌డబ్ల్యుఎస్ తహసీల్దార్ ఆనందపురం మరియు భీమిలి తదితరులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితి లోగా రహదారులన్నీ ఎట్టిపరిస్థితుల్లో వినియోగంలోకి తీసుకొనే వచ్చే క్రమంలో పనులను మరింతగా వేగవంతం చెయ్యాల్సిన అవసరం ఉందని, తదనుగుణంగా అధికారులు, ఇంజనీర్లు, గుత్తేదారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదనరావు, ఎస్ఈ ఏపి ట్రాన్స్కో కార్యనిర్వాహక ఇంజనీర్లు దుర్గా ప్రసాద్, రామరాజు, సుదీర్, ప్లానింగ్ అధికారులు మహాపాత్ర, కిషోర్, మౌనిక, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ రంగంలో సేవల విస్తరణ... అభివృద్ధి పనులపై ఎంపీ సమీక్ష

విశాఖపట్నం, మార్చి 04, ప్రభాతవార్త

జిల్లాలో విద్యుత్ రంగ అభివృద్ధి పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా తదితర అంశాలపై విశాఖపట్టణం ఎంపీ శ్రీభరత్ సుదీర్ఘంగా సమీక్షించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆయన అధ్యక్షతన జిల్లా ఎలక్ట్రిసిటీ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, విద్యుత్ శాఖ అధికారులు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా ముందుగా జిల్లాలో అమలు చేస్తున్న పథకాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ సమగ్ర వివరణ ఇచ్చారు. జిల్లాలోని నాలుగు జోన్ల పరిధిలో 11 మండలాల ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని వివరించారు. ఎంపీ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం ప్రథమ ప్రాధాన్యంగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పీఎం సూర్యఘర్: మఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకం ప్రయోజనాలను పొందేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సబ్సిడీలు, ప్రయోజనాల వివరాలను స్పష్టంగా వివరించి ప్రజల్లో విశ్వాసం పెంచాలన్నారు. అలాగే పీఎం కుసుమ్ పథకం ఉద్దేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, వ్యవసాయ రంగంలో సోలార్ విద్యుత్ వ్యవస్థలను ప్రోత్సహించాలని సూచించారు. పీఎం కుసుమ్ కింద జిల్లాలో చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు దీర్ఘకాల ప్రయోజనం చేకూరేలా పథక అమలు ఉండాలని హితవు పలికారు. జిల్లాలో కొనసాగుతున్న భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు, ఈహెచ్టీ సబ్ స్టేషన్లు, 33/11 కేవీ సబ్ స్టేషన్లు, ఇంటర్ లింకింగ్ అభివృద్ధి పనుల పురోగతిపై ఎంపీ సమీక్షించారు. పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు పీటీఆర్లు, కొత్తగా ప్రతిపాదించిన సబ్ స్టేషన్లు, ఫీడర్ స్టేషన్ల తాజా స్థితిపై కూడా ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆర్‌డీఎస్ఎస్ (=వఙుఎజూవఎ ఇఱఅర్తీఅఎ౯ఱఅ ాఎఙ్శిఅర్తీ ాఎఙ్ష్షవఎవ) పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యుత్ నష్టం తగ్గింపు, స్మార్ట్ మీటరింగ్, మౌలిక సదుపాయాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. చివరిగా జిల్లాలోని విద్యుత్ రంగ సేవలను, సబ్ స్టేషన్ల వివరాలను, గణంకాలను వివరిస్తూ నివేదికలు ఇవ్వాలని, ప్రత్యేక మ్యాప్‌లు రూపొందించాలని ఆదేశించారు. సమావేశం లో డిస్కం ఎస్.ఈ. శ్యాంబాబుతో పాటు, ట్రాన్స్ కో ఎస్.ఈ. శివరామ కృష్ణ, ఈఈలు ధర్మరాజు, శ్రీనివాసరావు, వీకే నాయుడు, సింహాచలం నాయుడు, డీఈఈ సుమన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విశాఖ-విజయవాడ మధ్య హైస్పీడ్ రైలు

విశాఖపట్నం, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్‌కు హైస్పీడ్ రైలు సేవలపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. విజయవాడ–విశాఖ పట్నం మధ్య బుల్లెట్ రైలు నడపడానికి హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రతిపాదనను రైల్వే శాఖ పరిశీలిస్తోంది. తుది మార్గ నిర్ధారణ (ఫైనల్ లొకేషన్ సర్వే) కోసం అనుమతి కోరినట్లు సమాచారం. బోర్డు ఆమోదం లభిస్తే సర్వే ప్రక్రియ ప్రారంభమవుతుంది. దాదాపు 350 కిలోమీటర్ల పొడవున్న ఈ కారిడార్ ఏలూరు, రాజమహేం ద్రవరం, కాకినాడ మార్గంగా వెళ్లేలా ప్రణాళిక సిద్ధమవుతోంది. గంటకు సుమారు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలు అందుబాటులోకి వస్తే విజయవాడ–వైజాగ్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. అదే సమయంలో విజయవాడ–కర్నూల్ మధ్య సెమీ హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఏడు హైస్పీడ్ కారిడార్లలో హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, చెన్నై–బెంగళూరు మార్గాలు కూడా ఏపీ మీదుగా ఉండనున్నాయి. ఈ పరిణామాలతో రాష్ట్ర రవాణా రంగంలో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశముంది.

## ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కుమారుడు వివాహ వేడుకకు హాజరైన వైయస్ జగన్మోహన్ రెడ్డి

అరకులోయ /అరకు రూరల్, మార్చి 4, ప్రభాతవార్త

వైయస్ఆర్సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం అరకులోయలో జరిగిన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కుమారుడు చాణిక్య, అశ్వినిల వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆహ్వానం మేరకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా అరకులోయకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రత్యేక హెలికాప్టర్‌లో అరకులోయకు చేరుకున్న జగన్మోహన్ రెడ్డి అక్కడ నుండి వివాహ వేదిక వద్దకు చేరుకుని నూతన దంపతులైన చాణిక్య, అశ్వినిలను ఆశీర్వదించారు. అనంతరం ప్రజలకు, వైసిపి నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ తిరిగి పయనమయ్యారు. అంతకు ముందు హెలిప్యాడ్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం వైసిపి నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. కాగా వైయస్ జగన్మోహన్ రెడ్డి అరకులోయకు విచ్చేస్తున్నారన్న సమాచారం తెలుసు కున్న వైసిపి శ్రేణులు కార్యకర్తలు వివాహ వేదిక వద్దకు అధిక సంఖ్యలో చేరుకున్నారు. తమ ప్రియతమ నాయకుడు జగన్మోహన్ రెడ్డిని తిలకించి జై జగన్ జై జై జగన్, కాబోయే సీఎం జగన్ అంటూ నినాదాలు చేశారు. ఇదిలా ఉండగా వైయస్ జగన్ అరకులోయ పర్యటన సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## సింహాద్రప్పన్న' భూములపై గళమెత్తిన ఎమ్మెల్యేలు

7వ పేజీ తరువాయి ..

ఆధారాలు స్పష్టంగా ఉన్నా రైతులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ సమస్యపై హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్లలో జిల్లా కలెక్టర్ను 6వ రెస్పాండెంట్గా చేర్చి, ప్రభుత్వం తరపున స్పష్టమైన కౌంటర్ దాఖలు చేయాలన్నారు. అనవసర న్యాయపరమైన జాప్యాన్ని నివారించి, రైతులకు న్యాయం చేయాలని కోరారు.

**కోర్టుకెళ్లిన వారిపై కేసులు పెట్టాలి**

పంచ గ్రామాల సమస్యను మానవీయ కోణంలో కాకుండా కొందరు రాజకీయ అంశంగా చూస్తున్నారని, కోర్టులో కేసులు వేసి అడ్డుపడుతున్నారని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ అన్నారు. అందువల్లనే ఈ సమస్య దశాబ్దాలుగా కొనసాగుతోందన్నారు. కోర్టుకు వెళ్లిన వారిపైనే కేసులు పెట్టాలని, అప్పుడే వారికి తగిన బుద్ధి వస్తుందన్నారు. సీఎం చంద్రబాబు హయాంలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

**ఒక కమిటీ వేయాలి అధ్యక్షా...**

పంచ గ్రామాల సమస్యపై కొత్తగా ఒక కమిటీ వేసి, నిర్ణీత సమయంలో పరిష్కారమయ్యేలా చూడాలని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కోరారు. దేవదాయ, రెవెన్యూ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలు, విశాఖ కలెక్టర్ అడ్వొకేట్ జనరల్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేయాలని, మూడు నాలుగు నెలల సమయం ఇచ్చి, నివేదిక వచ్చేలా చూడాలన్నారు. సంబంధిత ఐదు నియోజకవర్గాల ఎమ్మెల్యేలను, దేవదాయ, రెవెన్యూ శాఖల మంత్రులకు కూడా భాగస్వామ్యం కల్పించాలని చెప్పారు.

**హక్కుదారులు వారు.. ఆక్రమణదారులు కారు**

పంచ గ్రామాల్లో నివసిస్తున్న వారిని ఆక్రమణదారులుగా చూడడం తగదని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. వారు హక్కుదారులని, సాంకేతిక సమస్యలున్నంత మాత్రాన వారికి హక్కులు లేవనడం తగదన్నారు. ప్రత్యామ్నాయ భూములు చూపాలని, న్యాయపరమైన చిక్కులు తొలగించాలన్నారు. ఒక కమిటీని నియమించి, ఈ సమస్యను కొలిక్కి తీసుకురావాలని కోరారు.

## కూటమి ఆధ్వర్యంలో..

7వ పేజీ తరువాయి ..

ఉద్యోగాలు రావడంతో పాటు ఎంతోమందికి ఉపాధి అవకాశాలు వస్తాయని స్పష్టం చేశారు. అదే విధంగా నక్కపల్లిలో కొత్తగా పెద్ద స్టీల్ కంపెనీ కూడా రావడంతో ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. కూటమి అధికారంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని గత ప్రభుత్వంలో ప్రజలు నిరంతరం భయాందోళన గురయ్యారని, నేడు కూటమి అధికారంలో ఆ పరిస్థితి మారి అనేక మంది ఇన్వెస్టర్లు స్వేచ్ఛగా తమ వ్యాపారాలను విస్తరించుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఉపాధి అవకాశాలు కు ప్రత్యేక శ్రద్ధ చూపించడంతోపాటు, ఉపాధిని పెంచే ఉద్దేశంతో అనేక సాఫ్ట్వేర్ కంపెనీలకు రావడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలియపరిచారు. ఉత్తరాంధ్ర పరిసర ప్రాంతాల్లోనే ఉపాధి అవకాశాలు వస్తున్నందున యువతీ యువకులు వేరొక ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు ముందుకు నడిపిస్తున్న ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు...

# లోకేష్‌తో ఉల్లాసంగా ఆత్మీయ సమ్మేళనం..



7వ పేజీ తరువాయి ..

ఉత్తరాంధ్రలోని విశాఖపట్టణం, అరకు పార్లమెంట్ సెగ్మెంట్ల ప్రజాప్రతినిధులు, కుటుంబసభ్యులతో మంత్రి నారా లోకేష్ ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతమూ ఉల్లాసం..ఉత్సాహం నెలకొంది. ఉండవల్లి నివాసంలో బుధవారం ఇచ్చిన విందుకు రెండు పార్లమెంటు నియోజకవర్గాల నుంచి కుటుంబసభ్యులతో కలిసి ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఒక్కో కుటుంబానికి సాదర స్వాగతం పలికిన మంత్రి లోకేష్, యోగక్షేమాలు తెలుసుకున్నారు. పిల్లలతో సరదాగా మాటలు కలిపి, బాగా చదువుకోవాలని హితవు పలికారు. సరదా సంభాషణలతో నవ్వులు విరిశాయి. అతిథులకు మంత్రి లోకేష్ స్వయంగా భోజనం ప్లేట్లు అందించారు. రాజకీయాలు ప్రస్తావన లేకుండా, కుటుంబంలో శుభకార్యంలా సందడిగా ఆత్మీయ సమ్మేళనం సాగింది. విశాఖకు గూగుల్ తీసుకురావడంలో కృషి చేసిన లోకేష్ ను అభినందిస్తూ..తాము అందించిన ఫోటో ఫ్రేమ్స్ లో వైజాగ్ లో జీ అక్షరాన్ని గూగుల్ లోగోతో డిజైన్ చేసి నేతలు అందించారు. నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై ఆయా ప్రజాప్రతినిధులు తనకు ఇచ్చిన గ్రీవెన్స్ స్టేటస్ రిపోర్టు వారికి అందజేశారు. సోదరీమణులకు తన నియోజకవర్గం చేనేత కళాకారులు నేసిన మంగళగిరి పట్టుచీరలు చిరుకానుకగా అందజేశారు. విశాఖపట్టణం పార్లమెంటు సభ్యుడు ముతుకుమిల్లి భరత్, ఎమ్మెల్యేలు పీజీవీఆర్ నాయుడు (గణబాబు విశాఖ వెస్ట్), గంటా శ్రీనివాసరావు (భీమిలి), వెలగపూడి రామకృష్ణబాబు (విశాఖ ఈస్ట్), వంశీకృష్ణ శ్రీనివాస్ (విశాఖ సౌత్), విష్ణుకుమార్ రాజు (విశాఖ నార్త్), పల్లా శ్రీనివాసరావు (గాజువాక), కోళ్ల లలితకుమారి (శృంగవరపుకోట), ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, అరకు పార్లమెంటు నుంచి మంత్రి గుమ్మడి సంధ్యారాణి (సాలూరు), తోయక జగదీశ్వరి (కురుపాం), బోనెల విజయచంద్ర (పార్వతీపురం), నిమ్మక జయకృష్ణ (పాలకొండ), ఎం శిరీషాదేవి (రంపచోడవరం) కుటుంబసభ్యులతో కలిసి ఆత్మీయ విందు సమావేశానికి హాజరయ్యారు.

## నగరంలో ఘనంగా హోలీ వేడుకలు

విశాఖపట్నం, మార్చి 3, ప్రభాతవార్త

విశాఖ నగరంలో బుధవారం యువతి, యువకులు హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. వయసుతో సంబంధం లేకుండా.. పెద్దలు పిల్లాపాపలతో ఆడి పాడారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రంగుల కాంతుల్ని వెదజల్లేందుకు నగరంలో పలు ప్రాంతాలు వేదికలుగా మారాయి. యువత కేరింతలు కొడుతూ.. ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొనడం కనిపించింది.

## అద్దపు సేవలో ఉపమాక వెంకన్న -మాఢవీధుల్లో నేత్రపర్వంగా రథోత్సవం

(నక్కపల్లి /అడ్డు రోడ్డు, ప్రభాతవార్త



మండలంలోని ఉపమాక క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో పులకిస్తోంది. ఈ నెల 26 నుంచి ప్రారంభమైన స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు సందర్భంగా రోజూ జరుగుతున్న ప్ర త్యేక కార్యక్రమాలు భక్తులను తన్మయత్వానికి గురిచేస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి పౌర్ణమి సందర్భంగా మాఢవీధుల్లో స్వామివారి రథోత్సవం భక్తుల సమక్షంలో ఎంతో ఘనంగా జరిగింది. ఆలయం లోని రాతి కల్యాణ మండపంలో స్వామి వారి అద్దపు సేవను ప్రధానార్చకులు గొట్టుము క్కల ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలా చార్యులు, నందూరి రాజగోపాలా చార్యులు నిర్వహించారు. అద్దపు సేవ సందర్భంగా అద్దాల మ ండపాన్ని సర్వాంగ సుందరంగా పుష్పమాలలతో అలంకరించారు. అనేకమంది భక్తులు అద్దాల సేవలో స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవంలో ఎటువంటి అపశృతులు చోటు చేసుకోకు ఎండా సీఐ మురళీ, ఎస్ఐ సన్నిబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం నుంచి ఆలయంలో శ్రీవారి పుష్పయాగోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఆరో తేదీతో కల్యాణో త్సవాలు ముగుస్తాయి.



## యువతకు 50శాతం రిజర్వేషన్ ఇవ్వబోతున్నాము..

### పార్టీ భవిష్యత్తుకోసం తీసుకునే నిర్ణయాలను అన్ని స్థాయిల్లోనూ స్వాగతించాలి...పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్

విశాఖపట్నం, మార్చి 5 ప్రభాతవార్త




తెలుగుదేశం పార్టీకి అనుబంధం గా వుండే 17 సంఘాల నియామ కాల్లో యువతకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ తెలిపారు. ఎన్టీఆర్ భవన్ లో విశాఖ ఉత్తర నియోజకవర్గం సమీక్ష సమావేశంలో ఆయన విశాఖ టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు చోడే పట్టాభిరామ్, ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.పి శ్రీభరత్ మాట్లాడుతూ పార్టీ సంస్థాగత పదవుల్లో యువతకు పెద్దపీట వేయాలని అధిష్టానం నిర్ణయించిందన్నారు...మారుతున్న పరిజ్ఞానానికి తగ్గట్లుగా యువతను తీర్చిదిద్ది సమాజ అభివృద్ధికి దోహదపడాలన్న సదుద్దేశాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలన్నారు...ఇప్పటివరకూ క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేసిన సీనియర్లు యువతరానికి ఆదర్శప్రాయులని, వారికి పార్టీ సముచితమైన గౌరవాన్ని ఇస్తుందని స్పష్టం చేశారు...మరో 40 ఏళ్లకు గాను పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకునే నిర్ణయాలను అన్ని స్థాయిల్లోనూ అమలు చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు..నిర్దేశించిన అనుబంధ సంఘాల్లో బాధ్యతాయుతంగా పనిచేయడానికి ముందుకు వచ్చే కార్యకర్తలకు వారి సామర్థ్యాన్ని బట్టి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

## ఐటీ గ్లోబల్ మ్యాప్‌లో విశాఖపట్నం నిలపబోతున్నాం..

7వ పేజీ తరువాయి ..

కృషిచేస్తాం. గత ప్రభుత్వం రెన్యువబుల్ ఎనర్జీ పరిశ్రమలపైన, ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ సంస్థలపై ఒక యుద్ధమే చేసింది. వారి చర్యల వల్ల ఆంధ్రరాష్ట్ర యువత తీవ్రంగా నష్టపోయింది. 2014–19 నడుమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫైనాన్సియల్ సర్వీసెస్‌లో వరల్డ్ బెస్ట్ అయిన ఒక ఫార్చ్యూన్ – 500 కంపెనీతో మాట్లాడి ఒప్పించడంతో ఆ కంపెనీ సీఈవో వచ్చి విశాఖలో కార్యాలయం ప్రారంభించారు. ఆ తర్వాత చంద్రబాబునాయుడుపై కక్షతో ప్రభుత్వానికి డబ్బులిచ్చి భూకేటాయింపులు చేసుకున్నారని ఆ కంపెనీపై పార్లమెంటులో వైసిపి నాయకులు ఆరోపణలు చేశారు. వారి ఆరోపణల వల్ల ఆ గ్లోబల్ కంపెనీ సీఈవో... ఛైర్మన్ అయ్యే ప్రక్రియ ఆరునెలలు ఆలస్యమైంది. వైసిపి విధ్వంస పాలనకు ఇదొక ఉదాహరణ మాత్రమే. భారీ పరిశ్రమలు, ఎనర్జీ శాఖల్లో ఇలాంటివి మరెన్నో జరిగాయి. ఆనాటి ప్రభుత్వ టెర్రరిజానికి ఇదొక ఉదాహరణ. 2019–24 నడుమ ఒక్క ఐటీ కంపెనీకి కూడా ఇన్సెంటివ్స్ విడుదల చేయలేదు. 2024 ఎన్నికల్లో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కంపెనీలతో మాట్లాడినపుడు వారు భయాన్ని వ్యక్తంచేశారు. మీరు ఐదేళ్లు అధికారంలో ఉండి పాలసీలు తయారుచేస్తారు, గత పాలకులు మళ్లీ అధికారంలోకి వస్తే మా భవిష్యత్తు ఏమిటి, గతంలోనూ వారివల్ల నష్టపోయాం, అలాంటి పరిస్థితులు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటారని పరిశ్రమదారులు మమ్మల్ని ప్రశ్నించారు. తెలంగాణకు హైదరాబాద్ ఉండొచ్చు, తమిళనాడుకు చెన్నయ్ ఉండొచ్చు, కర్ణాటకకు బెంగుళూరు ఉండొచ్చు... ఆంధ్ర రాష్ట్రానికి బ్రాండ్ చంద్రబాబు ఉన్నారని చెప్పాను. చంద్రబాబు గారి పరిపాలన అనుభవంతో మాకు డైరెక్షన్ ఇవ్వగా, ఐటీ ఒ ఎలక్ట్రానిక్స్ శాఖలో 8 పాలసీలు తీసుకువచ్చాం. ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ, డేటా సెంటర్ పాలసీ, సెమీ కండక్టర్, ఫ్యాబ్ పాలసీ, ఐటీఓ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ పాలసీ, ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ, ల్యాండ్ ఇన్సెంటివ్స్ ఫర్ టెకప్స్ (లిఫ్ట్) పాలసీ, నైబర్ హుడ్ వర్క్ స్పేస్ పాలసీ, భారతదేశంలోనే తొలిసారిగా క్వాంటం కంప్యూటింగ్ పాలసీలను మా శాఖ ద్వారా తీసుకువచ్చాం. ప్రధాని నరేంద్ర మోదీజీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు టాటా మోటార్స్ నానో కార్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు పశ్చిమ బెంగాల్ వెళ్లారు. అక్కడ ఆ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా కొందరు ఉద్యమం చేస్తే... నరేంద్రమోడీ టాటా ఛైర్మన్ కు ఒక ఎస్ఎంఎస్ పంపి, ఒక రూపాయికి భూమి కేటాయిస్తే, గుజరాత్ లో పెట్టుబడి పెట్టాలని కోరారు. ఆ ఒక్క ఎస్ఎంఎస్‌తో నానో ఫ్యాక్టరీ గుజరాత్ కు వెళ్లింది. దానికి అనుబంధంగా 60 యాన్సిలరీ యూనిట్లు కూడా అక్కడకు వచ్చాయి. టాటా నానో ప్రొడక్షన్ ఆగిపోయినా ఈ రోజు టాటా ఈవీ కార్లు ఆ ఫ్యాక్టరీలో తయారవుతున్నాయి. అక్కడ ఒక ఎనకమిక్ ఎకో సిస్టమ్ క్రియేట్ అయింది. దానిని స్ఫూర్తిగా తీసుకొని ముఖ్యమంత్రితో, సహచర మంత్రులతో కేబినెట్ లో చర్చించి గ్లోబల్ స్థాయిలో వరల్డ్ క్లాస్ జాబ్ లు క్రియేట్ చేసే టాప్– 500 ఐటీ కంపెనీలు రాష్ట్రానికి వచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తే ఎకరా రూపాయికి భూమిని కేటాయిస్తామని చెప్పి లిఫ్ట్ పాలసీ తెచ్చాం. టీమ్–11 ఈరోజు బయట నాపై ఆరోపణలు చేస్తున్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేను మొదటిసారి దావోస్ కు వెళ్లినపుడు కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ ను కలిసి ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరాను. ఎకరానికి 500 ఉద్యోగాలు మా బెంచ్ మార్కు, మీరు ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తారో చెప్పాలని సీఈవోను అడిగాను. ఆ మేరకు ఎంత ల్యాండ్ కావాలన్నా ఎకరా రూపాయికి ఇస్తామని చెబితే ఆయన నమ్మలేదు. మాకు చిత్తశుద్ధి ఉంది, చేసి చూపించే సత్తా మా ముఖ్యమంత్రి గారికి ఉందని చెప్పాను. ఆ ఒక్క నిర్ణయంతో ఈరోజు కాగ్నిజెంట్ విశాఖకు వచ్చి, శంకుస్థాపన కూడా పూర్తిచేసింది. ఆ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో 25వేల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారు. దీనివల్ల విశాఖ ఎకనమిక్ రీజియన్ లో వి1.8 బిలియన్ల నుంచి 2.2 బిలియన్ డాలర్ల వరకు ఎకనమిక్ ఇంపాక్ట్ ఉంటుంది. ఇదొక ఉదాహరణ మాత్రమే. గూగుల్ ఇన్ ఫ్రా హెడ్ విశాఖకు వస్తే నేను రహస్యంగా కారులో తీసుకెళ్లి వారికి ఇస్తున్న భూమి చూపించి, ఇన్సెంటివ్స్ పై కమిట్ అయ్యాం. ఆ తర్వాత వారు కొన్ని మినహాయింపులు కోరారు. అందుకు కేంద్రప్రభుత్వ సహకారం అవసరం. డేటా సెంటర్ టాక్స్ ఎగ్జంప్షన్ పాలసీ తీసుకురావాల్సి ఉంటుంది. పర్మినెంట్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ కు సవరణ తేవాల్సి ఉందని చెబితే ముఖ్యమంత్రి గారు ప్రధాని మోదీజీతో మాట్లాడారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో మాట్లాడాం. కేంద్రప్రభుత్వం అద్భుతమైన ఇన్సెంటివ్స్ ఇవ్వడంతో భారతదేశ చరిత్రలో అతి పెద్ద ఎఫ్ డీఐ వి15 బిలియన్ డాలర్లు విశాఖకు వచ్చింది. ఫలితంగా విశాఖలో గూగుల్ మెగా డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతోంది. దీనివల్ల ఏడాదికి వి3 బిలియన్ డాలర్ల ఎకనమిక్ ఇంపాక్ట్ ఉంటుంది. టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌ని చంద్రబాబుసీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అధికారికంగా ఆహ్వానించారు. ఎకనమిక్ అడ్వయిజర్ కౌన్సిల్ ఛైర్మన్ గా ఉండాలని సీఎం కోరారు. విశాఖలో టీసీఎస్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నేను విజ్ఞప్తి చేయగా, ముఖ్యమంత్రిపై ఉన్న గౌరవంతో తప్పనిసరిగా ఏర్పాటుచేస్తానని చెప్పారు. వారికి భూమి కేటాయించాం, టెంపరరీ సెంటర్ ఇప్పటికే ఏర్పాటైంది, త్వరలో రిబ్బన్ కటింగ్ చేయబోతున్నాం. పొరుగు రాష్ట్రానికి వెళ్తామంటే మేం పోటీపడి ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చాం. ఆ కంపెనీకి చౌకగా భూమి ఇస్తామని ఐటీ సెక్రటరీ కమిట్ కావడంతో మేం బాధ్యత తీసుకున్నాం. దీనివల్ల వేలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తారన్న ఆలోచనతో వారికి కూడా ఎకరా రూపాయి చొప్పున భూమి కేటాయించాం. అడ్రస్ లేని కంపెనీలకు మేం చౌకగా భూములిస్తున్నామని టీమ్ –11 మాపై ఆరోపణలు చేస్తున్నారు. కాగ్నిజెంట్, టీసీఎస్, గూగుల్, ఆసిప్ అడ్రస్ లేని కంపెనీలా? వారు చేయకపోగా చేసేవాళ్లను అడ్డుకుంటున్నారు. దీనిపై వారు కోర్టుకు కూడా వెళ్లారు, ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఉద్యోగాలు ఇచ్చే సంస్థలకు భూములిస్తే తప్పేంటని చీఫ్ జస్టిస్ ప్రశ్నించి, పిల్ ను కొట్టేశారు. పరిశ్రమలను రప్పించేందుకు మేం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. ఈరోజు డిజిటల్ ఎకో సిస్టమ్ ప్రారంభమైంది. త్వరలో విశాఖ కేంద్రంగా అనేక ఐటీ కంపెనీల నుంచి ఎనౌన్స్ మెంట్లు రాబోతున్నాయి. 99 పైసలకే భూములు కేటాయించే లిఫ్ట్ పాలసీ వల్ల పెద్దఎత్తున పెట్టుబడులు విశాఖకి వస్తున్నాయి. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ లక్ష్యసాధనకు ముఖ్యమంత్రి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తీసుకువచ్చారు. ఇప్పటికే 13వేలమంది విద్యార్థులు ముందుకురాగా, 772 స్టార్టప్ ఐడియాలకు సహకారం అందించాం. రైజప్ ఎంఎస్ఎంఈలకు కూడా మద్దతు ఇస్తున్నాం. ప్రత్యేకించి మహిళల కోసం ప్రత్యేక ఇన్సెంటివ్స్ ఇస్తున్నాం. ఎన్ఆర్ఐలకు సన్ రైజ్ కనెక్ట్ పేరుతో తెలుగు డయాస్పోరాను ప్రోత్సహిస్తూ ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరుతున్నాం. 2014లో రాష్ట్ర విభజన వల్ల మనం నష్టపోయాం. 2019–24 నడుమ గత ప్రభుత్వ విధానాల వల్ల మరికొంత నష్టపోయాం. కలిసికట్టుగా అందరం రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి, పెట్టు బడులు తెచ్చి, మన బిడ్డలకు ఉద్యోగాలు కల్పించేందుకు అందరూ సహకరించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

## తుంగ్లాములో షాపింగ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



గాజువాక, మార్చి 4,ప్రభాతవార్త

జీవీఎంసీ 69వ వార్డు పరిధిలోని తుంగ్లాము గ్రామంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు అర కోటి రూపాయల వ్యయంతో వ్యాపారుల సౌకర్యార్థం వాణిజ్య సముదాయం నిర్మించనున్నారు. ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. తుంగ్లాము గ్రామానికి ఇది వాణిజ్యపరంగా ఊతమిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ స్వర్ణ నూకాంబిక అమ్మవారి అన్నసమారాధన

గాజువాక, మార్చి 4,ప్రభాతవార్త



జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ క్వారీ రోడ్డులోని శ్రీ స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయం 15వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. వేకువజామున ప్రత్యేక పూజలు, కవచార్చన, మహాశాంతి హోమం నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో సుమారు ఆరు వేల మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీ రెడ్డి, బొడ్డు నరసింహ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 14 నుంచి 18 వరకు అమ్మవారి ఘటాలు గ్రామంలో విహరించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## మహిళ, చిన్నపిల్లల భద్రతకు తక్షణ స్పందన

**24 గంటల్లో రక్షణ, కుటుంబ సభ్యులకు అప్పగింపు -ఎమ్మార్పేట సీఐ దివాకర్ యాదవ్ కు సీపీ శంఖబ్రత బాగ్చి,డీసీపీ మణికంఠ ప్రశంసలు -స్థానికులు, సోషల్ మీడియాలో పోలీస్ సేవలను కొనియాడిన వైనం**

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



భర్త మృతి తరువాత ఇంట్లో కుటుంబ విభేదాలతో తీవ్ర మనస్తాపంలో ఉన్న నిమ్మకాయల ఈశ్వరమ్మ, ఆమె ఇద్దరు చిన్నపిల్లలను మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్, ఆయన సిబ్బంది కేవలం 24 గంటల్లో సురక్షితంగా రక్షించి, ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. భర్త మృతి, కుటుంబ మనస్తాపం: నిమ్మకాయల ఈశ్వరమ్మ పరిస్థితి ఈశ్వరమ్మ, భర్త మరణం తర్వాత ఇంట్లో తీవ్ర ఒత్తిడి, కుటుంబ వివాదాల కారణంగా తన చిన్నపిల్లలతో ఇంటిని వదిలి వెళ్లాల్సి వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా ఈ క్రమంలో మహిళ, చిన్న పిల్లల భద్రతపై పోలీసుకు దృష్టి సారించారు.

### పిల్లల భద్రతకు ప్రత్యేక దృష్టి

సీఐ దివాకర్ యాదవ్ అతని సిబ్బందితో కలిసి తక్షణ చర్య తీసుకొని, సురక్షిత ప్రాంతంలో మహిళ, పిల్లలను పరిరక్షించి వారి కుటుంబానికి అప్పగించారు. ఈ చర్యలో పోలీసుకు 24 గంటల్లో చేసిన కృషి వారి సామర్థ్యం, కర్తవ్యబద్ధతను చాటింది.

### పోలీసుల తక్షణ స్పందనకు ప్రశంసలు

ఈ ఘటనపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ విజయ్ మణికంఠ, ఈ స్టేసిపి లక్ష్మణమూర్తిలు సీఐ దివాకర్ యాదవ్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. వారి తక్షణ, సమయోచిత , సమర్థవంతమైన స్పందనను ప్రశంసించారు.

### సమాజానికి పోలీస్ సేవలకు ఉదాహరణ

స్థానికులు, ప్రజలు, సోషల్ మీడియా నెటిజన్లు మహారాణిపేట పోలీసులు చూపిన సామర్థ్యం, కర్తవ్యభావం, సమాజ సేవా మానసికతను కొనియాడుతున్నారు. ఈ సంఘటన పోలీసుల నిబద్ధతను, సమాజంలో వారి విశ్వాసాన్ని మరింత పెంచింది.

## వసతి గృహంలో క్రమశిక్షణ, భవిష్యత్ లక్ష్యాలపై అవగాహన

**- పెందుర్తి సిఐ సతీష్ కుమార్ విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం**

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి సతీష్ కుమార్ బుధవారం పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ ప్రతిభావంతుల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా, అక్కడ నివసిస్తున్న విద్యా ర్థులతో సమావేశమై, వారి విద్యాభ్యాసం, శ్రేయస్సు, భవిష్యత్ లక్ష్యాలపై స్ఫూర్తిదాయకంగా మాట్లాడారు.

### క్రమశిక్షణ, సమయపాలన , స్నేహబంధాల ప్రాముఖ్యత

విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, మంచి స్నేహబంధాలు, వ్యక్తిగత ప్రవర్తన పట్ల సిఐ సతీష్ కుమార్ అవగాహన కల్పించారు. ముఖ్యంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ గౌరవం మరియు భవిష్యత్ అవకాశాలు ఎలా దెబ్బతింటాయో వివరించారు. మత్తు పదార్థాలు క్షణికానందం ఇస్తాయి,కానీ జీవితాంతం బాధను మిగులుస్తాయని ఆయన పేర్కొన్నారు.యువత తమ లక్ష్యాలను మరువకుండా దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు.

### పోలీసుల సహాయం, భద్రతకు హామీ

విద్యార్థులు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా, భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, అవసరమైన సహాయం అందించడానికి పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారని హామీ ఇచ్చారు. పోలీసులు మీ భద్రత కోసం మాత్రమే కాకుండా, మీ భవిష్యత్తు కోసం కూడా ఉన్నారని ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ అన్నారు. ఈ సందర్శనతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, పోలీసుల పట్ల విశ్వాసం మరింత బలపడింది. వసతి గృహంలోని విద్యార్థులు, సిబ్బంది ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ సందర్శనపై ఆనందం వ్యక్తం చేశారు.

## అగనంపూడిలో జనసేన సభ్యత్వ నమోదు



గాజువాక, మార్చి 4,ప్రభాతవార్త

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ రెన్యువల్ తో పాటు కొత్త సభ్యత్వ నమోదు కోసం అగనం పూడి గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ కూడలి వద్ద బుధవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరానికి జనసేన సాను భూతిపరులు స్వచ్ఛందంగా హాజరై సభ్యత్వం నమోదు చేసుకున్నారు. సభ్యత్వంతో పాటు పార్టీ తరఫున అందించే ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కూడా అనేక మంది పొందారు. కార్యక్రమానికి స్థానిక జనసేన నాయకులు హాజరై ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇలాంటి శిబిరాల ద్వారా ప్రజల్లో పార్టీపై, అలాగే జనసేనాని కొణిదల పవన్ కళ్యాణ్‌పై ఉన్న నమ్మకం స్పష్టమవుతోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని దాసరి త్రినాధరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## బకాయిలు చెల్లించలేదని ఎల్ఐసీ కార్యాలయం సీజ్

గాజువాక,మార్చి 4,ప్రభాతవార్త



నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని కారణంగా గాజువాకలోని మంగళగిరి కాంప్లెక్స్‌లో ఉన్న ఎల్ఐసీ కార్యాలయాన్ని జీవీఎంసీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. అధికారుల కథనం ప్రకారం.. సదరు కార్యాలయం సుమారు రూ. 7.87 లక్షల మేర ఆస్తి పన్ను బాకీ పడింది. బకాయిలు చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో, ఏడీసీ రమణమూర్తి, జోనల్ కమిషనర్ శేషాద్రి, ఆర్వో రామనారాయణల సమక్షంలో కార్యాలయానికి తాళాలు వేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జీవీఎంసీకి పన్నులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, బకాయిదారులు తక్షణమే స్పందించి పన్నులు చెల్లించాలని హెచ్చరించారు.



**విశాఖపట్నం విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైయస్ జగన్ మోహన్ రెడ్డిని విశాఖ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న వైయస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొంగలి జగన్నాథం (విశాఖపట్నం - ప్రభాతవార్త)**

## వైజాగ్ ఐఐఎంలో 'మేనేజింగ్ ఎమోషన్స్ అండ్ ఇన్నర్ పీస్'పై అంతర్జాతీయ వర్క్‌షాప్

(విశాఖపట్నం - ప్రభాతవార్త)




ఎంవీపీ కాలనీలోని ఐఐఎఎం ఆడిటోరియంలో బుధవారం ఐఐఎఎం, సమతా కాలేజీ ఆధ్వర్యంలో పీజీడీఎం, ఎంబీఏ విద్యార్థుల కోసం మేనేజింగ్ ఎమోషన్స్ అండ్ ఇన్నర్ పీస్ అనే అంశంపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమెరికాకు చెందిన ప్రొఫెసర్ మ్యాట్ పెరెల్‌స్టీన్, ఫౌండర్ అండ్ సీఈఓ, ఈక్యూ 4 పీస్ వరల్డ్ వైడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### కార్పొరేట్ ఒత్తిడిపై అవగాహన

ప్రొఫెసర్ పెరెల్‌స్టీన్ మాట్లాడుతూ నేటి కార్పొరేట్ వాతావరణంలో పెరుగుతున్న ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే భావోద్వేగాలపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. భావోద్వేగ మేధస్సు ద్వారా వ్యక్తిగతంగా, వృత్తిపరంగా స్థిరమైన విజయాన్ని సాధించవచ్చని సూచించారు.

### అంతర్జాతీయ కార్యక్రమాలతో విద్యా వాతావరణం సమృద్ధి

ఐఐఎఎం డైరెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి అంతర్జాతీయ అకాడమిక్ కార్యక్రమాలు విద్యార్థుల్లో భావోద్వేగ దృఢత్వం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని తెలిపారు. అధ్యాపకులు ఈ సెషన్ ద్వారా విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లు, కార్పొరేట్ ప్లేస్‌మెంట్‌లలో ఉపయోగించగల ప్రాయోగిక ఫ్రేమ్‌వర్క్‌లు పొందారని పేర్కొన్నారు.

### అవగాహన ఒప్పందం (ఎంఓయు)

ఈ సందర్భంగా ఐఐఎఎం డీన్ అండ్ కరస్పాండెంట్ డా.ఎస్.పి.రవీంద్ర మాట్లాడుతూ ఈక్యూ 4 పీస్, ఐఐఎఎం మధ్య ఎంఓయు కుదిరిందన్నారు. భావోద్వేగ మేధస్సు, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్, సాఫ్ట్ స్కిల్స్, సస్టైనబుల్ ప్రాక్టీసెస్, పీస్ కమ్యూనికేషన్ స్టడీస్ తదితర అంశాల్లో పరిశోధన, శిక్షణ, అవుట్‌రీచ్ కార్యక్రమాలను జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలకు అనుగుణంగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా ప్రొఫెసర్ మ్యాట్ పెరెల్‌స్టీన్ విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలందించేందుకు అంగీకరించినట్లు డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ వెల్లడించారు.

## ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆనందపురం, మార్చి 4, ప్రభాతవార్త

ప్రమాదలను నివారించాలంటే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు చెప్పారు. మండలంలోని నీళ్లకుండీలు జంక్షన్‌లో ఉన్న శ్రీ సాయి స్వామి వివేకానంద స్కూల్ లలో బుధవారం జాతీయ భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ పాపారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. రోడ్డు కూడళ్ళు దాటేటప్పుడు సిగ్నల్స్ ను గమనించి ముందుకు సాగాలని చెప్పారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాహన యజమానిపైన కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## 62వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన



గాజువాక,మార్చి 4,ప్రభాతవార్త

జీవీఎంసీ 62వ వార్డులో బుధవారం టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు బుధవారం జీవీఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు త్రినాథపురం కొండపై పైప్‌లైన్ల అండర్‌గ్రౌండ్ పనులు, ఎన్టీఆర్ నగర్‌లో సెప్టిక్ ట్యాంకుల ప్రక్షాళనపై అధికారులతో చర్చించారు. అనంతరం వార్డులో జరుగుతున్న విద్యుత్ పనులను పరిశీలించి, నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డీఈ నాగేశ్వరరావు, ఏఈ అభిషేక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను రక్షించిన వారికి రాహ్ వీర్ పురస్కారం

మాధవధార, మార్చి 04, ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదాల్లో తీవ్రగాయాలతో సకాలంలో వైద్యం అందక మరణిస్తున్నవారి సంఖ్య అధికంగానే ఉంటోందని,క్షతగాత్రులను తొలి గంటలోగా (గోల్డెన్ అవర్) ఆసుపత్రికి తీసుకెళ్లగలిగితే ప్రాణాలు నిలిపిన వారవుతారని ఉప రవాణా కమీషనర్ ఆర్ సి హెచ్ శ్రీనివాస్ సూచించారు.రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను రక్షించిన వారికి కేంద్రం రాహ్ వీర్ పురస్కారం ఇవ్వనున్నట్టు తెలిపారు.రోడ్డు ప్రమాదాల్లో క్షత గాత్రులను ఆసుపత్రికి తరలిస్తే పోలీసులు స్టేషన్ కు పిలిపిస్తారని,కోర్టుల వెంట తిప్పుతారనే భయం చాలామందిలో ఉందని దీనిని అరికట్టేందుకు కేంద్రం రాహ్ వీర్ పథకం తెచ్చిందన్నారు.గతేడాది జిల్లాలో 1110 ప్రమాదాలు జరిగితే, 340 మంది మరణించారని తెలిపారు.రోడ్డు ప్రమాద క్షతగాత్రుడిని గోల్డెన్ అవర్ లోగా ఆసుపత్రికి పంపించి ప్రాణాలు కాపాడటంలో ఎవరైనా కృషి చేసినట్లు వైద్యులుగాని, పోలీసులు గాని ధ్రువీకరిస్తే సదరు వ్యక్తికి రూ.25వేల బహుమతి, ప్రశంసాపత్రం ఇస్తామని కేంద్రం ప్రకటించింది. ఇటీవల వరకు ఇది రూ. 5వేలు మాత్రమే ఉండేది. ప్రధానంగా ద్విచక్రవాహన ప్రమాదాల్లో గాయపడిన వారిలోనే ఎక్కువ మంది మరణిస్తు న్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి ప్రమాదాల్లోనే జిల్లాలో గతేడాది 340 మంది వరకు మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు.తీవ్రంగా గాయపడిన వారిని ఏ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినా ఎలాంటి షరతులు లేకుండా రూ. 1.50 లక్షల విలువైన వైద్యాన్ని అందించాలని కేంద్రం ఆదేశించింది. ఈ మొత్తం ఆసుపత్రికి కేంద్రం చెల్లిస్తుంది. దీని ద్వారా క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లడమే కాదు, ప్రాణరక్షణకు దోహదం చేస్తుందని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.క్షతగాత్రులకు తక్షణ సాయమనేది ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలన్నారు.

## జూ పార్క్ వద్ద రోడ్డు ప్రమాదం

**బొలెరోను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు**

విశాఖపట్నం, మార్చి 5 ప్రభాతవార్త



జూ పార్క్ సమీపంలో బుధవారం ఘోర ప్రమాదం తప్పింది. మధురవాడ వైపు వస్తున్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి ఓ ప్రైవేట్ బస్సు వేగంగా ఢీకొట్టింది.ఈ ధాటికి బొలెరో అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## షిప్‌యార్డ్‌లో జాతీయ భద్రతా వారోత్సవాలు

గాజువాక,మార్చి 4,ప్రభాతవార్త



హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) లో 55వ జాతీయ భద్రతా వారోత్సవాలు బుధ వారం ఘనంగా జరిగాయి. 'ప్రజలను భాగస్వాములను చేయడం, అవగాహన కల్పించడం ద్వారా భద్రతను పెంపొందించడం' అనే నినాదంతో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా షిప్‌యార్డ్ సందర్శకుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'సేఫ్టీ హ్యాండ్‌బుక్'ను సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) క్యాప్టెన్ గంటి వెంకటేశ్వర్లు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రత అనేది కేవలం నిబంధన మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఒక జీవనశైలిగా మారాలని పిలుపునిచ్చారు. వారం రోజుల పాటు ఉద్యోగులకు నిర్వహించిన భద్రతా క్విజ్, వ్యాసరచన, నినాదాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. 'మిషన్ జీరో యాక్సిడెంట్' (ప్రమాద రహిత యార్డ్) లక్ష్యంతో పని చేస్తామని సిబ్బంది ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## మంత్రి లోకేష్ నేడు విశాఖ రాక

విశాఖపట్నం, మార్చి 4, ప్రభాతవార్త

రాష్ట్ర మానవ వనరులు, ఐ టి,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖా మంత్రి నారా లోకేష్ గురువారం సాయంత్రం 4. 45 గంటలకు వాయు మార్గంలో విశాఖపట్నం చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు వాల్తేర్ క్లబ్ లో జరిగే రమణ బాబు కుమారుని వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం విశాఖపట్నం నుండి విజయవాడ వెళతారు.



### జగన్మోహన్ రెడ్డి కి ఘనస్వాగతం

విశాఖపట్నం, మార్చి 5 ప్రభాతవార్త

నగరంలో వివాహ కార్యక్రమం తో పాటు పాడేరులో కార్యక్రమానికి పాల్గొనేందుకు వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుధవారం నగరానికి వచ్చారు. ఆ పార్టీ అధ్యక్షులు కేకే రాజు ఘనస్వాగతం పలికారు. ఆయనతోపాటు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు విమానా సానికి చేరి జగన్మోహన్ రెడ్డికి అనుకూల నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు.

## థాయిలాండ్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు గాజువాక క్రీడాకారులు

గాజువాక, మార్చి 4,ప్రభాతవార్త



థాయిలాండ్‌లో ఈనెల 5 నుంచి 8 వరకు జరిగే 30వ 'మాస్టర్స్ అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ మీట్'లో పాల్గొనడానికి గాజువాక ప్రాంతానికి చెందిన అథ్లెట్లు సిద్ధమయ్యారు. డి.వి. భాస్కర రాజు, శివరామరెడ్డి, జి.సీతారామ్, డా. మంగ వరప్రసాద్ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. విశేషంగా, భారత జట్టు మేనేజర్‌గా డా.మంగ వరప్రసాద్ ఎంపిక కావడం గమనార్హం. వయసుతో సంబంధం లేకుండా అంతర్జాతీయ వేదికపై విశాఖ ప్రతిష్ఠను చాటాలని క్రీడాకారులు సంకల్పించారు.

## వైభవంగా శ్రీ గౌర పూర్ణిమ మహోత్సవం

ఆనందపురం, మార్చి 4, ప్రభాతవార్త:




శ్రీ చైతన్య మహా ప్రభు జయంతి ఉత్సవాలలో భాగం గా మండలంలోని గంభీరంలోని హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం శ్రీ గౌర పూర్ణిమ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వ హించారు. శ్రీచైతన్య మహాప్రభు, శ్రీ నిత్యానంద ప్రభు విగ్రహాలను సుందరంగా అలంకరించిన పల్లకీ సేవ నిర్వ హించారు. వేద మంత్రోచ్చారణల నడుమ పంచ గవ్యములు, సప్త నదుల జలాలు, వివిధ రకాల పుష్ప ములు, వివిధ ఫలాలు వాటి రసాలతో మహా అభిషేకం నిర్వహించి అనంతరం అభిషేక జలాలను భక్తులకు పంపిణి చేశారు. డాక్టర్ నిష్కించిన భక్త దాస భక్తులకు శ్రీ చైతన్య మహా ప్రభు జీవిత విశేషాలను సంకీర్తన ప్రాముఖ్యతను వివరించారు. పూలతో నిర్వహించే హోలీ ఉత్సవం ఈ వేడుకలో ఆకర్షణగా నిలుచింది.

## కోరమండల్ మెయిన్‌గేట్ వద్ద జనరల్ బాడీ సమావేశం




గాజువాక, మార్చి 4,ప్రభాతవార్త

పారిశ్రామిక ప్రాంతంలోని కోరమండల్ మెయిన్‌గేట్ వద్ద బుధవారం ఉదయం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. చుక్క సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జె.వి. సత్య నారా యణమూర్తి హాజరై మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై యూనియన్ నాయకులు, కాంట్రాక్టర్లతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. సామరస్య వాతావరణంలో చర్చలు జరుగుతున్నప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులకు ఎలాంటి అన్యాయం జరిగినా సహించబోమని యాజమాన్యానికి హెచ్చరిక జారీ చేశారు. జీతభత్యాల విషయంలో అన్యాయం జరిగితే కార్మికులందరినీ కలుపుకొని కరోమాండల్ ఇంటర్నేషనల్ సంస్థను ముట్టడిస్తామని స్పష్టం చేశారు.సమావేశంలో యూనియన్ నాయకులు శంకర్రావు, ప్రకాష్‌రావు, మహాలక్ష్మి పారిశ్రామిక ప్రాంత యూనియన్ నాయకులు గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వాసుపల్లి ఇంటికి జగన్

**ఘన స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే గణేశ్ కుమార్ -నూతన వధూవరులు సాకేత్, శ్రావణి దంపతులకు ఆశీర్వాదాలు- దక్షిణ నేతలతో మాటామంతి -భవిష్యత్తు వైసిపిదేనన్న జగన్**

విశాఖపట్నం, మార్చి 4,ప్రభాతవార్త



ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విశాఖ దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఇంటిని సందర్శించారు. ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. మహిళలు హారతులిచ్చి పూలాభిషేకం చేశారు. జై జగన్.. సీఎం అంటూ వాసుపల్లి నివాసం వద్ద అశేష జనవాహిని కి జగన్మోహన్ రెడ్డి అభివాదాలు తెలిపారు. ముందుగా ఇటీవల వివాహం చేసుకున్న వాసుపల్లి రెండో కుమారుడు సాకేత్ , శ్రావణి లను ఆయన ఆశీర్వదించారు. వాసుపల్లి కుటుంబ సభ్యులతో ఫోటో దిగారు. అనంతరం వైసీపీ నేతలతో ఆయన మాటమంతి తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పై స్పందించి, ప్రజల తరఫున పోరాటం చేయాలని పేర్కొన్నారు. చివరగా మనం ప్రజల మంచి కోసమే పోరాటం చేయాలని అన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజి పడవద్దు అని చెప్పారు. అలాగే పార్టీ బలోపేతానికి కూడా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించాలన్నారు. కార్యకర్తలు అందరిని కలుపుకొని వెళ్లాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నియంతత్వ పోకడలకు శ్రీకారం చుట్టిందని, పార్టీ నేతలపై కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ, బెదిరింపులకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. ఎవరు అధైర్య పడవద్దు అని చెప్పారు. భవిష్యత్తు వైసిపిదే అని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు ప్రజలతో మమేకమవుతూ, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ కన్నబాబు, మాజీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యేలు ధర్మాన ప్రసాదరెడ్డి, గొల్ల బాబురావు, తైనాల విజయ్ కుమార్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, వైయస్సార్సీపీ నేతలు పేడాడ రమణకుమారి, ఆల్ఫా కృష్ణ, కార్పొరేటర్లు, దక్షిణ వార్డు అధ్యక్షులు సీనియర్ నాయకులు అనుబంధ సంఘాల అధ్యక్షులు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

**నగర మేయర్ పీలా శ్రీనివాసరావు**

విశాఖపట్న, మార్చి 4, ప్రభాతవార్త :



నగర పరిధిలో పెండింగ్ లో ఉన్న పలు ఇంజ నీరింగ్ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.వి.సత్యనారాయణ రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్లతో నగరంలో చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు వార్డులలో చేపడుతున్న పనులు చాలా వరకు పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని కోరినందున ప్రత్యేకించి ఈ సమీక్ష నిర్వహించవలసి వచ్చిందని మేయర్ ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. విశాఖ నగర అభివృద్ధికి ఇంజనీరింగ్ విభాగం కీలకమని, నగరంలో చేపడుతున్న ఇంజనీరింగ్ పనుల్లో చాలా వరకు పెండింగ్లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన చేపట్టి నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి జోన్ లో పనులు మందకొడిగా సాగుతున్నాయని, పనులను వేగవతం చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించాలని మేయర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే వార్డులలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల యొక్క పనులు చేస్తున్నప్పటికీ ఆ పనులకు సంబంధించి శిలాఫలకాలను ఆ ప్రాంతాలలో ఏర్పాటు చేయడం లేదని సభ్యులు తెలిపారని, ప్రతి అభివృద్ధి పనులకు శిలాఫలకం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు సమృద్ధిగా పరిశుభ్రమైన తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు.

ong-12_ong-12.qxd 3/5/2026 12:10 AM Page 1



## లారీ ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు, ఇద్దరు స్వల్ప గాయాలు..

**ఎలమంచిలి, మార్చ్ 04, (ప్రభాతవార్త):**
జాతీయ రహదారి రేగుపాలెం సమీపంలో అనకాపల్లి వైపు వెళ్తున్న ఆటోను వెనక నుండి లారీ ఢీ కొట్టిన సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు, ఇద్దరికీ స్వల్ప గాయాలు అయినట్లు రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం తుని వైపు నుండి అనకాపల్లి వైపు వెళ్తున్న ఆటో ను అదే మార్గంలో అనకాపల్లి వైపు వెళ్తున్న లారీ వెనక నుండి ఢీకొనడంతో ఆటో నడుపుతున్న డ్రైవర్ కు మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం 108అంబులెన్స్ ద్వారా అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించినట్లు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపారు.

## సిరసపల్లి నుండి కొప్పాక వరకు డ్రైనేజీ 2 కోట్లుతో నిర్మాణం

- కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి నీలబాబు



**అనకాపల్లి మార్చి 4: (ప్రభాత వార్త)**
సిరసపల్లి నుండి కొప్పాక వరకు జాతీయ రహదారి ని అనుకొని ప్రధాన డ్రైనేజీ కాలువ నిర్మాణానికి జీవీఎంసీ నుండి రెండు కోట్లు నిధులు మంజూరైనట్లు 84 వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి నీలి బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే పక్కన కాలువ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యపై జీవీఎంసీ కౌన్సిల్లో మేయర్ ప్రధాన కమిషనర్ కు వివరించడంతో రెండు కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి సన్యాసిరావు వానపల్లి బాబురావు బోయిన మురళి జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు



**(ఎస్ రాయవరం మార్చి 4 ప్రభాతవార్త)**
అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగమ్ కుమారుడు వివాహ వేడుకకు హాజరైన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డిని బుధ వారం మాజీ శాసనసభ్యులు పాయక రావు పేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## సెన్సస్-2027 నిర్వహణకు పూర్తిస్థాయిలో అధికారులు సిద్ధం కావాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు



**అనకాపల్లి, మార్చి 4 (ప్రభాతవార్త):**
జిల్లాలో సెన్సస్-2027 (జనగణన) కార్యక్రమాలను పూర్తిగా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ విజయ క్రిష్ణన్ వారి ఉత్తర్వుల మేరకు బుధవారం ఉదయం అనకాపల్లి పట్టణంలో డైట్ ఇంజనీరింగ్ కాలేజీలో జిల్లా గణన అధికారులకు మూడు రోజులపాటు (మార్చి 4 నుండి 6 మార్చి 2026 వరకు)ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో భారత జనాభా గణన2027 (తొలి దశ) సన్నాహాలు వేగవంతం చేయాలన్నారు. శిక్షణా కార్యక్రమాలు ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా తరగతులలో జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు ఉన్న వివిధ విభాగాల అధికారులు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 2011 సంవత్సరం తర్వాత మరల ఇప్పుడు జిల్లాలో సెన్సస్-2027 (జనగణన) చేపడుతున్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఇటువంటి డివియేషన్లు రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి జిల్లా స్థాయి నోడల్ అధికారులు పాల్గొంటారని, తహశీల్దార్లు (ఛార్జ్ సెన్సస్ ఆఫీసర్స్), మున్సిపల్ కమిషనర్లు ఎం.పి.డి.ఓ.లు., డిప్యూటీ తహశీల్దార్లు, టెక్నికల్ అసిస్టెంట్లు డిజిటల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలకు అనధికారికంగా గైర్హాజరైన వారిపై జనాభా గణన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో సెన్సస్ జాయింట్ డైరెక్టర్ దయాసాగర్, మున్సిపల్ కమిషనర్లు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు రాజముద్ర పాస్ పుస్తకాల అందజేత



**(రాంబిల్లి మార్చి 4, ప్రభాతవార్త)**
రాంబిల్లి మండలం జెడ్ చింతువా శివారు వెంకయ్యపాలెం, గజ రెడ్డిపాలెం, లోవపాలెం గ్రామాలలో బుధవారం రాజముద్ర కలిగిన పాసుపుస్తకాలు అధికారులు రైతులకు అందజేశారు, ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాజ ముద్ర పాస్ పుస్తకాల ద్వారా రైతులకు భూమికి సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదు అవుతాయని తెలిపారు, భూమి హక్కులను రక్షించడంలో మరియు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఈ పాస్ పుస్తకాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు, 290 మంది లబ్ధిదారులకు రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు వచ్చాయని ఇందులో 230 పాసు పుస్తకాలు రైతులకు అందజేశామని అన్నారు, మిగిలిన రైతులు అందుబాటులో లేరని చెప్పారు, ఈ కార్యక్రమంలో వీఆర్వో జి.రమణ వీఆర్‌ఏ రాము మరియు రైతులు పాల్గొన్నారు.

## మహిళలకు స్వీయ రక్షణ పై అవగాహన

**(ఎస్ రాయవరం మార్చ్ 4 ప్రభాతవార్త)**



మండలంలో కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా 9.10 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు స్వీయ రక్షణపై అవగాహన. శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ రామకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మహిళలు స్వీయ రక్షణ పై అవగాహన కలిగి శారీరక దృఢత్వం తో ఉండాలని. ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో ఏ ఎస్ ఐ వెంకటేశ్వర్లు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కప్పల ప్రసాద్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహన తనిఖీలు



**గొలుగొండ మార్చి 4, ప్రభాతవార్త**
మండలంలో చీడిగుమ్మల వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో చీడిగుమ్మల వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు వాహనాల రాకపోకలను గమనిస్తూ తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లను క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గొలుగొండ ఏఎస్ఐ అప్పారావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కసిమిలో సిసి రోడ్ నిర్మాణ పనులు ప్రారంభం



**గొలుగొండ మార్చి 4 ప్రభాతవార్త**
కాసిమి పంచాయతీలో సి సి రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రెండో విడతలో కేటాయించిన నిధులతో రెండవ కాశంలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందు గాను ఆరు లక్షల 50 వేల రూపాయలు నిధులు మంజూరయ్యాయని గ్రామ పార్టీ అధ్యక్షుడు కవల మహేష్ తెలిపారు. ఈ నిధులతో మూడు రోడ్ల నిర్మాణం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ బుచ్చిబాబు, సీనియర్ నాయకులు జి బాబురావు, ముఖ్య కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు

## మహిళలు అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుండాలి

- ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండండి- ఎస్సై నాగ కార్తీక్



**చోడవరం, మార్చి 4, ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థినులకు "ఆత్మరక్షణ మెలుకువలు"పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం చోడవరం బాలికల ఉన్నత పాఠశాలలో చోడవరం సీఐ అప్పలరాజు ఆదేశాలు మేరకు పోలీస్ అధికారులు, మార్షల్ ఆర్ట్స్ నిపుణులతో కలిసి విద్యార్థినులకు ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించి, అత్యవసర పరిస్థితుల్లో తమను తాము ఎలా రక్షించు కోవాలో వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగకార్తీక్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుండాలని, ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీ భద్రత కేవలం చట్టాల ద్వారానే కాకుండా, వారిలో పెరిగే ఆత్మవిశ్వాసం ద్వారా కూడా సాధ్యమవుతుందన్నారుప్రతి విద్యార్థిని చిన్నతనం నుంచే ఆత్మరక్షణ మెలుకువలను నేర్చుకోవాలన్నారు. ఆపద సమయంలో భయం వీడి, ధైర్యంతో ఎదురుదాడి చేయడం ద్వారా తమను తాము రక్షించుకోవచ్చన్నారు. పోలీస్ యంత్రాంగం ఎప్పుడూ మహిళల భద్రతకు పెద్దపీట వేస్తుందనీ శిక్షణ కార్యక్రమాలు విద్యార్థినుల్లో ధైర్యాన్ని నింపుతాయని మార్షల్ ఆర్ట్స్ నిపుణులతో విద్యార్థినులకు నేరుగా చేసి చూపించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డయల్ 100/112ఖి వినియోగంపై అవగాహన. ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలని ఎస్సై నాగకార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థుల సమగ్ర వివరాలను దృష్టి సాఫ్ట్వేర్‌లో అప్డేట్ చేయండి



**చోడవరం, మార్చి 4, ప్రభాతవార్త**
చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఉన్న దివ్యాంగ విద్యార్థుల భవిత కేంద్రాన్ని బుధవారం రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్య ప్రాజెక్టు దృష్టి రాష్ట్ర పరిశీలకులు బొడ్డు మహాలక్ష్మి నాయుడు పర్యవేక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల వివరాలన్నింటినీ దృష్టి సాఫ్ట్వేర్ లో అప్డేట్ చేయాలన్నారు. దీనివలన దివ్యాంగ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా అన్ని రకాల సేవలు మరియు సదుపాయాలను కల్పించవచ్చని, విద్యా బోధనను కూడా డిజిటల్ లో సులభంగా బోధించవచ్చని అన్నారు.అలాగే పాఠశాల స్థాయి నుంచి జిల్లా రాష్ట్రస్థాయి అధికారులు దివ్యాంగ విద్యార్థులకు సేవలు, సదుపాయాలు ఏ విధంగా అందుతున్నాయో, బోధనను ఎటువంటి బోధనా పద్ధతుల ద్వారా అందిస్తున్నారో సులభంగా పర్యవేక్షణ చేయవచ్చని అన్నారు. అలాగే రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు సత్యనారాయణ రమేష్ పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం

**నర్సీపట్నం,మార్చి 4,ప్రభాతవార్త**



నర్సీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు అప్పన ఎన్ఎస్ జీ. దొరబాబు ఆధ్వర్యంలో ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదును చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ సాదక్లు అందరూ గతం కంటే ఎక్కువ సభ్యత్వాలు నమోదుచేసి పార్టీ బలాన్ని తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ సభ్యత్వాలు పెంచడం ద్వారా రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. జనసేన సభ్యత్వం నమోదు వలన రూ.5లక్షల ప్రమాద బీమా అనేది మొట్టమొదటిసారిగా జనసేన పార్టీ పెట్టడం జరిగిందన్నారు. ఇది కేవలం పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించడం కోసం జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని వివరించారు. ఈ సభ్యత్వం నమోదుకు మార్చి 10 చివరి తేదీ అని, కావున సభ్యత్వ నమోదుకు ఒక్కొక్కరికి 400 చొప్పున చెల్లించి సభ్యత్వం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సభ్యత్వం తీసుకున్న వారిని ఉద్యమి అనే పేరుతో పిలవబడతారని, వీళ్ళు నియోజకవర్గంలో ఉన్న సాదక్ దగ్గర సభ్యత్వ నమోదు చేసుకోవలసి ఉంటుందని అన్నారు. ఇది ప్రతి ఒక్క ఉద్యమికి పార్టీ నుంచి భరోసా కోసం ఈ కార్యక్రమం అనేది చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ ప్రెసిడెంట్ అద్దేపల్లి గణేష్, నాయకులు మీసాల సత్యనారాయణ, మారిశెట్టి రాజా, లంక సత్యనారాయణ, పోతల గణేష్, ఈశ్వర్, బద్రి, నానాజీ, అనిమిరెడ్డి నాయుడు, సుకల నాని, నాలుగు మండలాల జనసైనికులు పాల్గొన్నారు.

## నాతవరంలో ఉత్సాహంగా జనసేన ఉద్యమి కార్యక్రమం

**నర్సీపట్నం,మార్చి 04,ప్రభాతవార్త**
జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉద్యమి(క్రియాశీలక సభ్యత్వ నమోదు) కార్యక్రమం చురుగ్గా జరుగుతుంది.ఇందులో భాగంగా బుధవారం జనసేన పార్టీ నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ ఆధ్వర్యంలో నాతవరం మండల కేంద్రంలో ఉద్యమి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి, వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానికంగా ఉన్న గ్రామస్తులు స్వచ్ఛందంగా క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంకు నియోజకవర్గంలో విశేష స్పందన వస్తుందన్నారు. స్వచ్ఛందంగా ప్రజలు జనసేన పార్టీలో భాగస్వాములు అవుతూ సభ్యత్వాలను నమోదు చేసుకుంటున్నారని చెప్పారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని లక్ష్యంగా పెట్టుకుని జనసేన సభ్యత్వ డ్రైవ్ నిర్వహిస్తుందన్నారు. క్రియాశీలక సభ్యత్వ రుసుము 500 నుంచి 400కు తగ్గించిందని చెప్పారు. సభ్యత్వ రుసుమును కార్యకర్తల సంక్షేమం, ఇన్సూరెన్స్ కోసం వినియోగిస్తుందన్నారు. సభ్యులకు రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తుందని, శాశ్వత వైకల్యం కలిగితే 2 లక్షల బీమా, ప్రమాదానికి గురైతే రూ.50 వేల బీమా సాయం అందించేలా జనసేన ముందుకు సాగుతుందని వివరించారు.సభ్యత్వాన్ని మూడు వర్గాలుగా జనసేన పార్టీ విభజించిందని, ఉద్యమి, సాధక్, ప్రదాతగా సభ్యుల వర్గీకరణ చేసిందని, పార్టీ సిద్ధాంతాల ప్రచారం, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు సూరిశేఖర్, మాకిరెడ్డి వెంకటరమణ, గుడివాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## డీఎస్పీ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు



**నర్సీపట్నం,మార్చి 4,ప్రభాతవార్త**
నర్సీపట్నం డీఎస్పీ కార్యాలయం గేటు ముందు డీఎస్పీ పీ.శ్రీనివాసరావు బుధవారం వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై మొత్తం 9 కేసులు నమోదు చేశారు. అనంతరం వాహనదారులకు డీఎస్పీ అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించి సురక్షితంగా వాహనాలు నడపాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగితే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై రమేష్ పాల్గన్నారు.

## ఆత్మరక్షణ మెలుకువలపై శిక్షణా కార్యక్రమం




**నర్సీపట్నం,మార్చి 4,ప్రభాతవార్త**
మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ పీ.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు టౌన్ సీఐ షేక్ గఫూర్ ఏపిఎస్ఆడబ్ల్యూఆర్, జూనియర్ కళాశాల విద్యార్థినీలకు మహిళల స్వీయ రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నర్సీపట్నం డిగ్రీ కాలేజీకి చెందిన జాతీయ స్థాయిలో కరాటే పోటీలలో పాల్గన్న మోనిక బాలికలకు స్వీయ రక్షణ పద్ధతులను ప్రాక్టికల్గా వివరించారు. అలాగే మహిళా విద్యార్థినులకు డయల్ 112 అత్యవసర సేవలు, షీ టీమ్స్, శక్తి యాప్, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై సీఐ అవగాహన కల్పించారు. ఎలాంటి వేధింపులు లేదా సమస్యలు ఎదురైన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్ను కలిసిన మాజీ ఎమ్మెల్యే గణేష్



**నర్సీపట్నం,మార్చి 04,ప్రభాతవార్త**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలో మంగళవారం నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ కమిటీ నిర్మాణంలో రాష్ట్రంలోనే నర్సీపట్నం తొలిస్థానంలో ఉండటంతో ఉత్తరాంధ్ర జోనల్ ఇన్చార్జ్ హర్షవర్ధన్ రెడ్డితో పాటు నర్సీపట్నం నియోజకవర్గం మండల పార్టీ అధ్యక్షులతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ కమిటీ నిర్మాణంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండటంపై వైయస్.జగన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ను . ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో పని చేయాని త్వరలో నర్సీపట్నం నియోజకవర్గం పార్టీ నాయుకులు అందరితో ఒక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వైయస్.జగన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షులు ఏకా శివ, నర్సీపట్నం మండల అధ్యక్షులు శానాపతి వెంకటరత్నం, గొలుగొండ మండల అధ్యక్షులు పాణి శాంతారావు, నాతవరం మండల అధ్యక్షులు లగుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## గూడుపమ్మను దర్శించుకున్న ప్రముఖ వ్యాపారవేత్త "మల్లిబాబు"





**(నక్కపల్లి, ప్రభాతవార్త)**
పాయకరావుపేటతుని క్యాష్యూ మాన్యు ప్యాక్చరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నంది మల్లిఖార్జునరావు (మల్లిబాబు) బుధవారం రాత్రి రేబాక గూడుపమ్మ తల్లిని దర్శించు కున్నారు. అమ్మవారి ఆలయంలో ఆయన గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీసూక్తం, దుర్గా సూక్తంతో పూజలు చేసి, హారతులిచ్చారు. ఆలయ ధర్మకర్త గొట ముక్కల శ్రీహరిరాజు, గ్రామ పెద్ద సాదిరెడ్డి నారాయణమూర్తి ఆయనకు అమ్మవారి శేషవస్త్రాన్ని, చిత్రపటాన్ని బహూకరించారు. వారి వెంట బోసు,రాజేష్,రమేష్,కోశెట్టి వరహాలరావు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ హెచ్‌ఏఐ ప్రత్యేక దృష్టి..

- విద్యుత్ కాంతులతో కలకలాడుతున్న నక్కపల్లి.!





**(నక్కపల్లి, ప్రభాతవార్త)**
జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్ హెచ్ ఏఐ యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఆ సందర్భంగా నక్కపల్లి జాతీయ రహదారిపై బుధవారం ప్రధాన జంక్షన్లో వద్ద ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులతో కళకళలాడుతుంది. పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి నుంచి కాకినాడ జిల్లా అన్నవరం వరకూ గుర్తించిన 150 బ్లాక్ స్పాట్లలో సోలార్ లైట్లు ఏర్పాటు చేసే పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ హైవే జంక్షన్ వద్ద సోలార్ ఎత్తయిన స్తంభాలతో కూడిన సోలార్ లైట్లను ఎక్సకవేటర్ల సాయంతో అమర్చారు. నక్కపల్లి హైవే పరిధిలో 16 సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మండలంలోని కాగిత, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండపురం, గొడిచెర్ల, ఒడ్డిమెట్ట హైవే బ్లాక్ స్పాట్ల వద్ద కూడా వీటిని ఏర్పాటు చేస్తారు. దీని వల్ల ప్రజలు, ప్రయాణీకులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## భూమి మీది భరోసా ప్రభుత్వానిది

- మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ



**ముంచంగిపుట్టు మార్చి 4 (ప్రభాతవార్త)**
అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం కరీముఖిపుట్టు పంచాయతీ. గేదెల బంధ గ్రామం లో మీ భూమి మీ హక్కు కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ బుధవారం పార్టీ నాయకులతో కలిసి రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతు ఫోటోతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందించి వారి గౌరవాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెంచారాని, భూములు రీ సర్వే పూర్తయిన రైతులకు కూటమి ప్రభుత్వం శాశ్వత పట్టాలను ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్‌తో ఉన్న పాస్ పుస్తకాలను పారదర్శకంగా ప్రభుత్వం రూపొందించి రైతులకు భరోసా ఇచ్చిందని , కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం రైతు ల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో ముంచంగిపుట్టు మండలం టీడీపీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, తోపాటు మాజీ అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పాంగి శాస్త్రి బాబు, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ రాణాసింగి నిలకంఠం పాత్రో, మండల ఉప కోశాధికారి కిరసాని పద్మనాభం, సర్వేయర్ పెనుమలి ప్రసాద్, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మసీదు ప్రార్ధనల్లో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి,కిమిడి



గరివిడి మార్చి,4 ప్రభాతవార్త

రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షల్లో భాగంగా గరివిడి ప్రధాన రహదారి లో గల జమియా మస్జీద్ ఈ అహలే హాదీస్ మసీదులో విజయ నగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పల నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ఇతర టీడీపీ నాయకులతో కలసి ప్రార్ధనలు చేశారు. ముస్లిం సోదరులకు అల్లా ఆశీస్సులు అందాలని కలిశెట్టి, కిమిడిలు కోరారు. ప్రార్ధనల్లో ముస్లిం పెద్దలు మహమ్మద్ రఫాతుల్లా, ఈనై తుల్లా,సయ్యద్ గౌసుద్దీన్, షఫీతో పాటు గరివిడి మాజీ ఎంపీపీ పైల బలరాం, మండల టిడిపి అధ్యక్షుడు ఎస్.సురేష్, మండల టీడీపీ నాయకులు తూట శ్రీను, శీరపు శ్రీను, గొట్టిముక్కల సత్తిరాజు, బొడ్డేపల్లి ప్రసన్న కుమార్, సూరప్పడు, దుక్క రామకృష్ణ, సత్యం ప్రభృతులు పాల్గొన్నారు. ముస్లిం పెద్దలు ఎంపీ కలిశెట్టి, రామ్ మల్లిక్ నాయుడులకు దుస్సాలువతో సత్కరించారు.

## పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు..

**కష్టపడుతునే వస్తున్నారు.కానీ ఫలితం లేదు.. ఒక్క నామినేటెడ్ పదవి కూడా దక్కలేదు.. ఆయనే వబ్బిన..**

శృంగవరపుకోట,మార్చి4, ప్రభాతవార్త..



పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు.పార్టీ బలో పేతానికి కృషి చేస్తునే వస్తున్నారు.కానీ ఫలితం లేదు. ఒక్క నామినేటెడ్ పదవి కూడా దక్కలేదు. ఆయనే వబ్బిన సత్యనారాయణ.ఈయన ఎస్. కోట మండలంలోని తిమిడి గ్రామానికి చెందిన వ్యక్తి.వబ్బిన చదువుకున్న రోజుల్లో నుంచి పవన్ కళ్యాణ్ అభిమాని. 2014లో పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో జనసేన పార్టీని ఏర్పాటు చేశారు.అప్పుడే వబ్బిన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు.అప్పటి నుంచి ఎస్.కోట నియోజకవర్గంలో జరిగిన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు.ఆయన చేసిన కృషికి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ 2024లో జరిగిన ఎన్నికల్లో ఎస్.కోట నియోజకవర్గానికి ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు.అదేవిధంగా ఉత్తరాంధ్ర జోన్ ఎలక్షన్ కన్వీనర్ బాధ్యతలు కూడా చేపట్టారు.అప్పటి నుంచి ఇప్పటి వరకు వబ్బిన నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తునే ఉన్నారు.అయినా వబ్బినకు ఒక్క నామినేటెడ్ పదవి దక్కకపోవడం గమనార్హం.ప్రస్తుతం రాష్ట్రం మొత్తం మీద అన్ని నియోజకవర్గాల్లో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుంది.ఈక్రమంలో భాగంగా ఎస్.కోట నియోజకవర్గంలో సుమారు 15వేల మందిని పార్టీలో చేర్పించే విధంగా సభ్యత్వం నమోదు చేయాలని పార్టీ అధినేత నుంచి టార్గెట్ వచ్చినట్లు సమాచారం.ఇక నియోజకవర్గ ఇంచార్జ్ వబ్బిన ప్రస్తుతం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ పార్టీని ముందుకు నడిపిస్తున్నట్లు తెలుస్తుంది.మరి రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న వబ్బినకు పార్టీ అధినేత ఏబహుమతి ఇస్తారో నియోజకవర్గ జనసైనికులు వేచి చూడాలి మరి.

## విద్యార్థినిలకు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన : టౌన్ సీఐ



సాలూరు మార్చి 4 ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలో ఉన్న స్కూల్స్ లో విద్యార్థినిలకు సెల్ఫ్ డిఫెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించామని టౌన్ అప్పలనాయుడు తెలిపారు. బుధవారం ఆయన తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.గర్ల్స్ హై స్కూల్ ఇకా మహత్మగాంధీ జ్యోతిరావ్ పూలే పాఠశాల విద్యార్థినిలకు తనని తాను రక్షించుకొనే సెల్ఫ్ డిఫెన్స్ పై శిక్షణ ఇప్పించమన్నారు. అలాగే ఎమర్జెన్సీలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఇంకా ధైర్యం అలాగే ఆత్మవిశ్వాసంతో సమస్యలు ఎలా ఎదుర్కోవాలో పలు సూచనలు చేసామన్నారు.అంతేకాకుండా మహిళల సంబందించిన భద్రతకు చట్టపరమైన పోలీస్ రక్షణ ఎలా ఉంటుందో వివరించామని సీఐ క్లారిటీ ఇచ్చారు.స్కూల్ హెచ్.ఎం, ఉపాధ్యాయులు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు మహిళలకు పెరటికోళ్లు పంపిణీ

చీపురుపల్లి మార్చి 4, ప్రభాతవార్త



చీపురుపల్లి మండలంలోని స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలకు బుధవారం నాడు చీపురుపల్లి మండలసమాఖ్య కార్యాలయం వద్ద ఆశీల్ పెరటికోళ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 11 పెరటి కోళ్లు ఒక యూనిట్ గా గుర్తించారు. ఒక యూనిట్లో 3 పుంజులు, 8 పెట్టలు ఉంటాయి. వీటి ధర 4500 రూపాయలు గా నిర్ణయించి ఒక కిలో బరువు గల కోళ్లు పంపిణీ చేయడం జరిగింది . స్వయం సహాయక సంఘాల గ్రూపులలో గల సభ్యులు కి పంపిణీ చేశారు. సంఘాల సభ్యులు వీటిని పెంపకం చేయడం ద్వారా ఆదాయ అభివృద్ధిని సాధించగలరని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం ఎన్ అప్పలనాయుడు ,పశుశమ్వర్ధక శాఖ డాక్టర్ సిహెచ్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన లబ్ధిదారులకు సూచనలు చేశారు. కోళ్లు కి అవసరమైన మందులు 20 కేజీల దానా అందజేయడంతో పాటు , అవి ఉపయోగించే విధానం గూర్చి వివరించారు.. వేటరానరీ అసిస్టెంట్ సర్జన్ ఎల్. వాసుదేవరావు సీసీలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## స్మశానవాటిక పనులను పరిశీలించిన ఉపాధిహామీ : పిడి శారదా దేవి



దత్తిరాజేరు మార్చి 4ప్రభాతవార్త

మండలంలోని ఇంగిలాపల్లి గ్రామంలో స్మశాన అభివృద్ధి మరియు సిసి రోడ్డు పనులను జిల్లా ఉపాధి హామీ అభివృద్ధి అధికారి ఎస్ శారదా దేవి బుధవారంపరిశీలించారు ముందుగా మండల ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించి సాంకేతిక గదిలో ఉన్న రికార్డులను పరిశీలించారు అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మండలంలో ఉపాధి పనులు మరియు ఎనర్జీ ఎన్ ఆర్ జి ఎస్ పనుల గురించి ఏ పీ ఓ కామేశ్వరరావుని అడిగి తెలుసుకున్నారు పనుల్లో ఎటువంటి జాబ్ లేకుండా జరిపించాలని తెలిపారు వేతన దారులకు శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని సూచించారు సిమెంట్ పనుల్లో నాణ్యత తప్పకుండా చూడాలని కొలతలో తేడా ఉండకూడదన్నారు ఆమె వెంట ఏపీవో కామేశ్వరరావు ఇంజనీరింగ్ జేఈ రమణ టి ఏ టిడిపి నాయకుడు రవి పాల్గొన్నారు

## లిక్కర్ అండ్ డ్రగ్స్ నిర్మూలన పై అవగాహన : ఎక్సైజ్ సీఐ

సాలూరు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



సాలూరు మండలం జనవరివలస గ్రామంలో మద్యం అలాగే మత్తు పదార్థాలు (లిక్కర్ అండ్ డ్రగ్స్) నిర్మూ లనపై ప్రజలకు అవగాహన కల్పిం చామని ఎక్సైజ్ సీఐ దాస్ స్థానిక విలేకరులకు తెలిపారు. ఆయన తెలియజేసిన వివరాలు ప్రకారం మద్యానికి బానిసగా మారడం వలన ఆర్థిక పరంగా నష్టపోయి కుటుంబాలు నాశనం అవుతాయన్నారు.అలాగే ఆరోగ్యం చెడిపోయి హాస్పిటల్ పాలు అవుతారని స్పష్టం చేశారు.అంతేకాకుండా ఈ మధ్యన డ్రగ్స్ కు బాగా యువత ఎడిక్ట్ అవుతున్నారని దీంతో దేశానికి వెన్నుముక లాంటి యువకుల జీవితం సర్వనాశనం అవుతుందని క్లారిటీ ఇచ్చారు. అందుకే లిక్కర్ అండ్ డ్రగ్స్ కు అందరు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ రవి ప్రసాద్ ఇంకా సిబ్బంది పాల్గొన్నారు.

## కొండ గుంపాం విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల మార్చి 4 ప్రభాతవార్త




విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, అవగాహన పెంపొందిం చుటకు విజ్ఞాన వారోత్సవాలులో భాగంగా స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థులకు మండల స్థాయి పోటీలు బుధవారం నిర్వహిం చారు. ఈ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొండగుంపాం విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. స్థిరమైన అభివృద్ధికి శాస్త్రం, సాంకేతికత కీలకం అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలలో (6--8 తరగతులు) విభాగంలో కొండ గుంపాం పాఠశాల 7వ తరగతికి చెందిన బి. తనుశ్రీ, 8వ తరగతి చెందిన పి.ప్రణీత, ఫ్యాన్సీ డ్రస్- శాస్త్రవేత్తలు విభాగంలో 6వ తరగతికి చెందిన పి . శాలిని మండల స్థాయి విజేతలుగా నిలిచారు. దైనందిన జీవితంలో విజ్ఞాన శాస్త్రం - అనే అంశంపై జరిగిన సదస్సులో 8వ తరగతికి చెందిన బి మేఘన, దైనందిన జీవితంలో విజ్ఞాన శాస్త్రం విభాగములో కొండ గుంపాం పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయులు పి. సత్య ప్రకాష్ మండల స్థాయిలో విజేతలుగా నిలిచారు. అన్ని విభాగాల విజేతలు ఈనెల 7వ తేదీన జరగనున్న జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారు. విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయుడు సత్య ప్రకాష్ ను, విద్యార్థులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ అభినందించారు.

## ఛలో విజయవాడకు సమగ్రశిక్షా సిబ్బంది



నెల్లిమర్ల, మార్చి 4, ప్రభాతవార్త

ఈ నెల 6వ తేదీన జరగనున్న సమగ్రశిక్షా ఉద్యోగులు చేపడుతున్న ఛలో విజయవాడ కార్యక్రమానికి నెల్లిమర్ల ఎంఆర్సి సిబ్బంది సిద్ధం కానున్నారు. ఈ మేరకు బుధవారం మండల విద్యాశాఖాధికారి ఉపాధ్యాయుల సూర్యనారాయణ మూర్తి కి మాస్ లీవ్ మంజూరు కోసం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్వ శిక్ష ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ సభ్యులు ఆరికతోట రామకృష్ణ మాట్లాడుతూ సమగ్రశిక్షాలో పని చేస్తున్న 18 విభాగాల ఉద్యోగులకు గత 7 సంవత్సరాలుగా జీతాలు పెరగలేదని తెలిపారు. అలాగే గత ప్రభుత్వం ఎంటిఎస్ ఇస్తామని హామీ ఇచ్చి కాలయాపన చేశారన్నారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమగ్రశిక్షా ఉద్యోగులకు ఎంటిఎస్ ఇస్తామని హామీ ఇచ్చి నేటికి ఆ విషయంపై స్పందించలేదని తెలిపారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర జేఏసీ ఇచ్చిన ఛలో విజయవాడ కార్యక్రమం పిలుపు మేరకు సమగ్రశిక్షా ఉద్యోగులు అందరూ విజయవాడ కు వెళ్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్డిఎ ఎన్. భారతి, ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్ ఎం. ప్రశాంతి, మెస్సెంజర్ గోవిందమ్మ పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు - డియివో

విజయనగరం-ప్రభాతవార్త



ఈనెల 16 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జరగనున్న తర్వాత పరీక్షలకు ప్రశాంతంగా నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు డిఇవో మాణిక్యం నాయుడు తెలిపారు రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు చక్కగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని కోరారు టీవీలకు సెల్ఫోన్లకు ఇతర పనులకు దూరంగా ఉండాలని విద్యార్థులు సూచించారు చీఫ్ సూపర్డెంట్ డిపార్ట్మెంట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు జిల్లాలో 119 కేంద్రాలు ఏర్పాటు చేశామని 440 పాఠశాల నుంచి 22 వేల 961 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు వ్రాయనున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో మోహన్ రావు డిసి బోర్డు కార్యదర్శి సన్యాసిరాజు ఎంఏవో లో తిరుమల ప్రసాద్ పెంటయ్య ప్రధానోపాధ్యాయుడు వంగపండు గోపాల్ నాయుడు పాల్గొన్నారు.

## బదిలీలకు క్లస్టర్ ఉపాధ్యాయులని తప్పనిసరి



రామభద్రపురం, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఉమ్మడి విజయ నగరం జిల్లా, మన్యం జిల్లా శాఖలు సంయుక్తం గా విడుదల చేశాయి రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో పార్వతిపురం మన్యం జిల్లా కార్యదర్శి మీసాల వెంకట గౌరీ శంకర్రావు మాట్లాడుతూ రేషనలైజేషన్ జరుగుతున్నందున కింది విషయాలు పరిగణలోనికి తీసుకోవాలని సూచించారు. ఇకనుంచి ఒకటి రెండు తరగతి ఫౌండేషన్ స్కూళ్లు ఎట్టి పరిస్థితుల్లో ఉంచకుండా వాటిని ప్రాథమిక పాఠశాలగా మార్చాలని, ఏకోపాయ పాఠశాల లేకుండా ప్రతి పాఠశాలలో ఇద్దరు సెకండరీగ్రేడ్ టీచర్లు ఉండాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.బదిలీలకు క్లస్టర్ ఉపాధ్యాయులని తప్పనిసరి చేస్తున్నారు. అదేవిధంగా మిగిలిన ఉపాధ్యాయులకు జీరో సర్వీసు బదిలీలకు అవకాశం కల్పించాలని స్పౌస్ బదిలీ విషయంలో ఆ మండలంలో ఎంచుకున్న ఖాళీని కేటాయించాలి. కానీ స్పౌజ్ పనిచేసే ప్రదేశానికి అతి దగ్గర స్థానాలు బలవంతంగా కేటాయించడం సరికాదు అని అభిప్రాయ పడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపీటీఎఫ్ ఉమ్మడి విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగి నాయుడు, సీనియర్ రాష్ట్ర కౌన్సిలర్లు ఆర్ నాగేశ్వరరావు ఎం పాణిగ్రహి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్ పరిసనాయుడు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల, మార్చి 4, ప్రభాతవార్త




ఆంధ్ర విశ్వవిద్యాలయం మంగళవారం విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ( విజయనగరం టౌన్) ఉత్తమ ఫలితాలను సంపాదించిం దని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రేఖ చెప్పారు . ఐదవ సెమిస్టర్ లో బి.ఏ హిస్టరీ 84 శాతం, బీకాం 80 శాతం,,బి.ఎస్సి కెమిస్ట్రీ 100 శాతం, బీ.ఎస్సీ జువాలజీ73. 3 శాతం, బోటనీ మైనర్ 100 శాతం, భౌతిశాస్త్రం మైనర్ లో 100 శాతం ఫలితాలు సాధించినట్లు వివరించారు. హిస్టరీ, పాలిటిక్స్ ఎకనామిక్స్, మైనర్స్ 100 శాతం ఫలితాలు సంపాదించడం గమనార్హమని తెలిపారు. వై.బుచ్చమ్మ కెమిస్ట్రీ విభాగము లో 8.8 ఎస్ జి.పి ఏ, బద్రి కృష్ణవేణి 9.23 ఎస్. జి. పి. ఏ జువాలజీ , ఎరకమ్మ 8.38 హిస్టరీ , దేవ కుమారి 8.85 ఎస్. జి.పి. ఎ. బీకాంలో సంపాదించడం విశేష మని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రేఖ, అధ్యాపకులు అభినందించారు. కళాశాలకు వీలైనంత మేర సదుపాయాలు కల్పించి, ఇంకా మంచి ఫలితాలను వచ్చే విద్యా సంవత్సరంలో సాధిస్తామని తెలియజేశారు. విద్యార్థులను తీర్చిదిద్దరమే తమ లక్ష్యమని, అధ్యాపకులందరూ తీవ్రంగా కృషి చేస్తున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్. కె.రేఖ అధ్యాపకులను ప్రశంసించారు.

## బెల్లం తయారీ కేంద్రాన్ని పరిశీలించిన డిసిసిబి చైర్మన్ నాగార్జున




బాడంగి, ప్రభాతవార్త

బాడంగి లో గల ఎత్తుకైనా సమీపన ఉన్న నాబార్డ్ సహకారంతో నిర్వహిస్తున్న రైతుల జట్టు ఎఫ్.పి.సి బెల్లం తయారీ కేంద్రాన్ని బుధవారం డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా బెల్లం తయారీ కేంద్రాన్ని మరియు సమీపంలో ఉన్న దీక్షా మహిళ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయాన్ని పరిశీలించి పలు సూచనలు సలహాలు ఆయన ఇవ్వడం జరిగింది. రైతులకు బెల్లం తయారీపై ఎటువంటి సాంకేతిక సలహాలు ఇవ్వడానికి డిసిసిబి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తుందని పరిశీలనలో తెలిపారు. ప్రతి గ్రామంలో ఉన్న రైతులకు ఎప్పటికప్పుడు బెల్లం తయారీ విధానం పై ఒక వినూత్న విధానాన్ని తీసుకురావడం ద్వారా చెరుకు పెంపకం పెరుగుతుందని సాంకేతిక సలహాలు ఇచ్చేందుకు కూడా మా వంతు కృషి చేస్తామని పరిశీలనలో రైతులకు తెలిపారు. తదుపరి దీక్షా మహిళా వెల్ఫేర్ సొసైటీ సీఈఓ శాంతితో మాట్లాడుతూ గ్రామాల్లో జీవనోపాధించేందుకు తమ వంతు కృషి చేస్తామని ఒక ప్రణాళిక బద్ధంగా ఏమైనా యూనిట్స్ ఉంటే మా వద్దకు తీసుకు వస్తే వాటిని అనుకరణ చేయడానికి డిసిసిబి గ్రామీణ ప్రాంతాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ఆయనతోపాటు డిసిసిబి సీఈఓ ఉమామహేశ్వర రావు జిఎం సత్యనారాయణ .ప్రసాద్ ముకుంద రావు, రాంబద్రపురం తెర్లం బ్యాంక్ మేనేజర్లు డిసిసిబి విజయనగరం సిబ్బంది రైతుల జట్టు ఫ్రీజ రైతులు మరియు దీక్షా సిబ్బంది ఆయనతో పాటుగా పాల్గొన్నారు.

## దుర్గాదేవి ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం



దత్తిరాజేరు మార్చి 4 ప్రభాతవార్త

మండలంలోని కోమటిపల్లి ఆటో స్టాండ్ జంక్షన్ వద్ద ఈనెల6.7.8 తేదీల్లో శ్రీ దుర్గాదేవి ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమశీ జరుగుతుందని గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు అన్నారు ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందన్నారు వేద పండితులు తో ప్రతిష్ట కార్యక్రమం జరుపబడుతుంది కావున పురోహితులు భక్తులకు గోత్రనామాలుఅభిషేకపూజలు నిర్వహిస్తార కావున గ్రామంలో ఉన్న చిన్న పెద్ద అందరూ ఆలయం వద్దకు చేరి పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందుతారని తెలిపారు ఆఖరి రోజున ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు ఏర్పాటు చేశామన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త
25

## మన్యం జిల్లా ప్రగతికి సరికొత్త బాట..మార్ట్

**జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి**

పార్వతీపురం, మార్చి 4, ప్రభాతవార్త :



మార్ట్ ప్రాజెక్టు మన్యం జిల్లా ప్రగతికి సరికొత్త బాట వేయనుందని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అన్నారు. దీనికి సంబంధించి ప్రతీ శాఖాధికారి చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళికలతో వ్యవసాయ, అను బంధ రంగాల రైతులు, మహిళల ఆదాయం రెట్టింపు కావాలని కలెక్టర్ అన్నారు. బుధవారం ఆయన ఛాంబ రులో ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి రైతు సాంప్రదాయ సాగు పద్ధతుల నుండి బయటకు వచ్చి, రైతులు క్రాప్ డైవర్సిఫికేషన్ (పంట మార్పిడి) వైపు మళ్లాలని కలెక్టర్ అన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే వాణిజ్య పంటలు, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతుల తలసరి ఆదాయాన్ని పెంచడమే 'మార్ట్' ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నీటి వినియోగం ఎక్కువగా ఉండే పంటల కంటే, భూగర్భ జలాలను పొదుపు చేసే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారు లను ఆదేశించారు. అలాగే, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సేంద్రీయ వ్యవసాయం దిశగా రైతులను చైతన్య పరచాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని అన్నారు. రైతులు పండించిన పంటను దళారీల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయించుకునేలా మార్కెట్ లింకేజ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారుల లక్ష్యం కేవలం పథకాలు అమలు చేయడం మాత్రమే కాదని, ఆ పథకాలు గ్రామీణ పేదరిక నిర్మూలనకు మరియు స్థిరమైన ఆర్థిక వృద్ధికి తోడ్పడాలన్నారు. మార్ట్' ప్రాజెక్టు జిల్లాలోని ప్రతి గ్రామీణ వృత్తిదారుడి జీవితంలో వెలుగు నింపాలని ఆయన అభిలషించారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ అక్షరాంధ్ర ఫ్రీ ఫైనల్ పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో బీవిజే పాత్రో

పాచిపెంట మార్చి 4 ప్రభాతవార్త.



మండల కేంద్రమైన పాచిపెంట ఎగవీధిలో బుధవారం నిర్వహించిన విల్లాస్ అక్షరాంధ్ర కేంద్రాలో నిర్వహిస్తున్న ఫ్రీ ఫైనల్ పరీక్ష కేంద్రాలను ఎంపీడీవో బి వి జె పాత్రో మరియు వెలుగు ఏపిఎం ఆర్ శ్రీరాములు పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల మూడు నెలలు క్రితంనూతనంగా ప్రారంభించిన నిరక్షరాస్యలను అక్షరాస్యులుగా తీర్చి దిద్దే కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ అక్షరాంధ్ర కేంద్రాలను మండలంలో 17 సచివాలయ పరిధిలో ప్రారంభించారు. మండలంలో వెలుగు పొదుపు సంఘాలు మహిళలు 2500 మంది మరియు ఉపాధి హామీ పథకం సభ్యులు 1500 మంది మొత్తం 4000 మందికి మండలంలో నిరక్షరాశులకు తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ప్రభుత్వం నూతనంగా ప్రారంభించారనీ ఎంపీడీవో తెలిపారు.

## ఉపాధి హామీ పనులను మార్చి 10 తేదీ లోగ పనులు పూర్తి చేయాలి: ఏ పి డి త్రివిక్రమ్ రావు

బలిజిపేట మార్చి 4 ప్రభాతవార్త



బలిజిపేట మండలం మండల పరిషత్ కార్యాలయం లో జాతీయ ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రా రావు అధ్యక్ష మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఇంజనీరింగ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్ ఏ ఈ జె ఈ లతో రివ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు మండలంలో సుమారు 239 ఉపాధి హామీ పథకం లో గుర్తించగా ఇప్పటివరకు 83 పనులు పూర్తి చేశారు ఇందులో ఎనిమిది తారు రోడ్లు నిర్వహించారు మిగిలిన సిసి వీధి కాలువలు సిసి రోడ్లు మిగిలిన పనులను ఈనెల మార్చి 10 తేదీలోగా పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు పనులు పూర్తయిన వాటికి సకాలంలో బిల్లులు చెల్లించే రూపంలో చర్యలు చేపట్టాలని చేయాలని త్వరితగతన పూర్తిచేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారిని ఏపీవో కేశవరావు ఏఈ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్లు వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆహారం, పోషణ, ఆరోగ్యం, పారిశుద్ధ్యం శిక్షణ



కొత్తవలస మార్చి4(ప్రభాత్ వార్త)

సమాఖ్య కార్యాలయంలో ఎపిఎం ఎ.వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రామ సంఘం కమిటీల శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతు.. ఆహారం, పోషణ, ఆరో గ్యం, నీరు, పారిశుద్ధ్యం కార్యక్రమాల ద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరచడం అని అన్నారు. మానవా భివృద్ధి సేవలు, ప్రతి ఇంటిలో వివిధరకాల ఆహారశీ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అందించే సేవలు మెరుగు పడాలి అని అన్నారు. మండలం సమాఖ్య లక్ష్మి ప్రసన్న అంగన్వాడీ సూపర్వైజర్ రమణమ్మ, సిసిలు అప్పలస్వామి, భారతి, అప్పలనాయుడు, పద్మావతి, గ్రామ సంఘం సబ్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

## సి సి కెమెరా అందించిన ఎల్ కె ఎస్ పురం సర్పంచ్ ని సన్మానించిన ఎస్ ఐ

లక్క వరపు కోట మార్చి 4 ప్రభాతవార్త

మండలం లోని ఎల్ కోట సీతారాం పురం గ్రామం లో నిఘా కోసం ఉపయోగ పడే సి సి కెమెరాను గ్రామ సర్పంచ్ తూర్పటి సోంబాబు ఎల్ కోట ఎస్ ఐ నవీన్ పడాల్ కి బుధవారం అందజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ ని ఎస్ ఐ నవీన్ పడాల్ శాలువా కప్పి సత్కరించారు ఈ కార్యక్రమం లో గ్రామస్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



# ఆర్థిక వృద్ధిలో మహిళలు




**మహిళా సాధికారత లేకుండా దేశ శ్రేయస్సుని ఊహించలేం అది సాధించాలంటే.. విధానాల్లో మార్పులతో పాటు సామాజిక చైతన్యం, కుటుంబ ప్రోత్సాహం ఎంతో అవసరం.**

ప్రపంచ జనాభాలో సగం మంది మహిళలే. అదే మన దేశానికి వస్తే ప్రతి 100 మంది పురుషులకు 1020 మంది మహిళలు ఉన్నారంటోంది తాజా ఆర్థిక సర్వే. అందుకని దేశ జిడిపిలోనూ వీరి వాటా ఎక్కువే అనుకుంటే మాత్రం మీరు పొరపడినట్లే. ఎలాగంటారా? ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం స్వాతంత్ర్యం వచ్చినప్పుడు 9 శాతంగా ఉన్న మహిళా అక్షరాస్యత ఇప్పుడు 77 శాతానికి చేరింది. ఎంతోమంది ఆడపిల్లలు ఉన్నతంగా చదివినా.. సంప్రదాయాలు, కట్టుబాట్లు.. వంటి వాటి కారణంగా ఉపాధికోసం గడప దాటడం లేదు. దీనికి పని వాతావరణంలో సమస్యలు, వేతనాల్లో వ్యత్యాసాలు, లైంగిక వేధింపులు.. వంటి మరెన్నో అంశాలు తోడై వారిని ఆర్థిక సాధికారత దిశగా అడుగు వేయనీయడం లేదు. అలాగని వారు ఏ పనీ చేయరనుకునేరు.. ఇంటి పట్టునే ఉండి ఇల్లాళ్లు చేసే శ్రమకి లెక్క కట్టడం, విలువ చెప్పడం కష్టమే. దీంతో పడ్డ కష్టానికి ప్రతిఫలంగా ఆదాయం అందుకోలేకపోవడం, ఇతరత్రా మరెన్నో కారణాలు.. దేశ జిడిపిలో మహిళల భాగస్వామ్యాన్ని తక్కువగా చూపిస్తున్నాయి. మరో పక్క అభివృద్ధి చెందిన దేశాల జీడిపిలో మగువల వాటా చాలా ఎక్కువగా ఉంది. 2015 నాటి లెక్కల్నే పోల్చి చూసుకుంటే చైనా, తూర్పు ఐరోపా, మధ్య ఆసియాలో అత్యధికంగా జీడిపిల్లో స్త్రీల వాటా 41 శాతం ఉంటే, ఉత్తర అమెరికాలో 40 శతం వాటా వీరిదే. మొత్తంగా ప్రపంచ జిడిపి సగటుని లెక్కించినా 37 శాతం మహిళల నుంచే వస్తోంది. కానీ, భారత్ విషయానికి వస్తే అది 17-18 శాతంగానే ఉంది.

**అది సరిపోదు...** గతంతో పోలిస్తే కార్పొరేట్ బోర్డు రూముల్లో లింగ వైవిధ్యాన్ని సాధించగలిగాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టార్టప్‌ల పరంగా భారతదేశం మూడో అతిపెద్ద ఎకోసిస్టమ్‌ని కలిగి ఉంది. వీటిల్లో పదిశాతం స్టార్టప్‌లకు మహిళలే యవస్థాపకులుగా ఉన్నారు. ప్రస్తుతం, భారతదేశంలో ఉత్పాదక శక్తి ఉన్న స్త్రీలు 43.2 కోట్లు ఉండగా, వీరిలో 34.3. కోట్ల మంది అసంఘటిత రంగంలో ఉపాధి పొందు తున్నారు. వ్యవసాయేతర ప్రతి ఐదు వ్యాపారాల్లో ఒకటి ఆడవారే నడుపుతున్నారు. స్వయం ఉపాధికోసం తీసుకునే ముద్రా రుణ గ్రహీతల్లో 70 శాతం మంది మహిళలే. ఆ మధ్య 250 భారతీయ కంపెనీల్లో చేసిన అధ్యయనం ప్రకారం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్ హోదాల్లో నిలదొక్కుకుం టోన్న మహిళల వాటా 55 శాతం పెరిగిందట. అయినప్పటికీ ఈ వాటా ఇంకా పెరగాలి. స్త్రీలఆర్థిక భాగస్వామ్యం, అవకాశాలకు సంబం ధించి వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఓ నివేదిక ఇచ్చింది. అందులో 146 దేశాలకు ర్యాంకులు ఇవ్వగా భారత్‌ది 142వ స్థానం. దీన్ని బట్టి మన దేశ మహిళలు ఆర్థిక పురోగతి సాధించడంలో ఇంకా వెనుకబడే ఉన్నారని తెలుస్తోంది.

**ప్రోత్సాహమిస్తేనే...**

మహిళలకు ఆర్థిక స్థిరత్వం చేకూరి నప్పుడే వారు తమ హక్కులు, సౌకర్యాలను సాధించు కోగలరు. ఆరోగ్యం, పౌష్టికా హారం, మాతృత్వం, పిల్లల చదువు వంటి అంశాల పై ఎక్కువ పట్టు నిలుపు కోగలుగుతారు. మహిళలకు సమానావ కాశాలు లభిస్తే 2025కల్లా భారత జిడిపికి అదనంగా రూ.63.8లక్షల కోట్ల సంపద చేకూరు తుందంటోంది మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్-2021 నివేది. మెంటార్‌షిప్, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను నిర్వహించడం, నెట్‌వర్కింగ్, సపోర్టింగ్ గ్రూపుల ఏర్పాటు, ఫ్లెక్సిబుల్ వర్క్‌పాల సీలను అమలుచేయడం వంటివాటి ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో స్త్రీల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచగలం. ❐

## వ్యథ: మౌన వ్రతం పాటిస్తే రుగ్మతలు తగ్గవు !


**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న:** నా వయస్సు **50** ఏళ్లు. ఐదు అడుగుల మూడు అంగుళాల పొడవు, **70** కిలోల బరువు ఉన్నాను. మధుమేహం, రక్తపోటుకు మందులు వాడుతున్నాను. కొంతకాలంగా కీళ్ల నొప్పులు, అలసట, కోపం, నిరాశ ఎక్కువగా ఉన్నాయి. మా అబ్బాయికి పెళ్లై మూడేళ్లు అవుతోంది. ఇంకా పిల్లలు పుట్టకపోవడంతో మానసిక ఒత్తిడి పెరిగింది. ఒక గురువు **28** రోజులు మౌన వ్రతం పాటిస్తే నా సమస్యలు తగ్గి, మా అబ్బాయికి సంతానం కలుగుతుందని చెప్పారు. కానీ నా స్నేహితురాలు ఇది నిజం కాదంటోంది. నాకు సరైన పరిష్కార మార్గం చెప్పండి. **ఒక సోదరి, విజయవాడ**

**జవాబు:** అమ్మా, మీపై శారీరక సమస్యలు, కుటుంబ ఆందోళనలు, మానసిక ఒత్తిడి కలిసి ప్రభావం చూపుతున్నాయి. ముందుగా ఒక విషయం గుర్తుంచుకోవాలి. మీ బాడీ మాస్ ఇండెక్స్ 27కి పైగా ఉంది. అంటే కొద్దిగా అధిక బరువు పరిధిలో ఉన్నారు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారిలో కీళ్ల నొప్పులు, అలసట, నీరసం సాధారణంగా కనిపిస్తాయి. ఒత్తిడి పెరిగితే ఇవి మరింత ఎక్కువ అవుతాయి. మీ అబ్బాయికి పిల్లలు ఆలస్యం కావడానికి అనేక కారణాలు ఉండొచ్చు. దంపతుల ఆరోగ్య పరిస్థితి, హార్మోన్ల అసమతుల్యత, జీవనశైలి, వయస్సు లేదా ఇతర వైద్య కారణాలు. ఇవి పరీక్షల ద్వారానే తెలుస్తాయి. తల్లి మౌనం పాటిస్తే కొడుకుకు సంతానం కలుగుతుందనే నమ్మకానికి వైద్య ఆధారం లేదు. మౌన వ్రతం వల్ల మనసుకు ప్రశాంతత, ఆలోచనల స్పష్టత, కోపం తగ్గడం లాంటి ప్రయోజనాలు కలగొచ్చు. అయితే అది మధుమేహం, రక్తపోటు లేదా కీళ్ల నొప్పులను నయం చేయదు. అలాగే ఎవరికైనా సంతానం కలగడంలో ప్రభావం చూపదు. అంటే మౌనం ఆధ్యాత్మిక సాధన మాత్రమే. వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. మీ ఆరోగ్యం మెరుగుపడేందుకు ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడక చేయండి. షుగర్, బీపీ నియంత్రణ కోసం రెగ్యులర్ చెక్‌అప్స్ చేయించుకోండి. ఐదు నుంచి ఏడు కిలోల బరువు తగ్గడం మంచిది. ధ్యానం, ప్రాణాయామం, సరిపడ నిద్ర, భావోద్వేగాలను నమ్మకమైన వారితో పంచుకోవడం ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. మీ అబ్బాయి, కోడలు ఇద్దరూ కలిసి ఫర్టిలిటీ స్పెషలిస్ట్‌ను సంప్రదించడం ఉత్తమం. సమస్య ఉంటే చికిత్స తీసుకోవాలి. మీరు ప్రశాంతంగా ఉంటేనే కుటుంబం ప్రశాంతంగా ఉంటుంది. ముందుగా మీ ఆరోగ్యం మీద దృష్టి పెట్టండి. ❐



## ఒకసారి శరణు వేడిన చాలును!



నల్ల మస్తాన్ గారు గుంటూరుకు వచ్చిన తొలి దినాలలో ఒక రోజు ఉరుములు, మెరుపులతో కుంభవృష్టిగా వాన కురవసాగింది. విశేషమేమిటంటే ధ్యానం చేస్తున్న మస్తాన్ గారి ఇంటిపై ఒక వర్షపుచుక్క కూడ పడకపోవటం. ఇంతలో పిడుగు పడి ఒక మేక పిల్ల. ఒక మనిషి మరణించారు. వర్షం తగ్గింది. మస్తాన్ గారు సమాధి నుండి లేవగానే మరణించిన మేకపిల్ల కనిపించింది. ఆయన దానివద్ద కూర్చొని, భగవధ్యానం చేసి, దాని చుట్టూ ముమ్మారు తిరిగి 'ఉఠో' అన్నారు. ఆ మేకపిల్ల లేచి మస్తాన్ గారి పాదాల సందునుండి దూరి వెళ్లి పోయింది. ఈ వార్త ఊరంతా వ్యాపించగా పిడుగుపాటుతో మరణించిన వ్యక్తి తల్లి వచ్చి, మస్తాన్ గారి పాదాలను పట్టుకుని వల, వల దుఃఖించింది. కరుణా సముద్రుడు ఆ తల్లి దుఃఖం చూడలేక పోయాడు. శవం వద్దకు పోయి దైవ ధ్యానం చేసి, శరీరాన్ని తాకాడు. వెంటనే విగత జీవికి ప్రాణం వచ్చింది. లేచి కూర్చున్నాడు. సంగతి గ్రహించి మస్తాన్ గారి పాదాలపై పడ్డాడు. మహనీయుల కరుణకు పాత్రమైన ఏ జీవి అయినా అదృష్టవంతులే, జంతువు కావచ్చు, మనిషి కావచ్చు. షిరిడీలోని ద్వారకామాయిలో కొలువై ఉన్న సాయి ఇందుకు భిన్నుడు కాదు. అది 1917వ సంవత్సరం. వైశాఖ మాసం (మే నెల). ఎండలు మండిపోతాయని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ఒక పిచ్చి కుక్కచే కరవబడిన ఒక చిన్ని కుక్క వెంటబడ్డారు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అనే నానుడి జంతువులకు కూడా వర్తిస్తుంది. అది ద్వారకా మాయిలోనికి పరుగు తీసింది. గ్రామస్తులందరు అది బయటకు వస్తే చంపటానికి బయట నిలబడి 'బాబా! ఆ కుక్క పిచ్చిది. వెలుపలకు తరమండి, దానిని చంపెదము అనగా, సాయిబాబా పిచ్చివారలారా! దూరంగా పొండు. దిక్కులేని ఈ చిన్న జీవిని చంపదలచినారా. అన్నాడు. ఆ జీవి రక్షణ పొందింది. అంతియే కాదు దాని పిచ్చి కూడా మటుమాయమైంది. సాయినాథుని పాదధూళితో పరమ పావనమైన ద్వారకామాయిని శరణు వేడిన వారికి ఆపదలు ఆమడ దూరం పోతాయి. సాయి రక్షణ పొందిన చాలు - భీతికి తావు ఉండదు. **- యం.పి.సాయినాథ్**





## ముత్యం-పగడం జోడీ అందం

అమ్మాయిల అందాన్ని రెట్టింపు చేసేవాటిల్లో నగలు ముందుంటాయి. అయితే, వాటిల్లో కొన్నింటితో మనకి భావోద్వేగ అనుబంధమూ ఎక్కువే. ముఖ్యంగా ముత్యాలు, పగడాలతో చాలామందికి అలాంటి భావనే ఉంటుంది. అందుకే, అమ్మమ్మల తరం నుంచీ వీటిని కేవలం నగల్లానే చూడట్లేదు. వారసత్వంగానూ భావిస్తున్నారు. దీంతో కాలమెంత మారినా సాగర గర్భంలో పుట్టిన ఈ రెండు రత్నాలకు ఆదరణ తగ్గట్లేదు. ఇన్నాళ్లూ విడివిడిగా మెప్పించిన ఇవి.. ఇప్పుడు కలిసి కనికట్టు చేస్తున్నాయి. ముత్యాలు మృదుత్వానికి చిహ్నమైతే. పగడాలు ఉత్సాహానికి నిదర్శనం. ఈ రెండింటి కలయికతో తయారైన ఆభరణాలివి. అచ్చంగా కనకాంబరాలు మల్లెలతో జత కట్టినట్లుగా గొలుసులు, గాజులు, హారాల డిజైన్లలో చేరి ఆకట్టుకుంటున్నాయి. బ్రైడల్ ఫ్యాషన్‌గానూ, సంప్రదాయ దుస్తులకు కాంబినేషన్‌గానూ వీటినే ఎంచుకుంటున్నారు. పుత్తడి ధరలు పైపైకి ఎగబాకుతున్న తరుణంలో ఇవి అందరినీ మెప్పించడం సహజమే! వీటిని ధరించిన యువతులకు ఫ్రెష్‌లుక్‌ని ఇస్తే.. మహిళలకు హుందాతనాన్ని తెచ్చిపెడుతున్నాయి. వాటినోసారి మీరూ చేసేయండి.









## 'మెన్షన్ హౌస్ మల్లేష్' ఫ్యామిలీ ఎంటర్టైనర్



'మెన్షన్ హౌస్ మల్లేష్'మంచి కామెడీ, ఫ్యామిలీ ఎంటర్టైనర్. హీరో శ్రీనాథ్ మాగంటి ఈ చిత్రం మార్చి 6న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో శ్రీనాథ్ మాగంటి విలేకరులు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ సినిమాకి'మాన్షన్ హౌస్ మల్లేష్' అనే టైటిల్ పెట్టడానికి కారణం?**

మా టైటిల్ మెన్షన్ హౌస్ మల్లేష్.. అయితే ఓవర్ లుక్ లో టైటిల్ ని అలా అనిపిస్తోంది. ఇందులో నా క్యారెక్టర్ తప్పుగా ఆ పేరు రాస్తాడు. కానీ జనాలు రైట్ గా చదువుతున్నారు.

**మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**

ఒక పొగరుబోతు, దారితప్పి లేనిపోనీ అలవాట్లుతో వున్న ఓ క్యారెక్టర్ ని అతని తల్లి, భార్య ఎలా దారిలోకి తీసుకోస్తారనేది చాలా సరదాగా చెప్పాం. ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనింగ్ కామెడీ జానర్ ఫిల్మ్. ఫ్యామిలీ అంతా కలసి నవ్వుకునే సినిమా.

**మీరు చాలా క్లాస్ గా కనిపిస్తారు ఫస్ట్ టైం ఇంత మాస్ క్యారెక్టర్ చేయడం ఎలా అనిపించింది?**

హిట్ లో నీట్ గా ఉంటాను, అలాగే యానిమల్ లో కూడా నా క్యారెక్టర్ క్లాస్ గా ఉంటుంది. లక్కీ భాస్కర్ లో స్టైల్ మార్చుకుని వింటేజ్ లుక్ లో కనిపిస్తాను.

**సందీప్ రెడ్డి వంగా గారు. ట్రైలర్ లాంచ్ చేశారు కదా.. ఆయన రియాక్షన్ ఏంటి?**

ఆయనకు చాలా నచ్చింది. ట్రైలర్ చూసినంత సేపు నవ్వుకుంటున్నారు.

**డైరెక్టర్ బాల సతీష్ గురించి?**

సతీష్ గారికి ఇది ఫస్ట్ సినిమా. ఆయన చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్. బాడీ లాంగ్వేజ్, డైలాగ్ ఇలా అన్ని విషయాల్లోనూ చాలా కేర్ తీసుకున్నారు.

**నిర్మాత రాజేష్ గురించి?**

రాజేష్ గారు అమెరికా నుంచి సినిమా అంటే చాలా పాషన్‌తో వచ్చారు. సినిమా విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. అంత జాగ్రత్తగా చేసాం.

# తెర

## కొత్త కోడలు వచ్చింది

**విజయ్ దేవరకొండ**



విజయ్ దేవరకొండ రష్మిక జోడీ తెలుగు మీడియాను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలకు కొత్త కోడలు వచ్చిందని, మంచిగా చూసుకోండి అంటూ నవ్వులు పూయించారు మా ప్రయాణంలో మీరు ఓ భాగం. పెళ్లి చేసుకుని జంటగా ఇప్పుడు మీ ముందుకొచ్చాం. ఇదో విభిన్న అనుభూతి. కాలం గడిచిపోతోంది. మేం పెద్దవాళ్లం అయిపోతున్నాం, కొత్త విషయాలు నేర్చుకుంటున్నాం. కానీ, మిమ్మల్ని మర్చిపోం. మీరు మా హృదయాల్లో ఎప్పటికీ ఉంటారు. మీ ఆశీస్సులు మాకు కావాలి" అని విజయ్ ఖచ్చితంగా. "మేం కలిసి జీవితంలో కొత్త అధ్యాయం మొదలుపెట్టాం. " అని రష్మిక సూచించింది. అభిమానులతోనూ విరోష్ జోడీ తమ వివాహ వేడుకలను సెలబ్రేట్ చేసుకున్న సంగతి తెలిసిందే. మార్చి 1న పలు నగరాల్లో స్వీట్ల పంపిణీ, కొన్ని ఆలయాల్లో అన్నదానం చేసిన ఈ జంట.. మంగళవారం హైదరాబాద్‌లో ఫ్యాన్స్‌కు ప్రత్యేక విందు ఇచ్చింది.

## 'సరస్వతి' అందరికీ కనెక్ట్ అయ్యే గ్రిప్పింగ్ థ్రిల్లర్.

**- పూజా శరత్ కుమార్**



వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం 'సరస్వతి'. హైకాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.

**సరస్వతి ఎలా ఉండబోతుంది?**

సరస్వతి మంచి థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ట్విస్టులు ఉన్న వన్ ప్యాకేజ్ పటాక. మీరందరూ చాలా ఎంజాయ్ చేస్తారు. రెండు గంటల సినిమాని ఎంత గ్రిప్పింగా చేయాలో అంత అద్భుతంగా సినిమాని తీర్చిదిద్దాం.

**ప్రియమణి క్యారెక్టర్ గురించి?**

ఆ క్యారెక్టర్ గురించి ఇప్పుడే ఎక్కువ రివిల్ చేయకూడదు.

**మీ బ్యానర్ దోశ డైరీస్ గురించి ?**

బ్యానర్ కి ఏదైనా మంచి పేరు పెట్టాలి అనుకున్నప్పుడు ఫుడ్‌తో కనెక్షన్ నా పేరు అయితే అందరికీ కనెక్ట్ గా ఉంటుందని అనుకున్నాం. ఫేవరెట్. దోస డైరీస్ ఐడియా అందరికీ నచ్చింది.

**మీకు ముందు నుంచి ప్రొడక్షన్ అంటే ఆసక్తి ఉందా?**

నాకు ప్రొడక్షన్ పై ఆసక్తి ఉంది. చాలా మ్యూజిక్ షోలు చేశాను. అందులో రహమాన్ గారివి కూడా ఉన్నాయి.

**సరస్వతి సినిమాకి ఇన్స్పిరేషన్ ఏంటి?**

ఇదొక క్రైమ్ థ్రిల్లర్. చాలా మంచి సోషల్ మెసేజ్ ఉంది.

**ఇందులో కోర్టు సీన్స్ ఎలా ఉంటాయి?**

ఇందులో కోర్ట్ సీన్స్ చాలా ఇంపార్టెంట్. దాదాపు 7 నిమిషాల సింగిల్ షాట్ ఒకటి ఉంది. అది చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది.

**ఈ సినిమాని తెలుగులోనే తీయడానికి కారణం?**

వరలక్ష్మి ఇప్పుడు హైదరాబాద్ అమ్మాయి అయిపోయింది. తన డైరెక్షన్ చేస్తున్న తొలి సినిమా తెలుగులోనే ఉండాలని తన బలంగా కోరుకుంది.

## 'కాక్రోచ్'లో మన సొసైటీలోని డార్క్ సైడ్ చూపిస్తున్నాం: పి. సునీల్ కుమార్ రెడ్డి, బి. బాపిరాజు..



ఈ నెల 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న రియలెస్టిక్ వయలెంట్ లవ్ స్టోరీ మూవీ.. సొంత ఊరు, గంగపుత్రులు, ఒక రొమాంటిక్ క్రైమ్ కథ, గల్ఫ్, వలస వంటి చిత్రాలతో అవార్డులు, ప్రేక్షకుల రివార్డులు అందుకున్న డైరెక్టర్ పి. సునీల్ కుమార్ రెడ్డి రూపొందిస్తున్న తాజా చిత్రం 'కాక్రోచ్'. ఈ చిత్రంలో అభిలాష్ సుంకర, ప్రేమసన్, నవీన్, తీర్థ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. "కాక్రోచ్" సినిమాను శ్రీ లక్ష్మి ‌ ్మ పిక్చర్స్ బ్యానర్ పై బి.బాపిరాజు, ముతుకి నాగసత్య నారాయణ నిర్మిస్తున్నారు. ఈ సినిమా మార్చి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. నిర్మాత బి.బాపిరాజు మాట్లాడుతూ.. నేను 70వ దశకంలో డిస్ట్రిబ్యూటర్ గా కెరీర్ స్టార్ట్ చేశాను. తమిళ సినిమాలను కొని తెలుగులో రిలీజ్ చేసేవాళ్లం. అప్పుడు డబ్బింగ్ ద్వారానే ఇతర చిత్రాలను ప్రేక్షకులు చూడగలిగేవారు. అలా చాలా సినిమాలు డిస్ట్రిబ్యూషన్ చేశాను. కొన్నాళ్లకు పి.సునీల్ కుమార్ రెడ్డి గారితో పరిచయం ఏర్పడింది. స్వర్గీయ రవీంద్రబాబు గారితో కలిసి సునీల్ కుమార్ రెడ్డి గారి కాంబినేషన్ లో వరుసగా చిత్రాలు చేస్తూ వచ్చాం. ఈ సినిమాలన్నీ మాకు నిర్మాతలుగా మంచి పేరు తీసుకొచ్చాయి.

## సువర్ణ టెక్స్టైల్స్ టీజర్ విడుదల



శివకుమార్ రామచంద్రవరపు, డిబోరా డోరిస్ ఫెల్, రాజశేఖర్ అనింగి, విక్రమాదిత్య డాంబర్ ప్రధాన పాత్ర దారులుగా ప్రశాంత్ నామిని రచన దర్శకత్వంలో తెరకెక్కుతున్న "సువర్ణ టెక్స్టైల్స్ " ఈ చిత్రం టీజర్ ను ఇటీవలే విడుదల చేశారు. యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎ.వై.వి.ప్రొడక్షన్స్, సనాతన క్రియేషన్స్ బ్యానర్స్ పై నిర్మాత అనిల్ ఈరుగుదిండ్ల నిర్మిస్తున్నారు. ఆదివారం ప్రసాద్ ల్యాబ్ లో దర్శకుడు వేణు ఉడుగుల ఈ చిత్రం టీజర్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా... హీరో శివకుమార్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఎన్టీఆర్ తో కలిసి ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డ్రాగన్ లో చేస్తున్నా... కచ్చితంగా 2 వేల కోట్లు కలెక్ట్ చేస్తాడు.. చూసారుగా తారక్ గారు ఎలా సన్నబడి ఎడారి లో కళ్లజోడు పెట్టుకొని నడుస్తుంటే తారక్ నెక్స్ట్ లెవెల్ లో ఉంటాడు.. ఈ సినిమా విషయానికి వస్తే.. హైటెక్ సిటీ వీధుల్లో నైటీ వేసుకుని పరిగెత్తిం చాడు. మంచి జీల్ ఉన్న దర్శకుడు ప్రశాంత్ నామిని. ఎంతో ప్యాషన్ తో సినిమా తీశాడు. కచ్చితంగా నచ్చుతుంది. యూత్ కు బాగా నచ్చుతుంది. టీజర్ చూసారుగా ఎవరిని డిజప్పాయింట్ అయితే చేయదు అన్నారుదర్శకుడు వేణు ఉడుగుల మాట్లాడుతూ... టీజర్ చాలా బాగుంది. టీజర్ ఎలా ఉందో సినిమా కూడా అలానే తీస్తే మాత్రం అందరూ మాట్లాడుకునే సినిమా అవుతుంది. ఈ సినిమాతో ప్రశాంత్నామిని ఓ మంచి దర్శకుడు అవుతాడు అన్నారు.

## 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' ప్రీరిలీజ్ వేడుక



మిస్సమ్మ, 'అదిరిందయ్యా చంద్రం' 'టాటా బిర్లా మధ్యలో లైలా' లాంటి క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ తర్వాత శివాజీ, లయ జంటగా నటించిన సినిమా'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసన్ని. 'లిటిల్ హార్ట్స్', రాజు వెడ్స్ రాంబాయి లాంటి విజయాల తర్వాత ఈటీవీ విన్‌తో కలిసి ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి విడుదల చేస్తున్న సినిమా ఇది. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేసింది. క్రైమ్‌కామెడీ ఫ్యామిలీ థ్రిల్లర్‌గా వస్తున్న సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని సినిమాను ఈటీవీ విన్ అసోసియేషన్‌తో శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రిక్కి సమర్పణలో హీరో శివాజీ స్వయంగా నిర్మిస్తుండగా.. సుధీర్ శ్రీరామ్ తెరకెక్కించారు. మార్చి 6న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఎంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, బండ్ల గణేష్ అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా హాస్య బ్రహ్మ బ్రహ్మానందం మాట్లాడుతూ తమ్ముడు శివాజీ నాకు అత్యంత ఆప్తుడైన వ్యక్తి. యంగ్ బ్యాచ్ అంతా కలిసి ఓ మంచి సినిమాను చేశారు. అలీ అన్న శివాజీ సినిమా ఫంక్షన్‌కు వెళదాం రా అన్నాడు. వెంటనే ఆలోచించకుడా వచ్చాను. బండ్ల గణేష్ మాట్లాడుతూ ఈటీవీవిన్ సంస్థ ఎంతో మంది నూతన ప్రతిభను ప్రోత్సాహిస్తున్నారు. శివాజీ నా ఆత్మబంధువు, సోదరుడు. శివాజీ ఎప్పుడూ బాగుండాలని కోరుకునే వ్యక్తి. ఈ సినిమా ఓటీటీ అనగానే డిజప్పాయింట్ అయ్యాను. ఈ టీవీ విన్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ ఈ సినిమాను శివాజీ, లయ గారు ఎంతో బాధ్యతగా, ప్రేమగా తీశారు. ఈ సినిమను అందరూ ఫ్యామిలీతో రండి. ఈసినిమాకు ఫ్యామిలీ ఆడియన్స్‌కు చేరువ కావాలని ఫ్యామిలీ టికెట్ కాంబోను ప్రకటించాం. శివాజీ మాట్లాడుతూ ఈటీవీ విన్ నుంచి వస్తున్న సినిమా అంటే ఆడియన్స్‌లో క్యూరియాసిటీ ఉంటుది. ఇప్పుడు సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని చిత్రం విషయంలో కూడా అలాంటి ఆసక్తి ఉంది.

## నేటినుంచి శ్రీ షిరిడీ సాయి మందిరం వార్షికోత్సవం



సంతబొమ్మాళి, మార్చి 4 ప్రభాతవార్త

మండల కేంద్రం సంతబొమ్మాళిలో నెలకొల్పిన శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం కార్యక్రమం గురువారం నుంచి రెండు రోజులు పాటు జరగనుంది. సాయిబాబా మందిరం ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమం సందర్భంగా అత్యంత వైభవంగా సాయి బాబా కమిటీ సభ్యులు, భక్తులు చేయనున్నారు. స్థానిక బస్టాండ్‌కి సమీపంలో బీసీ కాలనీకి అత్యంత దగ్గరలో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో మొదటి రోజు గురువారం మధ్యాహ్నం 3గంటలకు సాయి బాబాను పుర వీధుల లో పెద్ద ఎత్తున ఊరేగింపు కార్యక్రమం జరగనుంది. అనంతరం సాయంత్రం 6గంటలకు దూప్ హారతి (సాయం సంధ్య హారతి), పుష్పాభిషేకం కార్యక్రమం జరగనుంది. అలాగే పూజ్య గురు దేవులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో సత్సంగ కార్యక్రమం, ఈ సందర్భంగా "ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి" అఖండ సాయినామ సంకీర్తన 12గంటలు పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే రెండో రోజు కాగడ హారతితో కార్యక్రమం ప్రారంభం కానుంది. సుప్రభాతం, సాయి బాబాకు ప్రత్యేక పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం బాబా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులతో సామూహిక సాయి సత్యవ్రతం కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.



## కోర్టుల నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి : ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం, మార్చి 4 ప్రభాతవార్త:

రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి ఫరూక్‌ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని పాతపట్నం మరియు కొత్తూరు మండల కేంద్రాల్లో ఉన్న జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు భవనాలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉండటం వల్ల న్యాయవాదులు, కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి ఎమ్మెల్యే గోవిందరావు వివరించారు. ప్రజలకు మెరుగైన న్యాయసేవలు అందించేందుకు నూతన కోర్టు భవనాల నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మెళియాపుట్టి మండలం ప్రస్తుతం టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో ఉండటం వలన ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఈ నేపథ్యంలో మెళియాపుట్టి మండలాన్ని పాతపట్నం సివిల్ జడ్జి కోర్టు పరిధిలోకి చేర్చాలని విన్నవించారు. ఈ అంశాలపై మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలో న్యాయవ్యవస్థ బలోపేతానికి ఇది కీలక ముందడుగు అవుతుందని ఎమ్మెల్యే గోవిందరావు పేర్కొన్నారు.

## ఉజ్వల ఉచిత గ్యాస్ పథకం పంపిణీ



రణస్థలం, మార్చి 4 ప్రభాతవార్త

మండలంలోని నారువ, బోయపాలెం గ్రామంలో ప్రధానమంత్రి నరంద్రమోదీ ఉజ్వల ఉచిత గ్యాస్ పంపిణి పథకం కింద గ్యాస్ పొయ్యి, సిలండర్‌లను బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జీరు గురునాధ్ రెడ్డి మహిళ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయుకులు, మహిళలు పాల్గొన్నారు.

## మహిళలపై నేరాలు అరికట్టడం కోసమే "నారీ శక్తి"



సంతబొమ్మాళి, మార్చి 4 ప్రభాతవార్త

మహిళలపై జరుగుతున్న నేరాలు, అగత్యాలను అరికట్టడమే లక్ష్యంగా నారీ శక్తి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని టెక్కలి హెచ్‌సి గిరిధర్ అన్నారు. సంతబొమ్మాళి మండలం మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు బుధవారం నారీ శక్తిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు రక్షణ చట్టాలు, ప్రస్తుత సమాజంలో పొంచి ఉన్న ముప్పులపై విస్తృత అవగాహన కల్పించారు. మహిళలు తమ రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, ముఖ్యంగా ఆపద సమయంలో శక్తి యాప్ ఏ విధంగా రక్షణ కవచంలా పనిచేస్తుందో విద్యార్థినులకు ప్రత్యక్షంగా వివరించారు. స్మార్ట్‌ఫోన్‌లలో ఈ యాప్‌ను పొందుపరుచుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయాన్ని తక్షణమే పొంద వచ్చని సూచించారు. పెరుగుతున్న సాంకేతికతతో పాటు సైబర్ నేరాలు కూడా విస్తరిస్తున్నాయని, సోషల్ మీడియా వాడకంలో విద్యార్థులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. ఏదైనా ఇబ్బందికర పరిస్థితులలో ఉన్నప్పుడు పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్స్ 181, 112, 1091, నెంబర్ల యొక్క వినియోగం వివరించారు, వేధింపులు గృహహింస, అంతేకాకుండా 1930 సైబర్ మోసానికి గురైనట్లయితే ఈ నెంబర్‌కు, మారకద్రవ్యాలు సరఫరా వినియోగం కోసం 1972, 1098 బాల్య వివాహాలు బాల కార్మికుల కొరకు విద్యార్థినిలకు తెలియపరచడం జరిగింది, అంతేకాకుండా బాల బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ క్లాసులు పీఈటి మాస్టారుతో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కె.గణేష్ హెచ్ సి, కె.రమణమ్మ మహిళా పోలీస్, హెచ్ఎం కుర్మనాయకులు పాల్గొన్నారు.

## పాతపట్నం గాంధీనగర్‌పై నిర్లక్ష్యమా?

### వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణమూర్తి



పాతపట్నం, మార్చి 4 ప్రభాతవార్త

పాతపట్నం మేజర్ పంచాయతీ అభివృద్ధికి వివిధ మార్గాల ద్వారా నిధులు అందుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బి.నారాయణ మూర్తి అన్నారు. పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ నివాసితులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై ఆయన పంచాయతీ కార్యదర్శి వి.రామచంద్రరావు మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ వి.రమణమూర్తిలకు ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నంలో జాతీయ రహదారికి సమీపాన, జోగి కొండను ఆనుకొని ఉన్న గాంధీనగర్‌లో ప్రజలు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. పంచాయతీ అనుమతుల తోనే ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ, నేటికీ అక్కడ సరైన రహదారులు లేకపోవడం శోచనీయమని నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసుకున్న మట్టి రోడ్లే తప్ప, పంచాయతీ యంత్రాంగం కనీసం ఒక్క శాశ్వత రహదారిని కూడా నిర్మించలేదని ఆయన విమర్శించారు. త్రాగునీటి పైపు లైన్లు పాడైపోయి ప్రజలకు నీటిసరఫరా అందకపోయినా పట్టించుకునే నాథుడే లేరన్నారు. ప్రజలు క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నారని, ప్రభుత్వ నిధులు కూడా అందుతున్నాయని అయినా మరి ఆ నిధులు ఏమవుతున్నాయి? ఈ ప్రాంత అభివృద్ధిని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

### అధికారుల సానుకూల స్పందన

ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగునీరు, డ్రైనేజీ, రహదారుల వంటి కనీస వసతులను యుద్ధ ప్రాతిపదికన కల్పించాలని ఆయన కోరారు. సదరు ఫిర్యాదుపై అధికారులు సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు బి నారాయణమూర్తి వెల్లడించారు.

## వేరుశెనగ అధిక దిగుబడులకు సస్యరక్షణ చర్యలు పాటించాలి



కోటబొమ్మాళి, మార్చి 4 ప్రభాతవార్త)

రైతులు సాగు చేస్తున్న వేరుశెనగ పంటలో అధిక దిగుబడులు రావాలంటే సస్యరక్షణ, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పి.ఉదయ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని చిట్టివలస, తిలారు గ్రామాల్లోని రైతులకు వేరుశెనగ పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశెనగ పంటకు ఎకరాకు 60 కేజీలు గింజలను విత్తడం ద్వారా ఒక చదరపు మీటరుకు 33 మొక్కలు సాంద్రత ఉండేటట్లు చూసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఏడీఏ కె.జగన్మోహన్‌రావు, మండల వ్యవసాయాశాఖాదికారి ఎస్.గోవిందరావు, వీఏఏ ఎం.మాధవి, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబా ఆలయ 20వ వార్షికోత్సవం

వంగర మార్చి 4, ప్రభాతవార్త



మద్దువలస గొర్రెల శ్రీరాములు నాయుడు ప్రాజెక్టుకు ఆనుకొనిఉన్న సంజీవిని కొండపై వెలసి ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్స వం ఆలయ కమిటీ బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ఆలయ అర్చకులు శరత్ శర్మ ఆధ్వర్యంలో బాబా వారికి వివిధ గ్రామాల లైన మగ్గురు సరసన పల్లి జగన్నాథవలస సంగాం మద్దువలస నీలాయవలస తదితర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ శిరిడిసాయి బాబా వారికి టెంకాయ అభిషేకాలు పాలాభిషేకాలు విభూది అభిషేకాలు భక్తులుర్పహించారు. ఈ కార్యక్రమంలోని భాగంగా శ్రీ శిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వహించారు.

## గిరిజనుల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలి : ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్



సీతంపేట, మార్చి 4 ప్రభాతవార్త

గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చినట్లయితే సమస్య పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్ అన్నారు. బుధవారం ఆయన సీతంపేట ఐటిడిఎ పరిధిలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల గిరిజన సంఘాల ప్రతినిధులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఆశ్రమ పాఠశాలల్లో ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. గిరిజనుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, ఐటిడిఎ ద్వారా పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఇప్పటికే ఐటీడీఏ ద్వారా గిరిజనులకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల ప్రతినిధులు బిడ్డిక శ్రీను. బిడ్డక తేజేశ్వరరావు బైర్సింగ్ లక్ష్మీనారాయణ, బిడ్డక ఉమామహేశ్వరరావు, పురుషోత్తం బిడ్డక రామ్మోహన్‌రావు, మూటక ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల మరమ్మతులకు రూ.410 లక్షలు మంజూరు

### ఎమ్మెల్యే, పియుసి కమిటీ ఛైర్మన్ కూన



ఆమదాలవలస, మార్చి 4 (ప్రభాతవార్త)

ఆముదలవలస నియోజకవర్గంలో పరిధిలో గ్రామీణ ప్రాంతా రహదారుల మరమ్మతులకు రూ.410 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే, పియుసి కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీ రోడ్డు నుండి పురుషోత్తపురం వరకు రామచంద్రపురం మీదుగా 2.89 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.90 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రాగోలు పాలకొండ రోడ్డు పెద్ద దాసరిపేట, ముద్దాడపేట, తొగారం, కొర్లకోట రోడ్డు 5.4 కిలోమీటర్ల దూరం కి రూ. 320 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. నియోజవర్గంలో రోడ్ల దుస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లిన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. ఈ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజల యొక్క అవసరాలను తీర్చాలని అధికారులను ఎమ్మెల్యే రవికుమార్ కోరారు. ఈ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## జనసేన పార్టీలో చేరిన డాక్టర్ రామారావు



రణస్థలం, మార్చి 4 ప్రభాతవార్త

జనసేన పార్టీ అధినేత, ఎమ్మెల్సీ కే.నాగేంద్ర బాబు సమక్షంలో హైదరాబాద్‌లో బుధవారం రణస్థలం మండల కేంద్రం జెఆర్ పురానికి చెందిన డాక్టర్ దురగాశి రామారావు చేరారు. గత 35 ఏళ్లుగా ఈయన గ్రామీణ వైద్యుడిగా రణస్థలం, లావేరు మండలాల్లో నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటికీ ఆయన ఎచ్చెర్ల నియోజకవర్గం గ్రామీణ వైద్యుల సంఘం గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఈయనకు చిన్ననాటి నుంచి మెగా స్టార్ చిరంజీవి అంటే విపరీతమైన అభిమానం. ఆ అభిమానంతో అప్పట్లో చిరంజీవి స్థాపించిన ప్రజా రాజ్యం పార్టీలో చేరి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ఆ తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి ఆ పార్టీ మండల ఉపాధ్యక్షులుగా పనిచేశారు. ఇప్పటికీ మెగా ఫ్యామిలీ హీరోల సినిమాలు విడుదల అయితే తన అనుచరులతో బ్యానర్లు కట్టించడంతో పాటు తొలిరోజే సినిమాను చూసి తన అభిమానాన్ని చాటుకుంటారు. ఇలా ఒకవైపు ఇతర పార్టీలో ఇమడలేక మరోవైపు మనస్సు నిండా మెగా ఫ్యామిలీపై నింపుకున్న అభిమానంతో ఆయన జనసేన పార్టీలో చేరారు. ఈయన జనసేన పార్టీలో చేరడంతో ఆ పార్టీ మరింత బలోపేతం అవుతుందని రాజకీయ విశ్లేషకులు, పార్టీ కేడర్, పవన్ కళ్యాణ్ అభిమానులు భావిస్తున్నారు. ఆ పార్టీ నాయకులు విశ్వక్ సేన, వడ్డాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : ఏఎస్ఐ శ్రీరామ్మూర్తి



పాతపట్నం, మార్చి 4 ప్రభాతవార్త:

నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని స్థానిక పోలీసులు మరియు ఈగల్ టీం సభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కిరణ్మయి డిగ్రీ కళాశాల వేదికగా మాదకద్రవ్యాల వలన కలుగు అనార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీరామమూర్తి మాట్లాడుతూ గంజాయి, ఇతర డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించారు. సరదా కోసం అలవాటు చేసుకునే వ్యసనాలు చివరకు ప్రాణాంతకంగా మారుతాయని హెచ్చరించారు. సమాజంలో నేర రహిత వాతావరణాన్ని పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈగల్ టీం సభ్యులు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రవాణా లేదా వినియోగంలో పట్టుబడితే ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం ఎదుర్కోవాల్సిన కఠిన శిక్షల గురించి అవగాహన కల్పించారు. ఈ కేసుల్లో ఇరుక్కుంటే ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోవడమే కాకుండా, విదేశాలకు వెళ్లే అవకాశం కూడా ఉండదని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల విక్రయాలు లేదా విని యోగం గురించి ఎటువంటి సమాచారం తెలిసినా భయం లేకుండా ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీని ఆకస్మిక సందర్శన



కోటబొమ్మాళి, మార్చి 4 ప్రభాతవార్త:

కొత్తపేటలోని కేజీబీవీ పాఠశాలను మండల పరిషత్ పరిపాలనాధికారి, పాఠశాల ప్రత్యేక అధికారి నారాయణరావు బుధవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టి పరిశీలించగా మొత్తం 273 విద్యార్థునులకు గాను 257 మంది హాజరులో ఉన్నారు. అలాగే ఆహార పట్టిక ప్రాప్తికి 245 గుడ్లు కూర అందించినట్లు ఆయన గుర్తించారు. అలాగే కాలపరిమితి తేదీలను పరిశీలించగా సక్రమంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు పెట్టే పెసర పప్పు నాణ్యమైనది పెట్టాలని ఆయన సూచించారు. సరుకుల నిల్వల రిజిస్టర్‌ను పరిశీలించి, నిల్వలు సరిపోయినట్లు ఆయన గుర్తించారు. భోజన శాల మాత్రం చాలా ఇబ్బందికరంగా ఉందని, దానిని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

## పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి : కమిషనర్ రామచంద్రరావు



రాజాం, మార్చి 4 ప్రభాతవార్త:

రాజాం పురపాలక సంఘంలో బకాయిలు ఉన్న ఇంటి పన్నులు, నీటి పన్నుల వసూలలో భాగంగా మున్సిపల్ కమీషనర్ ఏ.రామచంద్రరావు బుచ్చెంపేట సచివాలయ పరిధిలో పర్యటించటం జరిగినది. రూ.4 కోట్ల డిమాండ్‌కు గాను ఇప్పటివరకు రూ.2 కోట్ల 54లక్షలు వసూలు చేయటం జరిగిందని, మిగిలిన రూ.1కోటి 46 లక్షలు వసూలు చేయటానికి పురపాలక సంఘ ఉద్యోగులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయటం జరిగిందని, ఈ బృందాలు ప్రతి రోజూ ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి, బకాయి ఉన్న ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు వసూలు చేస్తున్నట్లు కమీషనర్ తెలిపారు.

## నూతన ఎంఈవోగా సూర్యారావు



ఇచ్ఛాపురం, మార్చి 4 ప్రభాతవార్త:

ఇచ్ఛాపురం మండల విద్యావనరుల కేంద్రంలో నూతన మండల విద్యాశాఖాధికారి1 (పూర్తి ఆదనపు భాద్యతలతో)గా ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.సూర్యారావు విద్యాశాఖ ఆదేశానుసారం ఎంఈవో 1 గా బాధ్యతలు చేపట్టారు. ఎం ఈ వో 2 ఎస్.విశ్వనాథం సాదరంగా ఆహ్వానించి పుష్ప గుచ్చంతో అభినందించారు. వీరితోపాటు సి ఎం ఆర్ టి లు, ఎం అర్ సి సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

## నేడు మెగా రక్తదాన శిబిరం

రాజాం, మార్చి 4 ప్రభాతవార్త

మహిళా సారధికత వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆదేశాలు మేరకు నేడు రాజాం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పట్టణ సీఐ కె.అశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, యువజన సంఘం నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

## ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలి



కోటబొమ్మాళి, మార్చి 4 ప్రభాతవార్త:

ఇంటి పన్నులు వసూళ్లను ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాణాధికారి డి.సత్యన్నారాయణ కోరారు. ఆయన బుధవారం సాయం కాలం మేజర్ పంచాయతీ కోటబొమ్మాళిలోని ఇంటి పన్నులు వసూళ్ల తీరును ఆయన పరిశీలించారు. సిబ్బంది ఎలాంటి అలసత్వం వహించకుండా శత శాతం ఇంటి పన్నులు వసూళ్లను చేరుకోవాలని సూచించారు. ఎటువంటి బకాయిలు ఉండకూడదన్నారు. పలు గృహాల యజమానులకు ఇంటి పన్నులు గురించి అవగాహన కల్పించారు. ఆయన పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.ఫణీంద్ర కుమార్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# శ్రీకాకుళం వార్త



## పోలీసులు ఆధ్వర్యంలో మహిళ సాధికారికత వారోత్సవాలు



రాజాం, మార్చి 4 ప్రభాతవార్త

మహిళా సాధికారత వారోత్సవాలు సందర్భంగా రాజాం పట్టణంలో శ్రీ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమంలో విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలన్ని రాజాం టౌన్ ఎస్సై కే.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, సెల్ఫ్ డిఫెన్స్‌లో మెళకువలను నేర్చుకుని ఆనందం వ్యక్తం చేశారు.

## ఈ నెల 6న వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం ప్రారంభం



ఇచ్ఛాపురం, మార్చి 4 ప్రభాతవార్త:

ఈ నెల 6వ తారీకున ఇచ్ఛాపురం పట్టణం నందు సబ్‌స్టేషన్ సమీపంలో ఉదయం 11:06 నిమిషాలకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభించనున్నట్లు ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.6.55 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టి సుమారు 80 పనులు పూర్తి చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వంలో ఆసుపత్రి పనులలో పురోగతి లేకుండా పోవటం వలన ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రాకుండా పోయాయి. బారువ సామాజిక ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలనకు రానున్న వైఎస్సార్‌సీపీ శ్రీకా కుళం జిల్లా నాయకులు ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజు, పిరియా విజ యమ్మ, నర్తు రామారావు, నరేష్ కుమార్ అగర్వాల్, పిరియా సాయిరాజు, నర్తు నరేంద్ర తదితర పెద్దలు పాల్గొనే పర్యటనకు సంబందించిన సన్నాహక సమావేశం జరిగింది. నియోజకవర్గం వర్గంలోని వివిధ గ్రామాల లోని, పట్టణాలలోని నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఇచ్ఛాపురం పట్టణ వైస్సార్సీపీ అధ్యక్షులు ప్రకాష్రావు పట్నాయక్, సాలిన గాంధీ, ప్రత్తి అన్వేష్, బాకీ లక్ష్మీనారాయణ, చల్ల దేవరాజు, గణాల చిరంజీవి, పిన్నింటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేకంగా కూటమి ప్రభుత్వ బడ్జెట్ : మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం, మార్చి 4 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రజావ్యతిరేకంగా ఉందని, పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిందని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మండిపడ్డారు. స్థానిక వైకాపా కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ విధంగా అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎక్కడా పేద ప్రజల సంక్షేమం గురించి ప్రస్తావించలేదని విమర్శించారు. గ్రామాల అభివృద్ధి, రైతులకు భరోసా, మహిళల ఆర్థిక స్థితిగతుల మెరుగుదల వంటి అంశాలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు సరైన నిధులు కేటాయించకుండా పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే తిరుపతి లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చిందని, ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇటువంటి సున్నితమైన అంశాలను వాడుకుంటున్నారని ఆమె అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శాసనమండలి ఛైర్మన్ పై, వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను రెడ్డి శాంతి తీవ్రంగా ఖండించారు. మతపరమైన వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని, అచ్చెన్నాయుడు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే వారికి బుద్ధి చెబుతారని, వైఎస్సార్సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా బోర్లు మరమ్మత్తు



వంగర మార్చి 4 , ప్రభాతవార్త

వేసవి కాలము గ్రామాల్లోనీటి ఎద్దడి లేకుండా క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామాల్లో పాడైపోయి నటువంటి త్రాగునీటి బోర్డులను మరమ్మతులు చేపడుతున్నారు. ఈ క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం భాగేంపేట పట్టు వర్ధనం నీలా యవలస గ్రామాల్లో మరమ్మతులకు గురైనటువంటి త్రాగునీటి బోర్లను మరమ్మతులు చేపట్టారు. వేసవికాలంలో గ్రామాల్లో త్రాగునీటి సమస్య ఎక్కడ తలెత్తకుండా ముందస్తుగా బోర్లు మరమ్మతులు చేస్తున్నట్లు ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది తెలిపారు.

## పాత నేరస్థులపై నిఘా, కౌన్సిలింగ్ తప్పనసరి

### పెండింగ్ కేసుల తగ్గింపు, కోర్టు వ్యవహారాల్లో సమయపాలన -ప్రజా సేవా దృక్పథంతో పనిచేయాలి -జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి -నెలవారీ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సమగ్రక్రైమ్ రివ్యూ

శ్రీకాకుళం,మార్చి 04, ప్రభాతవార్త



పాత నేరస్థులపై నిఘా, కౌన్సిలింగ్ తప్పనసరి అని సూచించి,కేసులు దర్యాప్తు,నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, కోర్టు వ్యవహారాలు, నాన్ బెయిల్బుల్ వారెంట్లు అమలు, చర్యలు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవల అంశాలపై పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. జిల్లా పరిధిలోని సబ్‌డివిజన్ల డీఎస్పీలు,సర్కిల్ ఇన్స్పెక్టర్లు,ఎస్.హెచ్.ఓలు హాజరయ్యారు. ఎస్పీ పలు కీలక అంశాలపై విపులంగా చర్చించి, అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. హిస్టరీ షీట్లు, నేరస్తుల పర్యవేక్షణ జిల్లాలో కొత్తగా ప్రారంభించిన హిస్టరీ షీట్లు, పాత హిస్టరీ షీట్లపై కౌన్సి లింగ్ నిర్వహణపై సమీక్షించారు. హిస్టరీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందిన పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల స్వీకరణ) వినతుల పరిష్కార స్థితిని సమీక్షించి, ప్రతి వినతిని చట్టపరంగా, సమయపాలనతో పరిష్కరించాలని సూచించారు. ప్రజల నమ్మకం నిలబెట్టే విధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్రైమ్, లా అండ్ఆర్డర్, విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర అంశాల్లో అధికారుల వారీ పనితీరును సమీక్షించారు. ముఖ్యమైన పెండింగ్ కేసులు దర్యాప్తుపై ఆరా తీస్తూ పెండింగ్‌నకు గల కారణాలు, దర్యాప్తులో పాటించవలసిన నియమాలపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీర్ఘకాల పెండింగ్ కేసులు,మిస్సింగ్ కేసులు సహా అన్ని హెడ్‌లలో యు.ఐ కేసుల స్థితిని సమీక్షించారు. దీర్ఘకాల పెండింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని ఆదేశించారు. స్మార్ట్ పోలీసింగ్, నూతన క్రిమినల్ చట్టాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ స్మార్ట్ పోలీసింగ్ అమలు చేయాలని సూచించారు. ప్రతి అధికారి చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఈ-చలాన్ల విధింపు, వసూళ్ల పురోగతిని సమీక్షించారు. నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు, చార్జ్ షీట్లు దాఖలు తదితర కోర్టు సంబంధిత అంశాలను సమీక్షించి, సమయపాలనతో వ్యవహరించాలని ఆదేశించారు. అదనపు ఎస్పీలు కెవి రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, ఎస్బి సిఐ ఇమాన్యూవల్ రాజు, డిసిఆర్బి సీఐ శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మండపాన్ని ఢీకొన్న లారీ

సోంపేట (ప్రభాతవార్త)



సోంపేట మండలం జింకిభద్ర గ్రామం లోని శివాలయం వద్ద ఉన్న మండపాన్ని బుధవారం నాడు ఒక లారీ ఢీకొనడంతో మండపం పూర్తిగా కూలిపోయింది. ఈ ఘటన ఆకస్మికంగా చోటుచేసుకోవడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడం ఒక పెద్ద ఉపశమనం కలిగించింది. సంఘటన సమయంలో మండపం సమీపంలో ఉన్న ఒక ద్విచక్ర వాహనం పూర్తిగా దెబ్బతింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత అధికారులు కూడా ఘటనపై విచారణ చేపట్టినట్లు సమాచారం. గ్రామస్థులు శివాలయం వద్ద రహదారి పక్కన వాహనాలు నెమ్మదిగా నడపాలని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆట

## ప్రేగ్ చెస్ ఫెస్టివల్‌లో గుకేష్ ఓటమి



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజు 2026 ప్రేగ్ చెస్ ఫెస్టివల్‌లో తన పోరాటాన్ని ఓటమితో కొనసాగించాడు. చెకియాలో జరిగిన తన చివరి నాలుగు ఆటలలో మూడవ ఓటమిని చవిచూశాడు. తెల్లటి పావులతో ఆడుతున్న గుకేష్, ఎండ్‌గేమ్‌లో జరిగిన పెద్ద పొరపాటు కారణంగా 48 కదలికలలో తన దేశస్థుడు అరవింద్ చితంబరంకు తలవంచాడు. ఉజెబికిస్తాన్‌కు చెందిఇన నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ చేతిలో 5వ రౌండ్ ఓటమి తర్వాత ఇది అతని వరుస రెండవ ఓటమి. దీంతో అతను ఇప్పుడు 6 ఆటలలో కేవలం 1.5 పాయింట్లతో చివరి స్థానానికి పడిపోయాడు. మరోపక్క డిఫెండింగ్ ఛాంపియన్ గ్రాండ్ మాస్టర్ అరవింద్ చితంబరం తన రెండు మ్యాచ్‌ల పరాజయాల పరంపరను ముగించాడు. తాజాగా గుకేష్‌పై గెలుపుతో 2.5 పాయింట్లతో సంయుక్తంగా 6వ స్థానంలో ఉన్నాడు. అతను ప్రస్తుత నాయకుడు నెదర్లాండ్స్‌కు చెందిన జోర్డెన్ వాన్ ఫారెస్ట్ కంటే రెండు పాయింట్లు వెనుకబడి ఉన్నాడు. అతని టైటిల్‌ను కాపాడుకోవడం అతనికి ఇంకా 3 ఆటలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఏడో రౌండ్‌లో అతను ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ యాకుబ్బోవ్‌తో తలపడనుండగా, గుకేష్ ఇరానియన్ గ్రాండ్ మాస్టర్ పర్హామ్ మగ్సూద్లూతో తలపడనున్నాడు. ప్రేగ్‌లో 19.5 రేటింగ్ పాయింట్లను కోల్పోయి, లైవ్ నీఁదీని క్లాసికల్ రేటింగ్స్‌లో 20వ స్థానానికి పడిపోయిన గుకేష్ తిరిగి తన ఆధిక్యాన్ని సంపాదించాలనే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇక ఛాలెంజర్స్ విభాగంలో, గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్, గ్రాండ్‌మాస్టర్ సూర్య శేఖర్ గంగూలీ ఇద్దరూ తమ తమ ఆరో రౌండ్ ఆటలలో డ్రాగా ముగిసారు.

## బిల్లీ జీన్ కింగ్ కప్: ఐదుగురు సభ్యుల జట్టు ఎంపిక



వైష్ణవి అరంగేట్రం

**న్యూఢిల్లీ:** బిల్లీ జీన్ కింగ్ కప్-2026 కోసం భారత్ జట్టు ఖరారైంది. ఏప్రిల్ 7వ తేదీ నుండి 11 వరకు డిఎల్‌టిఎ స్టేడియంలో జరిగే బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓషియానియా గ్రూప్ టోర్నమెంట్ కోసం ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ (ఎఐటిఎ) ఐదుగురు సభ్యుల జట్టును ప్రకటించింది. వైదేహీ చౌదరి రిజర్వ్ ప్లేయర్‌గా ఉన్న జట్టులో సహజ యమలపల్లి, వైష్ణవి అడ్కర్, శ్రీవల్లి భమిడిపాటి, రుతుజా భోసాలే, అంకిత రైనాలకు చోటు దక్కింది. వైషాన్వి బిజెకె కప్‌లో అరంగేట్రం చేయనుంది. సానియా మీర్జా తర్వాత డబ్ల్యూ100 ఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయ మహిళల సింగిల్స్ క్రీడాకారిణిగా 21 ఏళ్ల ఆమె రికార్డు పుస్తకాల్లో తన పేరును లిఖించుకుంది.

అయితే, ఆమె బెంగళూరు ఓపెన్ 2026లో రన్నరప్‌గా నిలిచింది. ఇక విశాల్ ఉప్పల్ జట్టుకు నాయకత్వం వహిస్తాడు. మరియు రాధిక కనిత్కర్ కోచ్‌గా ఎంపికయ్యారు. ప్రొఫెషనల్ సెలక్షన్ కమిటీ సమావేశంలో ఈ జట్టును ఖరారు చేశారు. ఈ టోర్నమెంట్‌లో ఇండోనేషియా, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, న్యూజిలాండ్, థాయిలాండ్, మంగోలియా పాల్గొంటాయి. అన్ని జట్లు ఒకదానితో ఒకటి రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో ఆడతాయి. ప్రతి టై బెస్ట్ ఆఫ్ త్రీ మ్యాచ్‌గా ఉంటుంది. ఇందులో రెండు సింగిల్స్, ఒక డబుల్స్ మ్యాచ్ ఉంటాయి. ఈ ఏడాది చివర్లో జరగనున్న బిల్లీ జీన్ కింగ్ కప్ ప్లేఆఫ్‌లకు అగ్ర రెండు జట్లు అర్హత సాధిస్తాయి. గత సంవత్సరం, ఆతిథ్య భారత్ బిల్లీ జీన్ కింగ్ కప్ ప్లేఆఫ్‌లకు అర్హత సాధించింది. కానీ నెదర్లాండ్స్, స్లోవేనియా చేతిలో ఓడిపోయిన తర్వాత ప్లే ఆఫ్‌లను ముగించింది.

# నేడే రసవత్తర పోరు



### ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్‌లో
## సాత్విక్-చిరాగ్ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్‌లో భారత్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్ నిరాశపరచింది. బర్మింగ్‌హామ్‌లో బుధవారం జరిగిన ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్-2026 లో బుధవారం భారత పురుషుల డబుల్స్ జోడీ రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-శెట్టి చిరాగ్ మలేషియాకు చెందిన ఆరోన్ తాయ్-ఖై జింగ్ కాంగ్ చేతిలో జరిగిన 32వ రౌండ్ మ్యాచ్‌లో ఓడిపోయారు. ప్రపంచ నంబరు 4 జంట అయిన ఈ భారత్ డబుల్స్ జోడీ 42 నిమిషాల్లో 23-21, 21-12 తేడాతో ఓడిపోయి పోటీ నుంచి నిష్క్రమించింది. రెండు గేమ్ పాయింట్లను కాపాడుకుని స్కోరును 20-20తో సమం చేసే వరకు భారత జట్టు తొలి ఆటలో ఎక్కువ భాగం వెనుకబడి ఉంది. కానీ మలేషియా జంట ఓపెనర్‌ను కైవసం చేసుకోవడానికి నిర్ణయాత్మక పాయింట్లు సాధించింది. ఇక రెండో గేమ్ ఏకపక్షంగా సాగింది. ఒక దశలో రాంకిరెడ్డి మరియు శెట్టి ఏడు పాయింట్లతో వెనుకబడి ఉన్నారు.

### క్లైమాక్స్‌కు టి20 వరల్డ్ కప్
### సెమీ ఫైనల్లో భారత్, ఇంగ్లండ్ ఢీ



**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ 2026 క్లైమాక్స్‌కు వచ్చేసింది. ఈ నెల 5న ముంబైలోని వాంఖడే స్టేడియం సాక్షిగా భారత్, ఇంగ్లాండ్ జట్లు రెండో సెమీఫైనల్‌లో తలపడను న్నాయి. భారత్, ఇంగ్లాం డ్ జట్ల మధ్య టీ20 పోరు ఎప్పుడూ రసవత్త రంగానే ఉంటుంది. అయితే ఈ మెగా ఫైట్‌కు ముందు అభిమానులను ఒకే ఒక ప్రశ్న వేధిస్తోంది. వాతావరణ శాఖ చెబుతున్నట్లుగా ఒకవేళ వరుణుడు కన్నెర్ర చేసి మ్యాచ్‌ను అడ్డుకుంటే పరిస్థితి ఏంటి, గెలుపోటములు ఎలా నిర్ణయిస్తారు, ఏ జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్తుంది అనేది పెద్ద ప్రశ్న అయింది. నౌకౌట్ మ్యాచ్‌ల కోసం ఐసీసీ ప్రత్యేకంగా రిజర్వ్ డే సౌకర్యాన్ని కల్పించింది. అంటే, ఈ నె 5న వర్షం పడి మ్యాచ్ జరగకపోతే, మరుసటి రోజు 6న ఆ మ్యాచ్‌ను నిర్వహిస్తారు. ఒకవేళ 5 న మ్యాచ్ మొదలై, మధ్యలో వర్షం వస్తే ఎక్కడైతే ఆట ఆగిపోయిందో అక్కడి నుంచే రిజర్వ్ డే రోజున కొనసాగిస్తారు. ఫలితం మైదానంలోనే తేలాలన్నది ఐసీసీ ముఖ్య ఉద్దేశం. కానీ ఒకవేళ దురదృష్టవశాత్తూ మార్చి 5, 6 తేదీల్లో కూడా వర్షం తగ్గకుండా, ఒక్క బంతి కూడా పడకుండా మ్యాచ్ రద్దయితే మాత్రం టీమిండియాకు భారీ షాక్ తగిలే అవకాశం ఉంది. ఐసీసీ నిబంధనల ప్రకారం రెండు రోజులూ వర్షం వల్ల మ్యాచ్ సాధ్యం కాకపోతే, సూపర్ 8 దశలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన జట్టుకే ఫైనల్ టికెట్ దక్కుతుంది. ఇక్కడే భారత్‌కు చిక్కు వచ్చి పడింది. సూపర్ 8లో ఇంగ్లాండ్ ఆడిన మూడు మ్యాచుల్లోనూ గెలిచి అజేయంగా నిలిచింది. కానీ, భారత్ రెండు మ్యాచుల్లో గెలిచి, ఒక మ్యాచ్‌లో ఓటమి పాలైంది. ఈ లెక్కన చూస్తే, వర్షం వల్ల మ్యాచ్ పూర్తిగా రద్దయితే ఇంగ్లాండ్ నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. అందుకే భారత అభిమానులు ఇప్పుడు ఆకాశం వైపు చూస్తూ వర్షం పడకూడదని కోరుకుంటున్నారు. ఇక ఇప్పటివరకు ఈ రెండు జట్లు 29 సార్లు తలపడగా భారత్ 17 సార్లు, ఇంగ్లాండ్ 12 సార్లు విజయం సాధించాయి. వరల్డ్ కప్ చరిత్ర చూస్తే 2022 సెమీఫైనల్లో ఇంగ్లాండ్ భారత్‌ను 10 వికెట్ల తేడాతో ఓడించింది. 2024 సెమీఫైనల్లో భారత్ ప్రతీకారం తీర్చుకుని ఇంగ్లాండ్‌ను ఇంటికి పంపింది. ఇప్పుడు మూడోసారి సెమీఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. అదృష్టం ఎవరిని వరిస్తుందో, వరుణుడు ఎవరికి సహకరిస్తాడో చూడాలి.



## ఐటిఎఫ్ 35లో రెండో రౌండ్‌కు అంకిత, జీల్
### భారత్‌కు మిశ్రమ ఫలితాలు

**న్యూఢిల్లీ:** ఐటీఎఫ్ డబ్ల్యూ35 లో భారత స్టార్లు అంకిత రైనా-జీల్ దేశాయ్ రెండవ రౌండ్‌కు దూసుకెళ్లారు, అయితే కర్ణాటకకు చెందిన సోహా-సాదిక్ తొలి దశలోనే నిష్క్రమించారు. బుధవారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఎనిమిదో సీడ్ అంకిత రైనా అద్భుతమైన ప్రదర్శన చేసి తన తోటి భారత క్రీడాకారిణి సోనాల్ పాటిల్‌ను 6-1, 6-3 తేడాతో ఓడించింది. పాటిల్ తొలి గేమ్‌లో సర్వీస్‌ను పట్టుకోవడం ద్వారా ఆటను ప్రారంభించింది. కానీ రైనా త్వరగా నియంత్రణ సాధించి, తదుపరి ఆరు గేమ్‌లను గెలుచుకుని మొదటి సెట్‌ను ఆధిక్యంలో ముగించింది. రెండవ సెట్ ప్రారంభంలోనే ఇదే తరహాలో సాగింది, రైనా 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రైనా 5-2కి చేరుకుని మ్యాచ్‌ను ముగించే అవకాశం ఉన్నట్లు కనిపించినప్పటికీ, పాటిల్ తిరిగి పోరాడి 5-3తో స్కోరును సాధించాడు. అయితే, తరువాతి ఆటలో రైనా తదుపరి రౌండ్‌లో ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించింది. ఐదవ సీడ్ జీల్ దేశాయ్ కూడా తన తోటి భారత క్రీడాకారిణి జెన్నిఫర్ లుయిఖమ్‌పై పురోగతి సాధించింది. దేశాయ్ స్థిరమైన బేస్‌లైన్ ఆటతో 6-2తో ప్రారంభ సెట్‌ను గెలుచుకుంది. రెండవ సెట్‌లో ఆమె 2-1 ఆధిక్యాన్ని సాధించి చివరి రౌండ్‌లో తన స్థానాన్ని భద్రపరచుకుంది. టాప్ సీడ్ జాస్మిజ్న్ గింబ్రేరే 6-2, 6-1 తేడాతో ఐశ్వర్య జాదవ్ పై విజయం సాధించగా, ఆరో సీడ్ థాసపోర్న్ నక్లో కూడా వలేరియా సావినిఖ్ పై 6-3, 6-2 తేడాతో విజయం సాధించింది.

## రూపాయి భారీ పతనం
### డాలర్ వర్సెస్ రూపీ 92.16



**ముంబయి, మార్చి 4:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. యుద్ధ భయాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. దేశీయ కరెన్సీ రూపాయి విలువ మునుపెన్నడూ లేని విధంగా పాతాళానికి పడిపోవడంతో సామాన్యుల నుంచి ఇన్వెస్టర్ల వరకు అందరిలోనూ ఆందోళన మొదలైంది.

అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ రికార్డు స్థాయిలో క్షీణించింది. చరిత్రలో మొదటిసారిగా రూపాయి విలువ 92.16 మార్కును దాటి పడిపోయింది. యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం రూపాయి పతనానికి ప్రధాన కారణాలుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇంట్రాడేలోనే అత్యంత కనిష్టస్థాయికి చేరింది. 92.35గా నమోదయింది. ప్రారంభంలో 92.05గా కొనసాగుతూ మరింత పతనం అయింది. చివరకు 92.16వద్దముగిసింది.

ముందురోజు నష్టంనుంచి మరింతగాపెరిగి 67 పైసలు నష్టపోయింది. ఇది ఇలా ఉండగా యుద్ధ పరిస్థితుల ప్రభావం దలాల్ స్ట్రీట్‌పై తీవ్రంగా పడింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ) సూచీలు భారీగా పతనమయ్యాయి. కేవలం ఒక్క రోజు లావాదేవీల్లోనే ఇన్వెస్టర్లకు సంబంధించిన దాదాపు రూ. 9.7 లక్షల కోట్ల సంపద తుడిచి పెట్టుకుపోయింది. ఐటీ, బ్యాంకింగ్, ఆటోమొబైల్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం సంభవిస్తే ప్రపంచ సరఫరా గొలుసు దెబ్బతింటుందనే భయం మార్కెట్లను వెంటాడుతోంది. ముఖ్యంగా చమురు సరఫరాకు ఆటంకం కలిగితే పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఇది భారత ఆర్థిక వ్యవస్థపై అదనపు భారాన్ని మోపుతుంది. సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం ధరలు కూడా ఈ ఉద్రిక్తతల వల్ల భారీగా పెరిగే అవకాశం ఉంది.

వాణిజ్యం

# ‘10 లక్షలకోట్లు’ ఆవిరి
## మార్కెట్లను వెంటాడిన మిడిల్ ఈస్ట్ యుద్ధభేరి



**ముంబయి,మార్చి 4:** మధ్యప్రాచ్యంలో జరుగుతున్న భీకరపోరు భారత స్టాక్ మార్కెట్లను తీవ్రంగా దెబ్బతీసింది. అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతికూల పరిస్థితులతో పెట్టుబడిదారులు ఆందోళనకు గురయ్యారు. దీంతో వరుసగా మూడో సెషన్‌లో కూడా సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. ఇవాళ్టి ట్రేడింగ్‌లో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మార్కెట్లు కుప్పకూలాయి. ఇన్వెస్టర్ల సంపద రూ.10 లక్షలకోట్లు ఆవిరయిందన్న అంచనాలు ఉన్నాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1122.66 పాయింట్లు (1.40 ) నష్టపోయి 79,116.19 వద్ద స్థిరపడింది. గత 10 నెలల్లో సెన్సెక్స్‌కు ఇదే అత్యంత కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ కూడా 385.2 పాయింట్లు (1.6 ) పతనమై 24,480.5 వద్ద ముగిసింది. నిఫ్టీకి ఇది ఆరు నెలల కనిష్ఠ స్థాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మరింత ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.2 శాతం క్షీణించగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.1 శాతం పడిపోయింది. ఇది మార్కెట్‌లో విస్తృతమైన అమ్మకాల ఒత్తిడిని సూచిస్తోంది. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయింది. దీని తర్వాత నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ రియల్టీ సూచీలు కూడా భారీగా పతనమయ్యాయి.

ఈ ప్రతికూల మార్కెట్‌లోనూ నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఒక్కటే లాభాల్లో ముగియడం విశేషం. కొన్ని టెక్నాలజీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు లభించడమే దీనికి కారణం. సెన్సెక్స్ ప్యాక్‌లో భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా మాత్రమే లాభాలతో గట్టెక్కాయి. మరోవైపు, టాటా స్టీల్ షేరు అత్యధికంగా నష్టపోయింది. లార్సెన్ అండ్ టూబ్రో, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, ఇండిగో ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన షేర్లు కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితి పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని, దీంతో వారు తమ పొజిషన్లను తగ్గించుకుని రక్షణాత్మక వైఖరిని అవలంబిస్తున్నారని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. బిఎస్ఇలో 1025 షేర్లు మాత్రమే పెరిగాయి. 3295 కంపెనీలషేర్లు క్షీణించాయి. 125 కంపెనీలుమాత్రం ఎలాంటి మార్పులు లేవు. బ్రెంట్ ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్లు 2.01 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 83.41 డాలర్లుగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ ఎక్స్ఛేంజిపరంగా చూసేనత భారత రూపాయి 92.16వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ ఈ నాటికి 1.69శాతంపెరిగి రూ.1,63,740వద్ద ముగిసాయి.



## ఫిన్‌టెక్ యూనికార్న్ మనీవ్యూ ఐపిఒ!

**ముంబయి, మార్చి 4:** ఫిన్‌టెక్ యూనికార్న్ మనీవ్యూ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఐపిఒతో సంస్థ రూ.1500 కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. ఆఫర్‌ఫర్‌సేల్‌లో 13.61 కోట్లషేర్లను విక్రయిస్తోంది. ప్రమోటర్ పునీత్ అగర్వాల్ తన వాటాలను ఒఎఫ్ఎస్‌కింద విత్‌డ్రాచేస్తుంటే క్రిమ్సన్ వింటర్, యాక్సెల్ ఇండియా, యాక్సెస్‌గ్రోత్4 హోల్డింగ్స్, అపిస్‌గ్రోత్2 పిటిఇ సంస్థలు కూడా తమతమ వాటాలను మనీవ్యూలో విక్రయించనున్నాయి. ఎన్ఎస్ఇ, బిఎస్ఇల్లో ఈక్విటీషేర్లను లిస్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఈక్విటీషేర్లు రూ.300 కోట్లు ప్రి ఐపిఒ ప్లేస్‌మెంట్‌కింద కేటాయిస్తారు. యాక్సిస్ కేపిటల్, బిఒఎఫ్ఎ సెక్యూరిటీస్ ఇండియా, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, కోటక్ మహీంద్ర కేపిటల్‌కంపెనీలు బుక్‌రన్నింగ్ లీడ్‌మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. ఎంయుఎఫ్‌జి ఇండ్‌టైమ్ ఇండియాలు రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తోంది. రూ.650 కోట్లు రుణపంపిణీలకు కేటాయిస్తుంది. డిఫాల్ట్ లాస్ గ్యారంటీ ఏర్పాట్లకు రూ.450 కోట్లు కేటాయించింది. బెంగళూరు కేంద్రంగా ఉన్నఈ కంపెనీ డిజిటల్‌గా మాత్రమే కొనసాగుతోంది. 125 మిలియన్లమంది యూజర్లు ఉండగా సమిష్టి వృద్ధి 36.20శాతం, 99.55శాతం భారత్‌లోని పిన్‌కోడ్‌లకు సేవలందిస్తోంది. గత ఏడాది రూ.2379 కోట్లు రాబడులు సాధించింది. నికరలాభం కూడా రూ.240 కోట్లుగా ఉంది. తొమ్మిదినెలల కాలానికిగానున రాబడులు రూ.2409 కోట్లుకాగా నికరలాభం రూ.245 కోట్లు సాధించినట్లు కంపెనీ ప్రకటించింది.

## 1.05 బిలియన్ డాలర్లకు ఫోన్‌పే ఐపిఒ



**ముంబయి, మార్చి 4:** వాల్‌మార్ట్ ఆధ్వర్యంలోని ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ఐపిఒద్వారా 99 మిలియన్ డాలర్లనుంచి 1.05 బిలియన్ డాలర్లను సమీకరించాలనినిర్ణయించింది. ఇందుకోసం సంస్థ తన మొత్తం మార్కెట్ విలువలు 9 బిలియన్ డాలర్లనుంచి 10.5 బిలియన్ డాలర్లుగా ఉండవచ్చని అంచనావేస్తోంది. తుదినివేదికలతో సెబికి కూడా నివేదిక ఇస్తుందని అంచనా. అంతకుముందు కంపెనీ 12 బిలియన్ డాలర్ల విలువకట్టింది. ఫోన్‌పే గతంలో 100 మిలియన్ డాలర్లను 2023లో ప్రైవేటు మార్కెట్లనుంచి సమీకరించింది. అయితే వాల్‌మార్ట్ ఫోన్‌పేలో తన వాటాను 12శాతావరకూ కుదించింది. టైగర్ గ్లోబల్; మైక్రోసాఫ్ట్‌లు వారి వాటాలను పూర్తిగా ఐపిఒలోనే వినరకయించాలనినిర్ణయించాయి. ఈ మూడు సంస్థలు కూడా సుమారు 50.7 మిలియన్ వాటాలను ఆఫరింగ్‌లో విత్‌డ్రాచేస్తాయి. అయితే ఫోన్‌పే మాత్రం తన వాటాలను విక్రయించదు. గూగుల్‌పే, పేటిఎం ఇండియాలకు పోటీగా ఫోన్‌పై బహుముఖ వ్యాప్తిలోకి వచ్చింది. గత సెప్టెంబరులోనే ఐపిఒకు దరఖాస్తులుచేసింది. వచ్చే ఏప్రిల్ నాటికి ఈ ప్రక్రియను పూరినతచేసేందుకు కసరత్తులు ముమ్మరంచేసింది. అయితే ప్రస్తుత మధ్యప్రాచర్య వివాదంతో ఈ ఐపిఒ కొంతమేర వాయిదా పడుతుందని అంచనా.



## తమిళనాడులో ఎంఆర్‌ఎఫ్ కొత్త టైర్ల తయారీ యూనిట్

**ముంబయి, మార్చి 4:** టైర్ల తయారీ దిగ్గజం ఎంఆర్‌ఎఫ్ తమిళనాడు ప్రభుత్వంతో బుధవారం ఒప్పందంచేసుకుంది. రూ.5300 కోట్లు 12 ఏళ్లకాలంలో పెట్టుబడులు పెడతామని, కొత్త టైర్ల తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. సిప్‌కాట్ ఇండస్ట్రియల్‌పార్కు శివగంగ జిల్లాలో ఏర్పాటుచేస్తామని తెలిపింది. దీనివల్ల సుమారు వెయ్యిమందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వంప్రకటించింది. తమిళనాడు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఆర్‌ఎఫ్ సిఎండి కె ఎం మమ్మెన్, వైస్‌ఛైర్మన్ అరుణ్ మమ్మెన్ ఎండిసిఇఒ దారెజ్ అహ్మద్‌లు ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ప్రధాన కార్యదర్శి ఎన్ మురుగునాథమ్, పరిశ్రమల మంత్రి టిఆర్‌బి రాజా ఇతర ముఖ్య అధికారులున్నారు. చెన్నై కేంద్రంగా ఉన్న ఎంఆర్‌ఎఫ్ బిఎస్ఇ ఫైలింగ్‌లో ఈ వివరాలను వెల్లడించింది. ఇందుకోసం 12 ఏళ్లపాటు రూ.5300 కోట్లు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించామని వివరించింది.

## ఎయిరిండియా హోలీసేల్ బంపర్ ఆఫర్

**ముంబయి, మార్చి 4:** హోలీ పండుగను పురస్కరించుకుని విమానయాన సంస్థలు ఎయిరిండియా,ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకోసంస్పెషల్ హోలీ సేల్ ప్రకటించాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రకటించిన హోలీ సేల్‌లో భాగంగా ప్రయాణికులు హోలీసేల్ అనే కోడ్‌ను ఉపయోగించి టికెట్లపై తక్షణ తగ్గింపు పొంద వచ్చు. ఈ ఆఫర్ కింద దేశీయవిమాన టికెట్లపై ఫ్లాట్‌గారూ.350, అంతర్జాతీయప్రయాణాలపై రూ.500



తగ్గింపును అందిస్తోంది. ఈఆఫర్‌లో భాగంగా ఈ నెల 5వ తేదీలోపు టికెట్లు బుక్ చేసుకోవాలి. ఇలా బుక్ చేసుకున్న వారు 2026 ఫిబ్రవరి 28 నుంచి ఏప్రిల్ 30 మధ్య ఎప్పుడైనా ప్రయాణించవచ్చు. నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపులు జరిపితే కన్వీనియన్స్ ఫీజు కూడా ఉండదని సంస్థ స్పష్టం చేసింది. ఎయిరిండియా కూడా ఇదే తరహాలో ఆకర్షణీయమైన ఆఫర్‌ను తీసుకొచ్చింది. ఈ సంస్థ విమాన టికెట్లపై గరిష్ఠంగా రూ.3 వేల వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. ప్రయాణికులు హోలీసేల్ అనే కోడ్‌ను ఉపయోగించి మార్చి 5 లోపు టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ డిస్కౌంట్ టికెట్ బేస్ ఫేర్‌పై వర్తిస్తుంది. వన్‌వే, రౌండ్ ట్రిప్ ప్రయాణాలకు ఈ ఆఫర్ అందుబాటులో ఉన్నప్పటికీ, గ్రూప్ బుకింగ్స్‌కు వర్తించదని ఎయిరిండియా స్పష్టం చేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.